www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 1-2-2020 | పేజీలు: 14 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 287

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 6.11 తదుపరి అష్టమి; నక్షత్రం: అశ్విని రా. 8.54 తదుపరి భరణి; వర్జ్యం: సా. 4.26-6.13; దుర్ముహూర్తం: ఉ. 6.51-8.21; అమృతఘడియలు: మ. 12.53-2.39; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.07

విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

Lalithaa

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

విజయవాడ • వైజాగ్ • రాజమహేంద్రవరం • భీమవరం
కాకినాడ • తిరుపతి • హైదరాబాద్



25th SHOWROOM INAUGURATION COST PRICE SALE
IN ALL OUR SHOWROOMS
JAN 25 - FEB 09

## కృతజ్ఞతలు చెప్పే సమయమిది!

నిన్న ఆరంభించినట్టే ఉంది! పదేళ్ల క్రితం ఒక షోరూంగా ఉన్న మీ లలితా జ్యువెల్లరి, ఇప్పుడు తన ప్రతిష్ఠాత్మకమైన 25వ షోరూంను మీ దివ్యాశిస్సులతో కాకినాడలో ఆరంభించాం! ఎవరి అండదండలు లేకుండా మిమ్మల్ని మాత్రమే నమ్ముకుని ఆరంభించిన ప్రయాణమిది.

మీరు ప్రసాదించిన జీవితమిది! కష్టపడి సంపాదించిన మీ డబ్బుకు మరెవరూ ఇవ్వని విలువను తక్కువ తరుగు ద్వారా, దాపరికం లేకుండా ఇచ్చేందుకు ముందుకొచ్చా. అందుకు మీరు ఇచ్చిన ఆదరణే ఈ గొప్ప ఎదుగుదలకు కారణం.

మిమ్మల్ని నమ్ముకుని మొదలుపెట్టా.. మిమ్మల్ని నమ్ముకుని కొనసాగిస్తా!

## 25వ షోరూం ప్రారంభోత్సవ కానుక!

### అన్ని షోరూంలలోనూ అన్ని నగలకు!

బంగారు నగలపై ఇప్పటికే ఉన్న మా అతి తక్కువ తరుగులో ఇంకా 2% తగ్గింపు

వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.3000 తగ్గింపు
రూ.~~46000~~ రూ.43000 నుంచి

### మనదగ్గర జిమ్మిక్కులు లేవండి!

ఈ ఆఫర్‌ను హృదయపూర్వకంగా ఇస్తున్నా. ఆఫర్ కోసం ముందుగా ధరలు పెంచి, ఆ తర్వాత తగ్గించి ఇచ్చేవిధమైన జిమ్మిక్కులు లలితా జ్యువెల్లరి ఎప్పటికీ చేయదు. అలాంటివి నాకు చేతకాదు. ఒకటి లేదా రెండు నెలల ముందు మీరు మా వద్ద తీసుకున్న నగల బిల్లును తెచ్చి... అప్పటి, ఇప్పటి తరుగును కూడా చెక్ చేయండి! ఇప్పుడు మార్కెట్‌లో ఉన్న అన్ని ఆఫర్లతోనూ పోల్చండి. మాది న్యాయమైన కానుక. పోల్చిచూసి మీరే నిర్ణయం తీసుకోండి. పరిమిత కాల ఆఫర్ ఇది. అందువల్ల ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనసారా కోరుతున్నా!

### ఒక సవినయ మనవి!

మీ ఆశిస్సులతో 25 షోరూంలకు అభివృద్ధి చెందాం. మీ ఆదరణతో ఇంకా పలు షోరూంలను ప్రారంభించనున్నాం. ఈ వేగమైన అభివృద్ధి క్రమంలో పొరబాటున కొన్ని తప్పులు దొర్లి ఉంటాయి. కానీ, ఎంత ఎత్తుకు ఎదిగినా, మీకు చేసే సేవలో ఎలాంటి మార్పు ఉండదని మనసారా చెబుతున్నా. మీ మార్గ నిర్దేశంతో వాటిని పరిష్కరించాలని అనుకుంటున్నా. తప్పులు, లోటుపాట్లను, మా సేవలను మెరుగుపరుచుకునేందుకు మీ సలహాలను మా ఈమెయిల్‌కు పంపాల్సిందిగా దయచేసి కోరుకుంటున్నా : chairman@lalithaajewellery.com

ఈ అవకాశం జనవరి 25 నుంచి ఫిబ్రవరి 9వతేదీ వరకు

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్ లక్షలాది డిజైన్లు!

## తప్పక చూడండి!

### డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ ఇంటర్వ్యూను తప్పకుండా చూడండి.

యువత జీవితంలో విజయం సాధించేందుకు పలు సలహాలు, సూచనలు ఇందులో ఉన్నాయి. నగలు కొనడం, డబ్బు ఆదా చేయడానికి సంబంధించి, అవగాహన కల్పించే విషయాలు కూడా ఉన్నాయి.

https://youtu.be/HYBogKvFscY

1.4 M VIEWS

అద్వితీయమైన మా నగల కొనుగోలు పథకానికి సంబంధించి వివరాలను ఈ వీడియో ద్వారా తెలుసుకోండి.

https://youtu.be/6qdydUnfIVI

Lalithaa

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

హైదరాబాద్ • విజయవాడ • వైజాగ్ • రాజమహేంద్రవరం • భీమవరం
కాకినాడ • తిరుపతి • చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం
మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • రామనాథపురం
కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు

epaper.andhrajyothy.com

# మీరు కొంటున్నది నగలు.. శ్రద్ధ చాలా ముఖ్యం!

## ప్రతి గ్రాములోనూ మీ శ్రమ ఉంది

### పోల్చండి

దయచేసి మా వద్ద ఎస్టిమేట్‌స్లిప్, మొబైల్‌లో ఫొటోను తీసుకోండి. నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చిచూడండి. ఈ ఆఫర్ తర్వాత కూడా పోల్చిచూడండి. ఎక్కడ తక్కువగా ఉంటే అక్కడే కొనండి.



### నాణ్యత

BIS 916 హాల్‌మార్క్ నగలను మాత్రమే కొనండి. హాల్‌మార్కు లేకుండా నగలు కొంటే బంగారం నాణ్యత ఏంటనేది తెలియదు. అంత డబ్బులు పెట్టి మనం ఏం కొంటున్నామో కూడా తెలియకపోతే ఎలా?




### బిల్లు

దయచేసి బిల్లు లేకుండా నగలు కొనకండి. జీఎస్టీ చెల్లించి బిల్లు తీసుకుంటే మీ కొనుగోలు సంపూర్ణం అవుతుంది. దేశానికి, ప్రభుత్వానికి కూడా మేలు చేకూరుతుంది. బిల్లులో నగల వివరాలు ఉన్నందువల్ల భవిష్యత్తులో మీకు భద్రత ఉంటుంది.



### డిజైన్

మావద్ద లక్షలాది డిజైన్లు ఉన్నాయి. అవి కాకుండా మీకు నచ్చిన డిజైన్ ఫొటో మాకు చూపిస్తే మీకోసం ప్రత్యేకంగా 15 నుంచి 25 రోజుల్లో అందంగా చేసిస్తాం.



**వజ్రాభరణాలు:** క్యారెట్‌కు రూ.**3000** తగ్గింపు! రూ.~~46000~~ రూ. **43000**నుంచి! V.A. గ్రాముకురూ.975 మాత్రమే

## వజ్రాభరణాల విక్రయాలలోనే ఎక్కువ జిమ్మిక్కులు ఉన్నాయి. ఈ విషయాలను తప్పక చదవి జాగ్రత్త పడండి.



**అథెంటిసిటి (నాణ్యత నిర్ధారణ) సర్టిఫికెట్**

షోరూంవాళ్లు సొంతంగా తయారు చేసే 'ఇన్‌హౌస్' సర్టిఫికెట్‌ను నమ్మకండి. ఎందుకంటే, తమ వస్తువు నాణ్యతలేనిదని ఎవరైనా చెబుతారా? గుర్తింపు పొందిన మూడోవ్యక్తి (సంస్థ) ఇచ్చే నాణ్యత సర్టిఫికెట్ కావాలని అడగండి. (లలితా జ్యువెల్లరిలో ప్రతి వజ్రాభరణం అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన జెమ్మాలజీ సంస్థ ఇచ్చే సర్టిఫికెట్ పొందినవే.)

**ఎక్స్ఛేంజ్ పాలసి**

వజ్రాభరణాలకు మార్పిడికైతే 100% బైబ్యాక్, నగదుగా, బంగారు నగలుగా అయితే 85% బైబ్యాక్ ఉండాలి. (ఎక్స్ఛేంజ్ చేసుకునే రోజు నాటి మా వజ్రపు ధర ప్రకారం. లలితా జ్యువెల్లరిలో మార్పిడి చేసుకోవచ్చు.)

**కలర్ & క్లారిటి**

మీరు కొనే వజ్రాభరణాలకు E-F కలర్‌గ్రేడ్ మరియు VVS క్లారిటి ఉన్నాయా అని సరిచూసుకోండి. తక్కువ ధరకు లభిస్తున్నాయనే కారణం వల్ల G-H కలర్‌గ్రేడ్ వంటి నాణ్యత తక్కువైన ఆభరణాలను కొనకూడదు. (లలితా జ్యువెల్లరిలో E-F కలర్‌గ్రేడ్, VVS క్లారిటి వజ్రాభరణాలు మాత్రమే అందజేస్తున్నాం.)

**క్యారెట్‌కు అధిక ధర చెల్లిస్తే ఏమవుతుంది?**

4 క్యారెట్ బరువున్న వజ్రాభరణానికి కేవలం రూ.5,000 అధికంగా ఇచ్చినా కానీ రూ.20,000 కోల్పోవాల్సి వస్తుంది! లలితా జ్యువెల్లరిలో రూ.43,000లకే అందిస్తున్న ఈ వజ్రాభరణాన్ని మార్కెట్‌లో రూ.60,000, రూ.70,000 అంటూ విక్రయిస్తున్నారు. ఆఖరి ధరల్లో వ్యత్యాసమేంటో మీరే లెక్కగట్టి తెలుసుకోవచ్చు!

**ధరలు చెక్ చేయండి!**



| వజ్రపు వ్యాసం (సెంట్లలో) | మార్కెట్లో వజ్రపు ధర క్యారెట్‌కి | లలితా జ్యువెల్లరిలో వజ్రపు ధర క్యారెట్‌కి |
|---|---|---|
| 0 నుంచి 0.0749 | రూ.60000 నుంచి 76000 | రూ.43000 |
| 0.0750 నుంచి 0.1349 | రూ.76000 నుంచి 85000 | రూ.63500 |
| 0.1350 నుంచి 0.1749 | రూ.98500 నుంచి 105000 | రూ.80000 |
| 0.1750 నుంచి 0.2249 | రూ.108500 నుంచి 112000 | రూ.91000 |

ధరలు సర్వదేశ ఎగుమతి దిగుమతులకు తగినట్టు నిర్ణయించబడతాయి.

## నగల కొనుగోలు పథకం

లలితా జ్యువెల్లరి మాత్రమే అందిస్తోంది. **మార్కెట్‌లోనే అధిక ప్రయోజనాలు అందించే 2 పథకాలు !**

**11 నెలల 'నగల కొనుగోలు పథకం'.**

**తొలి వాయిదా ఉచితం**
**+**
**తరుగు (V.A.) 50% ఉచితం**

అన్ని బంగారు నగలకు వర్తిస్తుంది.

చిన్న వాయిదాలు: రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500

ప్రతినెల మీరు చెల్లించే నగదు, ఆరోజునాటి విలువ ప్రకారం 22 క్యారెట్ బంగారంగా జమా చేయబడుతుంది.

**అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్**

One Time Payment !

**ఏ నగకూ 100% V.A. లేదు**

5 నెలల నుంచే ఫలితం!

11 నెలల తర్వాత నగను కొనేటప్పుడు, 14% లేదా 16% వరకు V.A. ఉన్న నగ అయినప్పటికీ.. 1% V.A. కూడా చెల్లించనక్కర్లేదు.

మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ పథకంలో చేరొచ్చు.

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.

## వెండివస్తువులు

బంగారు నగలు, వజ్రాభరణాలు మాదిరిగా వెండి వస్తువుల ధరలను కూడా బాగా పోల్చి కొనాలి. ఎందుకంటే, ప్రతిరూపాయి ముఖ్యం!



**90% వెండి వస్తువులకు మజూరి, తరుగు లేదు**

## లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్ లక్షలాది డిజైన్లు!

Lalithaa®
www.lalithaajewellery.com

**విజయవాడ :** 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటరింగ్ కాలేజ్ ఎదురుగా. ఫోన్: 0866-2481133.
**వైజాగ్ :** 29-1-75/1, ఆర్టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.
**రాజమహేంద్రవరం :** 20-25-3, కోరుకొండ రోడ్, కంబాల చెరువు, మహాత్మాగాంధీ విగ్రహం దగ్గర, దేవిచౌక్ సమీపంలో. ఫోన్: 0883-2020300.
**కాకినాడ :** 21-9-16, రాజా రామ్మోహన్‌రాయ్ రోడ్, బాలాజీ చెరువు సమీపం. ఫోన్: 0884-2373777, 91339 25222 / 25333
**భీమవరం :** SMM కాంప్లెక్స్, 18-9-5, సండే మార్కెట్, BN రోడ్. ఫోన్: 08816-221799. 91331 17666.
**తిరుపతి :** 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్కరోడ్, (V.V. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.

హైదరాబాద్ • విజయవాడ • వైజాగ్ • రాజమహేంద్రవరం • భీమవరం • కాకినాడ • తిరుపతి • చెన్నై • తిరువళ్లూరు • గుడియాత్తం • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్ • బెంగళూరు






www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI








శనివారం | 1-2-2020 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore | విజయవాడ సిటీ*




# సాయి నామస్మరణం!

● ఆయన చుట్టూ అందరూ!

## విశాఖకు ఆయన ‘రెండో సీఎం’

- ఐఏఎస్, ఐపీఎస్‌లు రావాల్సిందే
- మంత్రులూ నామమాత్రమే
- ఆది నుంచీ విశాఖపై ప్రత్యేక ఆసక్తి
- ప్రగతి భారతి పేరిట ట్రస్టు
- ఇటీవల ప్రత్యేక విమానంలో విశాఖకు
- వాల్తేరు క్లబ్, దసపల్లా భూములపై చర్చ!
- తిరిగి వెళుతూ రెండు పెట్టెల్లో ఫైళ్లు?

● **జిల్లాకు పార్టీ ఇన్‌చార్జి హోదా.. అధికారులతో విస్తృత సమీక్షలు**

రాష్ట్రానికంతా ఒకే ముఖ్యమంత్రి! విశాఖపట్నానికి మాత్రం ‘రెండో సీఎం’ కూడా ఉన్నారు! ఆయనే... వైసీపీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయ సాయి రెడ్డి! ఇది జిల్లా అధికారులు, నాయకులే చెప్పే మాట! సాయిరెడ్డి విశాఖ వచ్చారంటే.... అంతా హైఅలర్ట్! ఆయన పిలిస్తే అధికారులంతా పరుగు పరుగున వస్తారు! అధికారిక సమీక్షలైనా... ‘ప్రత్యేక’ సమావేశాలైనా ఆయనే ‘సెంటర్ ఆఫ్ అట్రాక్షన్’! ఇంతా చేస్తే... విశాఖకు సంబంధించి ఆయనకు ఎలాంటి అధికారిక హోదా లేదు! విశాఖ నగరానికి అధికార పార్టీ ఇన్‌చార్జి మాత్రమే! ఎంపీగా తన కోటా నుంచి ఇచ్చిన నిధుల వ్యయంపై జిల్లా కలెక్టర్‌తో చర్చించే అధికారం మాత్రమే ఆయనకు ఉంది! కానీ... జరుగుతున్నది, అంతకు మించి! 10



ఒక ఎంపీ హోదాలో విజయ సాయిరెడ్డి విశాఖ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశమిది. ఆయనకు అటూ ఇటూ ఇద్దరు మంత్రులు కూర్చోగా... ఒకవైపు కలెక్టర్, పోలీసు కమిషనర్, ఎస్పీ, జేసీ, జీవీఎంసీ కమిషనర్, వీఎంఆర్డీయే కమిషనర్ తదితర అధికారులు.. మరోవైపు ఎమ్మెల్యేలు, వైసీపీ నేతలు కూర్చున్న దృశ్యమిది. (ఫైల్ ఫొటో)



2

## వూహాన్ నుంచి విముక్తి!

**దాదాపు 350 మంది భారతీయుల రాక**

- ఎయిరిండియాలో ఢిల్లీకి
- విమానాశ్రయంలోనే పరీక్షలు
- వైరస్ సోకినట్టు తేలినవారు ఐసొలేషన్ వార్డుకు



8

## భారతీయుడి చేతికి ఐబీఎం పగ్గాలు

కంపెనీ సీఈఓగా ఎన్నికైన అర్వింద్ కృష్ణ



10

## పరిటాలను చంపడానికి బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు సప్లై చేసింది జగనే!

- ఆయన బదులు జైల్లో వేరే వ్యక్తి!
- వివేకా హత్యపై సీబీఐ దర్యాప్తు జరిపించరేం?
- రాజధానిని వైజాగ్ తరలిస్తారా?
- మాజీ ఎంపీ హర్షకుమార్ ధ్వజం



10

## కృష్ణకిశోర్‌కు జీతమివ్వరా?

- మాతృసంస్థకు పంపించరేం?
- మా ఆదేశాలూ పాటించరా?
- ఇలాగైతే సీఎస్‌నే పిలిపిస్తాం
- జగన్ సర్కారుపై ‘క్యాట్’ ఫైర్
- చర్యల ఆదేశాలపై మళ్లీ స్టే
- తర్వాత 2 గంటల్లోనే జీతం

# తాయిలాలు... తగ్గించండి

**నేడే కేంద్ర బడ్జెట్**

### సంపద సృష్టే సందేశం

“130 కోట్ల మంది భారతీయుల అభ్యున్నతి కోసం సంపద సృష్టి జరగాలి. 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను పెంచడానికి బహుముఖ వ్యూహం అవసరం. వ్యాపారం, ఎగుమతుల వృద్ధి, సులభతర వ్యాపార నిర్వహణ లాంటి అనేక మార్గాల ద్వారా ఆర్థిక శక్తిగా పెరగాలి’

- ఆర్థిక సర్వేపై ప్రధాని మోదీ స్పందన



రాష్ట్రపతి కోవింద్‌ను పార్లమెంటులోకి తోడ్కొని వెళ్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్య, ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా.

### రుణ మాఫీలతో నష్టమే.. ఉచిత హామీలు కూడా

### ఆర్థిక వ్యవస్థకు దెబ్బ.. ఆహార సబ్సిడీలూ కోయాలి

- పీడీఎస్ సరుకుల రేట్లు పెంచాలి
- ఆర్థిక సర్వే కీలక సూచనలు
- వృద్ధి రేటు 6-6.5 శాతం ఉండొచ్చు
- ధాటిగా ప్రభుత్వ ఆస్తుల అమ్మకం
- పరిశ్రమాధిపతులను గౌరవించాలి
- రెండేళ్లలో లక్షన్నర వెల్‌నెస్ సెంటర్లు
- 2025కు అసెంబ్లింగ్ హబ్‌గా భారత్
- భారతీయుడి కొనుగోలు శక్తి పెరిగింది

న్యూఢిల్లీ, జనవరి 31: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజాకర్షక, సంక్షేమ విధానాలను ఆర్థిక సర్వే తప్పుబట్టింది. ముఖ్యంగా ఉచిత హామీలు, రుణమాఫీలు ఆర్థిక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని ఆక్షేపించింది. సర్వేను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంటుకు సమర్పించారు. రుణమాఫీలు వ్యవసాయ రుణ వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని హెచ్చరించింది. “వ్యవసాయ రుణాల ప్రవాహానికి ఈ రుణ మాఫీలు అడ్డుపడుతున్నాయి. పాక్షికంగా లబ్ధి పొందిన వారితో పోలిస్తే పూర్తిగా ఈ

మిగతా 9వ పేజీలో...

### ఫీల్ గుడ్ బడ్జెట్టే!

- పన్ను చెల్లింపుదారులకు భారీ ఊరట!
- పొదుపు చేసే వేతన జీవులకు శుభవార్త?
- గ్రామీణ రంగానికి భారీ కేటాయింపులు
- మాంద్యం, ఢిల్లీ ఎన్నికలే కారణం
- రాజకీయ, ఆర్థిక నిపుణుల అంచనా

### విద్యార్థినులకు స్కూటర్లు

- పాఠశాలల్లో బాలికలకు సైకిళ్లు
- ఢిల్లీ మేనిఫెస్టోలో బీజేపీ ఉచిత హామీలు
- 2 రూపాయలకే కిలో గోధుమ పిండి

### సీఏఏ చరిత్రాత్మకం

- ఈ చట్టం తెచ్చి మహాత్మాగాంధీ ఆకాంక్షను పార్లమెంటు నెరవేర్చింది
- నిరసనల పేరిట హింస తగదు
- ఇది దేశాన్ని బలహీనపరుస్తుంది
- ప్రజలు స్థానిక ఉత్పత్తులనే వాడాలి
- పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి కోవింద్



# సూపరో.. సూపర్!

- మళ్లీ సూపర్ ఓవర్‌లో భారత్ విజయం
- నాలుగో టీ20లోనూ కివీస్‌కు భంగపాటు

*టీ-20 అంటేనే రసవత్తరం! అది సూపర్ ఓవర్ దాకా వస్తే ఉత్కంఠ భరితం! అందులోనూ... వరుసగా రెండో మ్యాచ్ కూడా సూపర్ ఓవర్‌కు వస్తే... మరీ మరీ హైటెన్షన్! కివీస్‌తో జరుగుతున్న సిరీస్‌లో అదే జరిగింది. రెండో సూపర్ ఓవర్‌లోనూ కోహ్లీ జట్టు సూపర్‌గా గెలిచింది.* 12

## నిర్భయ దోషులకు ఉరి మళ్లీ వాయిదా



ఉరి అమలు వాయిదాతో కన్నీరు మున్నీరవుతున్న నిర్భయ తల్లి

● **రేపిస్టులను పోషిస్తారు**

“మనదేశంలో రేపిస్టులను శిక్షించరు. పెంచి పోషిస్తారు. దేశ చట్టాల్లో ఉరి శిక్ష అనేది ఉంటే.. దోషులను ఉరి తీయాల్సిందే. అలా తీయలేకపోతే రాజ్యాంగాన్ని తగలబెట్టాలి. దోషులను ప్రభుత్వం ఉరి తీయాలి లేదా దేశాన్ని తప్పుదోవ పట్టించడానికే తాము ఉరిశిక్ష విధించామని దేశంలోని అన్ని కోర్టులూ ఒప్పుకోవాలి”

- నిర్భయ తల్లి ఆశాదేవి ఆవేదన

9

### కొడుకు లవర్‌పై రేప్

- పెళ్లి గురించి మాట్లాడదామని పిలిచి ఘాతుకం
- బలవంతంగా తాళి కట్టి పలుమార్లు అత్యాచారం
- పోలీసులకు కొడుకు ఫిర్యాదు

# ‘రాయ’బార రహస్యం?

- రైతులతో సయోధ్యకా.. లేక అయోమయం సృష్టించేందుకా?
- జస్టిస్ జాస్తి చలమేశ్వర్‌తో కలిసి జగన్‌తో భేటీ
- మరుసటి రోజే రాజధాని రైతుల వద్దకు ఎంపీ శ్రీకృష్ణ

11



వెలగపూడిలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న వైసీపీ ఎంపీ శ్రీకృష్ణ

### చర్చలకు ప్రభుత్వం సిద్ధం

- సీఎం జగన్ రైతు పక్షపాతి
- మీకు న్యాయం చేశాకే ముందుకు
- రాజధాని రైతులతో వైసీపీ ఎంపీ లావు
- అమరావతికి అనుకూలమో కాదో చెప్పండి
- ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్

11



10

## పోస్టుల భర్తీకి పచ్చజెండా

- ఖాళీగా పెట్టుకుని సేవ ఎలా చేస్తాం?
- ప్రభుత్వ ఉద్యోగాలపై సీఎం జగన్ వ్యాఖ్యలు
- అన్ని విభాగాల్లో 63 వేలకు పైగా ఖాళీల గుర్తింపు
- ఉద్యోగాల భర్తీ క్యాలెండర్‌పై ఉన్నతస్థాయి సమీక్ష
- వయోపరిమితి సడలింపు, ప్రకటనపై 21న క్లారిటీ

### నాణ్యమైన బియ్యం మరింత ఆలస్యం

- ఏప్రిల్ నుంచి దశల వారీగా పంపిణీ

### నెలాఖరులో మున్సిపోల్స్!

- పంచాయతీ ఎన్నికల కంటే ముందుగానే
- 8, 9వ తేదీల్లో నోటిఫికేషన్ జారీ

2









పరంజ్యోతి

## సప్తాశ్వ రథమారూఢం..



'మాఘం' (మా+అఘం).. అంటే పాపం లేనిది. విష్ణువుకు, శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో 'సూర్యారాధనము' అత్యంత పుణ్యఫలప్రదం. అందునా.. మాఘమాసంలో శుక్లపక్షంలో వచ్చే సప్తమి పరమ పవిత్రమైన రోజు. ఈరోజు సూర్యభగవానుడి రథం ఉత్తర దిక్కుకు తిరుగుతుంది. అలాగే.. నక్షత్ర మండలం ఈ రోజు రథాకారంలో ఉంటుంది. అందుకే ఈరోజుకు 'రథ సప్తమి' అని పేరు. రథసప్తమినాడు అరుణోదయ కాలంలో.. లేదా సప్తమి తిథి ఉన్నప్పుడు ఏడు జిల్లేడు ఆకులను తలపై, భుజాలపై, చేతులపై పెట్టుకుని

యద్యజ్జన్మకృతం పాపం మయా జన్మసు సప్తసు
తన్మే రోగంచ శోకంచ మాకరీ హంతు సప్తమీ

..అంటూ చేసే సమంత్రక స్నానం, పుణ్య నదీ స్నానం ఏడు జన్మల పాపాలను పోగొడుతుంది. ఈ శ్లోకం చెప్పుకోకుండా జిల్లేడు ఆకులను పెట్టుకుని స్నానం చేసినా ఫలితం ఉండదు. తలపై పెట్టుకునే జిల్లేడు ఆకు సూర్యశక్తిని గ్రహించి బ్రహ్మ రంధ్రం ద్వారా శరీరంలోకి పంపిస్తుంది. అది వేసవి వేడిమిని తట్టుకునే శక్తినిస్తుంది. అందుకే జిల్లేడు ఆకులు పెట్టుకుని స్నానం చేస్తారు. అలాగే.. ఈరోజున సూర్యధ్యానం, సూర్య నమస్కారాలు మహాఫలప్రదమని శాస్త్రాలు చెబుతున్నాయి.

సూర్యకిరణాలలోని 'ప్రాణశక్తిని' అత్యధికంగా నిల్వ చేసుకొనే వృక్షాల్లో 'రుద్రాక్ష', 'జిల్లేడు', 'రేగు' ముఖ్యమైనవి. 'రుద్రాక్ష' వల్ల 'మశూచి', 'జిల్లేడు' వల్ల వాత దోషాలు, చర్మరోగాలు, కురుపులు పోతాయి. తెల్ల జిల్లేడు మరీ శ్రేష్ఠము. 'రేగు' రక్తశుద్ధికి మంచిది. ఇక.. ఈ రోజు ఆవు పేడతో చేసిన పిడకలను కాల్చి, వాటిపై బియ్యం, పాలు కలిపి పొంగలి చేసి చిక్కుడు ఆకుల్లో 'సూర్యు'నికి నైవేద్యం పెడతారు. ఈ ప్రసాదాన్ని తీసుకోవడం వల్ల పాపక్షయం, రోగక్షయమై మానవులకు ఎంతగానో మేలు కలుగుతుంది. కనుకనే మన సనాతన ధర్మంలో.. విశేష ఫలాలనిచ్చే ముఖ్యమైన పండుగ 'రథ సప్తమి' అని 'ధర్మసింధు' చెబుతోంది. మనిషి కంటితో చూడగలిగిన ప్రత్యక్ష భగవానుడు సూర్యనారాయణుడు. ఆ స్వామిని ఈ మాసంలోనే కాదు.. ఏడాది పొడుగునా ఆరాధించాలి. 'ఆదిత్య హృదయం' పారాయణ.. సూర్యనమస్కారాలతో భాస్కరుణ్ని మెప్పిస్తే సర్వరోగాల నుండి విముక్తులం కావడమే కాదు.. పుణ్యలోక ప్రాప్తి కూడా పొందుతాం. అవి కూడా చేయలేనివారు..

సప్తాశ్వరథమారుఢం ప్రచండం కశ్యపాత్మజమ్
శ్వేతపద్మ ధరం దేవం తం సూర్యం ప్రణామామ్యహమ్

..అంటూ నిత్యం ఆదిత్యుడిని మనసారా స్మరించి నమస్కరించినా చాలు ఆ ప్రత్యక్ష నారాయణుడి కృపకు పాత్రులవుతారు.

- పరాంకుశం శ్రీనివాసమూర్తి, 94934 55256

# వూహాన్ నుంచి విముక్తి

### దాదాపు 350 భారతీయుల రాక

- ఎయిరిండియా విమానంలో తరలింపు
- శనివారం తెల్లవారుజామున ఢిల్లీకి!
- విమానాశ్రయంలోనే వారికి పరీక్షలు
- వైరస్ సోకినట్టు తేలినవారు ఐసోలేషన్ వార్డుకు
- మిగతావారు మనేసర్‌లోని క్వారంటైన్‌కు
- అక్కడ 2 వారాలపాటు వైద్యుల పర్యవేక్షణలో!
- మాస్కుల ఎగుమతిపై నిషేధం విధించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 31: కరోనా వైరస్ కారణంగా వూహాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను ఎయిరిండియా సంస్థ ప్రత్యేక బోయింగ్ విమానం 'అజంతా'లో తరలించింది. నలుగురు పైలట్లు సహా సిబ్బంది, ఇంజనీర్లు అంతా కలిపి 33 మందితో శుక్రవారం మధ్యాహ్నం 1.18 గంటలకు ఢిల్లీ నుంచి బయల్దేరిన విమానం మళ్లీ రాత్రి 10 గంటల తర్వాత 350 మందికి పైగా భారతీయులతో తిరుగుప్రయాణమైంది. నిర్ణీత షెడ్యూలు ప్రకారమైతే శనివారం తెల్లవారుజామున 2 గంటలకు ఈ విమానం ఢిల్లీకి చేరుకుంటుందని అధికారులు తెలిపారు. కాగా, కేంద్ర ఆరోగ్య శాఖ ఈ విమానంలో ఐదుగురు వైద్యులను, అవసరమైన మందులను, మాస్కులను ఓవర్ కోట్లను, ప్యాకేజ్డ్ ఆహారాన్ని పంపింది. విమానం సిబ్బంది, వైద్యులు అందరూ వూహాన్‌లో దిగేటప్పుడు పూర్తిస్థాయి రక్షణ సూట్లు ధరిస్తారని ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. కరోనా వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకే ప్రమాదం ఉండడంతో అధికారులు పలు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. వూహాన్ నుంచి వస్తున్నవారు విమాన సిబ్బందితో ఎక్కువగా మాట్లాడాల్సిన అవసరం లేకుండా ముందే ప్రతి సీటు వద్దా భోజనం ఏర్పాట్లు చేశారు. అలాగే.. రెండు మరుగుదొడ్లను కేవలం సిబ్బంది మాత్రమే వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు. నిజానికి ఈ విమానం ముంబై నుంచి బయల్దేరి వెళ్లాల్సింది. అయితే, అవసరమైన మందులను, వైద్యులను పంపించడం కోసం తొలుత ఢిల్లీకి తరలించి అక్కడి నుంచి వూహాన్‌కు పంపారు. ఈ రెస్క్యూ మిషన్‌కు కెప్టెన్ అమితాబ్ సింగ్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ తరహా తరలింపు మిషన్లను చేపట్టడం ఎయిరిండియాకు ఇదేం కొత్త కాదు. గతంలో లిబియా, ఇరాక్, యెమెన్, కువాయిట్, నేపాల్ నుంచి భారతీయులను తరలించింది. ముఖ్యంగా.. 1990 ఆగస్టులో లక్ష మందికి పైగా భారతీయులను 488 విమానాల్లో 59 రోజుల్లో తరలించిన ఘన చరిత్ర ఎయిరిండియాకు ఉంది. అలాగే.. 2015లో 'ఆపరేషన్ రాహత్' పేరుతో యెమెన్ నుంచి భారతీయులను తరలించింది. కాగా.. వూహాన్‌లో మిగిలిపోయిన మరికొంతమంది భారతీయులను ఇక్కడికి తీసుకొచ్చేందుకు శనివారం మరో ప్రత్యేక విమానాన్ని పంపనున్నట్టు సమాచారం. బ్రిటన్ కూడా తమ దేశానికి చెందిన 110 మందిని వూహాన్ నుంచి తరలించింది.

### క్వారంటైన్ సిద్ధం

వూహాన్ నుంచి తరలిస్తున్న భారతీయులను.. ఢిల్లీ విమానాశ్రయంలో దిగాక నేరుగా వారివారి స్వస్థలాలకు వెళ్లనీయరు. వైరస్‌కు కేంద్రస్థానం నుంచి వస్తున్న నేపథ్యంలో వారిని క్వారంటైన్లలో ఉంచనున్నారు. వారి కోసం భారత సైన్యం ఢిల్లీకి సమీపంలోని మనేసర్‌లో ఒక క్వారంటైన్‌ను నిర్మించింది. అక్కడ వారిని రెండు వారాలపాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతారు. ప్రత్యేక విమానంలో వచ్చినవారందరికీ తొలుత విమానాశ్రయంలోనే పరీక్షలు చేస్తారు. ఎవరికైనా వైరస్ సోకిందన్న అనుమానం కలిగితే వారిని ఢిల్లీ కంటోన్మెంట్ బేస్ హాస్పిటల్‌లోని ఐసోలేషన్ వార్డుకు తరలించి చికిత్స చేస్తారు. కాగా.. కరోనా వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మాస్కుల ఎగుమతిపై నిషేధం విధించింది. వాటిని ఎగుమతి చేస్తే మనదేశంలో కొరత వచ్చే ప్రమాదం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

## 75 వేల మందికి కరోనా?

- హాంకాంగ్ వర్సిటీ పరిశోధకుల అధ్యయనం

బీజింగ్, జనవరి 31: చైనాలో కరోనా వైరస్ మృతుల సంఖ్య వందల్లో.. వైరస్ సోకినవారి సంఖ్యను 10వేల లోపు ఉన్నట్టు అధికారులు చెబుతున్నప్పటికీ ఇప్పటికే 75 వేల మందికి పైగా ఆ వైరస్ బారిన పడినట్టు హాంకాంగ్ వర్సిటీ పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు వారు నిర్వహించిన అధ్యయనం తాలూకూ నివేదిక ప్రముఖ వైద్య జర్నల్ లాన్సెట్ తాజా సంచికలో ప్రచురితమైంది. డిసెంబరు 1 నుంచి జనవరి 25 దాకా ఈ వైరస్ బారిన పడిన ప్రతి ఒక్కరి నుంచి అది మరో ఇద్దరు ముగ్గురికి సోకిందన్నది వారి అంచనా. కాగా.. చైనాలో కరోనా వైరస్ మృతుల సంఖ్య 213కు చేరింది. 9692 మందికి వైరస్ సోకినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ వైరస్.. భారత్ సహా దాదాపు 20 దేశాలకు విస్తరించడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ' ప్రకటించింది. ఈ ముప్పును ఎదుర్కొనలేని దేశాలకు కరోనా వైరస్ విస్తరిస్తే కలిగే ప్రమాదాలపై తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామని డబ్ల్యూహెచ్‌వో చీఫ్ టెడ్రోస్ చెప్పారు.

### అంతర్జాతీయ ఆరోగ్య ఆత్యయిక స్థితి అంటే?

చైనాలో ప్రబలిన కరోనా వైరస్ ఇతర దేశాలకు కూడా విస్తరిస్తుండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) దీన్ని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్‌సర్న్ (పీహెచ్‌ఈఐసీ)'గా ప్రకటించింది. అంటే.. అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితి. వైరస్ వల్లనో, బ్యాక్టీరియా వంటివాటి వల్ల ప్రజారోగ్యానికి పెనుముప్పు ఏర్పడి.. అది ఇతర దేశాలకూ విస్తరించే పరిస్థితి ఉంటే అంతర్జాతీయ సమాజమంతా కలిసి సమన్వయంతో ఆ ముప్పును ఎదుర్కొనడమే దీని లక్ష్యం. ఇప్పటిదాకా ఈ వైరస్‌పై పోరు చైనాకే పరిమితం కాగా.. ఈ ప్రకటనతో ప్రపంచదేశాలు కూడా దాంట్లో భాగం కావాల్సి ఉంటుంది. వైరస్‌ను నియంత్రించేందుకు, నిర్మూలించేందుకు చైనా, ప్రపంచదేశాలు డబ్ల్యూహెచ్‌వో విధించిన నిబంధనలు పాటించాలి.

## జేసీకి జగన్ షాక్!

- 'త్రిశూల్' గనుల లీజు రద్దు

అనంతపురం/గన్నవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అనంతపురం మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి కుటుంబానికి జగన్ ప్రభుత్వం షాకిచ్చింది. ఇప్పటికే ఆ కుటుంబానికి చెందిన పలు బస్సులను సీజ్ చేయగా.. తాజాగా వారి సిమెంటు గనుల లీజును రద్దు చేసింది. అనంతపురం జిల్లా యాడికి మండలంలోని జేసీకి సంబంధించిన త్రిశూల్ సిమెంట్స్‌కు కొనుప్పలపాడులో కేటాయించిన 649.86 హెక్టార్ల సున్నపురాతి గనుల లీజును రద్దు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ భూములు రాశి సిమెంట్‌కు లీజులో ఉండేవి. వీటి కాలపరిమితి 2004 మార్చి 31కి పూర్తయింది. 2005లో ఈ భూములను వైఎస్ ప్రభుత్వం త్రిశూల్ సిమెంట్స్‌కు లీజుకు ఇచ్చింది. మూడేళ్లలో త్రిశూల్ సిమెంటు ఫ్యాక్టరీని ఏర్పాటుచేయాలని సూచించింది. 2010కి లీజు కాలపరిమితి ముగిసింది. మళ్లీ దరఖాస్తు చేసుకోగా.. 2015 ఆగస్టు 1 వరకూ ప్రభుత్వం పొడిగించింది. అప్పటికీ పరిశ్రమ ఏర్పాటు చేయలేకపోవడంతో మరో ఐదేళ్లు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరగా.. 2020 జూలై 31 వరకు గడువు పొడిగించింది. ఈ ఉత్తర్వులను రద్దు చేస్తూ జగన్ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలు ఉల్లంఘించిన కంపెనీపై చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించింది. ఫ్యాక్టరీ నిర్మాణం జరగకపోయినా 38,212 మెట్రిక్ టన్నుల సున్నపురాయిని అక్రమంగా తవ్వి విక్రయించారన్న ఆరోపణలున్నాయి. లీజుకు సంబంధించి రూ.38,03,376 చెల్లించకపోవడం, ఇప్పటివరకు సిమెంటు ప్లాంటు ఏర్పాటుచేయకపోవడం, అక్రమంగా మైనింగ్ చేయడం వంటి కారణాలతో లీజును రద్దుచేశారు.

### పగ.. ఫ్యాక్షనిజం: జేసీ

ఈ ప్రభుత్వం ఎవరి మీద పగ పెంచుకున్నా.. వాడి ఆర్థిక మూలాలను సర్వనాశనం చేసి.. వాడిని చంపేసి.. వాడి భార్యాపిల్లలు అడుక్కుతింటుంటే అప్పుడే దాని ఇగో శాంతిస్తుందని జేసీ అన్నారు. ఫ్యాక్షనిజం అంటే ఇదేనని చెప్పారు. హైదరాబాద్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఆయన.. త్రిశూల్ సిమెంట్ ఫ్యాక్టరీ గనుల లీజును రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై పై విధంగా స్పందించారు. అనుమతుల రద్దుపై తనకు బాధగా లేదని.. ఈ విషయాన్ని కోర్టులో తేల్చుకుంటానని స్పష్టం చేశారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంతో పోల్చుకుంటే తనకు జరిగినది చిన్నపాటిదేనని చెప్పారు.

## లోకం తీరు




### ఉత్తర కోస్తాలో వర్షం

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాతావరణం వేడెక్కడం, సముద్రం నుంచి తేమగాలులు రావడంతో ఒక రకమైన అనిశ్చితి నెలకొంది. దీంతో ఉత్తర కోస్తాలో శుక్రవారం పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రానికి రోలుగుంటలో మూడు, రావికమతంలో ఒక సెంటీమీటరు వర్షపాతం నమోదైంది. రానున్న రెండు రోజుల్లో కోస్తాలో అక్కడక్కడా ఉరుములతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా రాయలసీమలో ఎండ తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. శుక్రవారం దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో 37.1 డిగ్రీలు నమోదైంది.



### మోదీ, షా ప్రోద్బలంతోనే జామియాలో కాల్పులు

జామియా వర్సిటీలో జరిగిన కాల్పులకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాల ప్రోద్బలమే కారణం. సమాజాన్ని నిలువునా చీల్చేందుకు బీజేపీ కుట్ర పన్నుతోంది. జామియా విద్యార్థులు 'గాంధీ అమరుడైన రోజు' అనే ఊరేగింపు చేస్తుండగా ఓ వ్యక్తి జరిపిన కాల్పుల్లో ఓ విద్యార్థి గాయపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలంలోనే ఉన్నా మౌనంగా ఉన్నారు. ఇలాగైతే సామాన్యులకు రక్షణ ఎలా కల్పిస్తారు?

- సిద్దరామయ్య, కర్ణాటక మాజీ సీఎం



### మోదీ మా ప్రధాని..!

మోదీజీ భారతదేశానికి ప్రధాని. నాకు కూడా ప్రధానే. ఢిల్లీ ఎన్నికలు మా అంతర్గత వ్యవహారం. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న మీరు(పాకిస్థాన్) ఈ విషయంలో జోక్యం చేసుకుంటే సహించేది లేదు. మీరు తలకిందులుగా తపస్సు చేసినా మా ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరు.

- అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

(పాక్ మంత్రి చౌధురి ఫవద్ హుస్సేన్‌కు బదులిస్తూ..)



### శాకాహారులకు మూత్రనాళ ఇన్ఫెక్షన్ల ముప్పు తక్కువే

బీజింగ్, జనవరి 31 : శాకాహారులకు మూత్రనాళ ఇన్ఫెక్షన్ల ముప్పు అతి తక్కువని తైవాన్‌లోని జు చి వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. సాధారణంగా మహిళల్లో మూత్రనాళ ఇన్ఫెక్షన్లు ఎక్కువగా వస్తుంటాయి. శాకాహారం వాడకాన్ని పెంచడం ద్వారా ఆ ముప్పు నుంచి వారు గట్టెక్కొచ్చని సూచించారు. మాంసాహారులతో పోల్చుకుంటే శాకాహారుల్లో మూత్రనాళ ఇన్ఫెక్షన్ల ముప్పు 16 శాతం తక్కువగా ఉంటుందని తాజా అధ్యయనంలో గుర్తించారు. పౌల్ట్రీ ఉత్పత్తులు, పంది మాంసం వంటివాటికి దూరంగా ఉండేవారి గట్ బ్యాక్టీరియాలో 'ఈ.కొలి బ్యాక్టీరియా' వృద్ధికి అడ్డుకట్టపడుతుందని, ఫలితంగా మూత్రనాళ ఇన్ఫెక్షన్లకు ఆస్కారం ఉండదన్నారు.



### వందేళ్లలో గర్భాశయ కేన్సర్ అంతం!

టొరంటో, జనవరి 31 : మరో వందేళ్లలో గర్భాశయ(సర్వికల్) కేన్సర్ అంతమవుతుందట!! వచ్చే 20 ఏళ్లలో బ్రిటన్ సహా అన్ని ధనిక దేశాల్లో ఆ వ్యాధి జాడ ఉండదట!! ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సూచనల ప్రకారం హ్యూమన్ పపిల్లోమా వైరస్(హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ ప్రణాళికలు తు.చ తప్పకుండా అమలైతే ఇది సాధ్యమేనని కెనడాలోని లావల్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇందులో భాగంగా 2030లోగా ప్రపంచవ్యాప్తంగా 90% బాలలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయాలి. దీంతోపాటు 70% మంది మహిళలకు గర్భాశయ కేన్సర్ స్క్రీనింగ్ టెస్టు నిర్వహించాలని డబ్ల్యూహెచ్‌వో లక్ష్యంగా పెట్టుకుంది. ఇవన్నీ అమలైతే వచ్చే వందేళ్లలో 78 దేశాల్లో ఆ వ్యాధి ముప్పు 89 శాతానికి తగ్గనుంది.



కొత్తలంక పశువైద్యశాల వద్ద ఆవులకు చికిత్స చేస్తున్న దృశ్యం

## ఆవులకు వింత వ్యాధి!

- లంపీ స్కిన్ డిసీజ్‌తో 15 గోమాతలు మృతి?
- ఒడిసా నుంచి రాష్ట్రంలోకి ప్రబలిన వ్యాధి

ముమ్మిడివరం, జనవరి 31: రాష్ట్రంలో ఆవులకు వింత వ్యాధి సోకుతోంది. పశు వైద్యులు లంపీ స్కిన్ డిసీజ్‌గా భావిస్తున్న దీని దెబ్బకు ఇప్పటివరకూ 15 ఆవులకుపైగానే మృత్యువాత పడడం కలకలం రేపుతోంది. తూర్పుగోదావరి జిల్లా కోనసీమలోని అల్లవరం, కాట్రేనికోన, ముమ్మిడివరం, అమలాపురం, అయినవిల్లి, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, తదితర మండలాల్లో ఆవులకు ఈ వ్యాధి సోకినట్టు రైతులు, పశువైద్యులు చెబుతున్నారు. తొలుత ఈవ్యాధి ఒడిసాలోని ఆవులకు సోకింది. అక్కడి నుంచి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని ఆవులకు వ్యాప్తిచెందింది. తాజాగా వారం నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని ఆవులకు సోకింది. ఫాక్సిలిరిడి కుటుంబానికి చెందిన వైరస్ వలన ఈ వ్యాధి సోకినట్టు పశువైద్యులు భావిస్తున్నారు. ముమ్మిడివరం మండలం కొత్తలంక, చినకొత్తలంక గ్రామాల్లో వందపైబడి ఆవులు ఈవ్యాధి బారినపడగా 15 ఆవులు మృత్యువాత పడ్డాయి. మండలంలో సుమారు 500 నుంచి 600 ఆవులకు ఈవ్యాధి సోకినట్టు పశువైద్యులు చెబుతున్నారు. ఆవు శరీరంపై ఒకచోట కణితిగా ఏర్పడి అది పుండుగా మారుతుంది. అనంతరం ఆవులు పూర్తిగా బలహీనపడి మృతి చెందుతున్నాయి. 'ముమ్మిడివరం మండలంలో చాలా ఆవులకు ఈ వ్యాధి సోకింది. అయితే ఈ వ్యాధి ఏమిటో నిర్ధారణ కాలేదు. ఆవుల రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించాం. పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించాం. రిపోర్టులు వస్తే దీనిపై ఒక అవగాహన వస్తుంది' అని మండల పశువైద్యుడు ఎం.జగదీశ్ తెలిపారు.

### విశాఖపట్నంలో జలవనరుల శాఖ కార్యాలయం?

విశాఖపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా రాజధాని అయిన వెంటనే విశాఖపట్నంలో ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు జలవనరుల శాఖ అధికారులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ శాఖకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలకు ఆనుకుని సుమారు ఐదున్నర ఎకరాల స్థలం ఉంది. ఈ ప్రాంగణంలో ఉత్తర కోస్తా చీఫ్ ఇంజనీర్ కార్యాలయం, డిజైన్స్, ప్రాజెక్టు, మైక్రో ఇరిగేషన్ ఈఈ కార్యాలయం ఉన్నాయి. విభాగం అవసరాలకు మరో భవనం సిద్ధం చేయగా, ఇంకోటి నిర్మాణ దశలో ఉంది. ఏలేరు అతిథిగృహం కూడా ఇక్కడే ఉంది. వాటికి ఎదురుగా రోడ్డుకు అవతలి వైపు అధికారుల నివాస గృహాలు ఉన్నాయి. రాష్ట్ర జలవనరుల మంత్రి అనిల్‌కుమార్ శుక్రవారం ఉత్తర కోస్తా సీఈ కార్యాలయాన్ని సందర్శించారు. నిర్మాణంలో ఉన్న భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత పర్యటనకు వచ్చానని మంత్రి మీడియాకు తెలిపారు.

## కరోనాకు ప్రత్యేక వార్డులు

- ఏపీ నోడల్ కేంద్రంగా స్విమ్స్
- వ్యాధి నివారణపైనే ప్రత్యేక దృష్టి

గుంటూరు(మెడికల్), అమరావతి, జనవరి 31: కరోనా వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏపీ సిద్ధమవుతోంది. భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) సహకారంతో కరోనా నిర్ధారణ పరీక్షల కోసం ప్రభుత్వం శుక్రవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. వ్యాధి నిర్ధారణ పరీక్షల నోడల్ సెంటర్‌గా తిరుపతిలోని స్విమ్స్‌ను ఎంపిక చేసింది. అలాగే ఏపీలోని అన్ని ప్రభుత్వ వైద్య బోధనాస్పత్రులు, ఛాతి వ్యాధుల ఆస్పత్రుల్లో ఐదేసి పడకలతో కూడిన ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 11 ప్రభుత్వ వైద్య బోధనాస్పత్రులతో పాటు ప్రైవేటు వైద్యశాలలు కరోనా పరీక్షలు చేయించాలంటే తప్పనిసరిగా నోడల్ కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. కరోనా వైరస్ నిర్ధారణకు రోగుల నుంచి ముక్కు, గొంతు స్రావాలు, సిరం, హోల్ బ్లడ్ శాంపిల్ వంటి మూడు నమూనాలను సేకరించాలి. వాటిని వీటీఎంలో భద్రపరిచి స్విమ్స్ నోడల్ కేంద్రం అధికారికి సమాచారమివ్వాలి. స్విమ్స్ ప్రతినిధి ఆదేశాల మేరకు పుణెలోని జాతీయ ల్యాబొరేటరికి పంపుతారు.

| జిల్లా పేరు | నోడల్ అధికారి | ఫోన్ నంబరు |
|---|---|---|
| శ్రీకాకుళం | బి.జగన్నాధరావు | 9963994337 |
| విజయనగరం | యం.చామంతి | 9492024155 |
| విశాఖపట్నం | యం.పార్థసారధి | 7382555264 |
| తూర్పుగోదావరి | యం. మల్లికార్జున్ | 9392133322 |
| పశ్చిమగోదావరి | కె.సురేష్‌బాబు | 9440471232 |
| కృష్ణా | అమృతం | 9491647614 |
| గుంటూరు | పి.రత్నవల్లి | 8309176892 |
| నెల్లూరు | ఆర్.స్వర్ణలత | 9440294507 |
| చిత్తూరు | సుదర్శన్ | 8790995129 |
| కడప | కె.కొండయ్య | 9848399496 |
| అనంతపురం | సి.పద్మావతి | 9849902398 |
| కర్నూలు | సి.దేవీ | 9849902411 |

**జాగ్రత్త..! మంత్రి ఆళ్ల**

చైనాతోపాటు ప్రపంచ దేశాలను భయాందోళనకు గురిచేస్తున్న కరోనా వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) సూచించారు. గత 29 రోజుల వ్యవధిలో ఎవరికైనా జలుబు, దగ్గు, జ్వరం లేదా శ్వాసకోశ ఇబ్బందులు ఏమైనా ఉంటే జాగ్రత్త పడాలని అన్నారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. అత్యవసర సమాచారం కోసం 1100, 1102 టోల్‌ఫ్రీ నంబర్లకు లేదా 7013387382, 8008473799 నంబర్లకు చేయాలని చెప్పారు.

## ఆంధ్రా మిర్చికి.. కరోనా దెబ్బ

గుంటూరు, కుక్కునూరు: జనవరి ఆరంభంలో క్వింటా మిర్చి రూ.20 వేలు పలికింది. పది రోజుల కిందట రూ.10 వేలకు పడిపోయినా మళ్లీ పుంజుకుంది. 16 నుంచి 20 వేల మధ్య కొనుగోళ్లు సాగాయి. రెండు రోజుల క్రితం వరకూ 18 నుంచి 20 వేలకు కొన్నారు. ఇప్పుడు హఠాత్తుగా ధర 10 వేలకు పడిపోయింది. కారణం.. కరోనా! చైనాలో ప్రబలిన కరోనా వైరస్ ప్రభావంతో విదేశాలకు మిర్చి ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. ఇది తూర్పుగోదావరి జిల్లా కుక్కునూరు ప్రాంతంలో పరిస్థితి. ఇక మిర్చికి ప్రసిద్ధి చెందిన గుంటూరులోనూ ఇదే పరిస్థితి. గుంటూరులో కొనుగోలు చేసిన మిర్చిని వ్యాపారులు చైనా, వియత్నాం, మలేషియా, థాయ్‌లాండ్, మెక్సికో వంటి దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. కరోనా ప్రభావంతో ఈ దేశాలు దిగుమతులు నిలిపేశాయి. దీంతో మిర్చి ధర భారీగా పతనమైంది.

## వెంకయ్య ట్రస్ట్‌లో ప్రాచీన కేంద్రమా?

- ప్రైవేటు స్థలంలో ఎందుకు పెట్టినట్టో?
- కోరితే మేమే భూమిని ఇచ్చేవారం కదా!
- ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తూ కేంద్రం రాసిన లేఖకు సీఎం జగన్ సమాధానం
- ట్రస్ట్‌లో ఉచితంగా బంగ్లా ఇచ్చారు
- ఇచ్చే ఉద్దేశముంటే ముందే మీరు చెప్పాల్సింది
- జగన్ లేఖకు కేంద్రం ఘాటుగా జవాబు

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ ట్రస్ట్ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుటుంబం ఆధ్వర్యంలో నడుస్తోంది. జనవరి 20, 21 తేదీల్లో ఇక్కడ జరిగే ప్రాచీన తెలుగు విశిష్ఠ అధ్యయన కేంద్రం ప్రారంభోత్సవానికి హాజరుకావల్సిందిగా కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్.. సీఎం జగన్‌కు ఈ నెల ఒకటో తేదీన లేఖ రాశారు. అసెంబ్లీ సమావేశాల రీత్యా తాను హాజరు కాలేకపోతున్నానని చెబుతూనే, ఆ కేంద్రాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేయడం వెనుక ఔచిత్యాన్ని ఈ నెల 17వ తేదీన ఇచ్చిన తన జవాబులో జగన్ ప్రశ్నించినట్లు తెలిసింది. ఒక ప్రముఖుని ప్రైవేట్ భవనంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారని జగన్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ కేంద్రం కోసం తన ప్రభుత్వాన్ని కోరితే భూమిని కేటాయించేవారమని జగన్ చెప్పినట్లు తెలిసింది. అయితే జగన్ ఆలస్యంగా స్పందించడంపై కేంద్ర మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. "నేను జనవరి 1న లేఖ రాస్తే జనవరి 17న మీరు స్పందించడం సరైంది కాదు. వెంటనే స్పందిస్తే తగిన నిర్ణయం తీసుకునేవారం" అంటూ ఘాటుగా స్పందించారు. ప్రాచీన విశిష్ఠ బాషా అధ్యయన కేంద్రానికి ఉచితంగా అద్దె లేకుండా వసతి లభించినందుకు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రారంభిస్తున్నామని, ఇందులో ఎలాంటి అనౌచిత్యం లేదని చెప్పినట్లు తెలిసింది. "భాషా కేంద్రంపై మీకు వేరే ఆలోచన ఉంటే ముందే స్పందిస్తే బాగుంటేది. ముందుగానే భూమి ఇస్తామని చెప్పి ఉండాల్సింది" అని స్పష్టం చేశారు. కాగా, తెలుగుభాషపై ఎంతో మక్కువ ఉన్న ఉపరాష్ట్రపతి తన ట్రస్ట్ భవనంలో రెండేళ్ల పాటు అద్దె లేకుండా ప్రాచీన కేంద్రాన్ని నిర్వహించేందుకు ముందుకొస్తే, ఆయన త్యాగ నిరతిని ముఖ్యమంత్రి తప్పుబట్టడం, దురుద్దేశాలు ఆపాదించడం సరైంది కాదని మానవ వనరుల శాఖ అధికారులు అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా జగన్ దీనిపై రాజకీయాలు చేస్తున్నారని, ఒక రాజ్యాంగాధినేతను చిన్న చూపు చూడడం, ఆయన కార్యక్రమానికి హాజరు కాకపోవడం సరైంది కాదని భావిస్తున్నారు.

## నెలాఖరులో మున్సిపోల్స్!

- పంచాయతీ ఎన్నికల కంటే ముందుగానే!!
- 3న ఓటర్ల తుది జాబితాల ప్రచురణ
- 8, 9వ తేదీల్లో నోటిఫికేషన్ జారీ

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల కంటే ముందుగానే మున్సిపల్ ఎన్నికలు జరగనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఫిబ్రవరి నెలాఖరులో వీటిని నిర్వహించేందుకు కసరత్తు జరుగుతోంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు న్యాయపరమైన అంశాలు ప్రతిబంధకంగా మారడంతో వాటి కంటే ముందే రాష్ట్రంలోని 110 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) ఆధ్వర్యంలో వీటి నిర్వహణకు పురపాలక శాఖ ఏర్పాట్లు చురుగ్గా చేస్తోంది. ఫిబ్రవరి 3న ఓటర్ల తుది జాబితాలను ప్రకటిస్తారని, 8, 9 తేదీల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని.. నెలాఖర్లో ఎన్నికలు జరుపుతారని సమాచారం.

### స్థానిక ఎన్నికల వాయిదాతో...

తొలుత అనుకున్న ప్రకారం రాష్ట్రంలో తొలుత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు.. ఆ తర్వాత పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అవి ముగిశాక మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. అయితే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం 59.85 శాతం రిజర్వేషన్లు ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఎన్నికలపై స్టే కూడా ఇచ్చింది. హైకోర్టులో విచారణ ముగిసి నిర్ణయం వెలువడేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పలేని పరిస్థితి. దీంతో ఈలోపు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో రిజర్వేషన్ల శాతం నిర్ణీత 50 శాతమే ఉండడం, వివాదాల్లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. పైగా.. పలు మున్సిపాలిటీలు/కార్పొరేషన్లలో వాటి పరిసరాల్లోని కొన్ని పంచాయతీలు, ఇతర ప్రాంతాల విలీన ప్రక్రియ ముగియడం, వార్డుల పునర్వ్యవస్థీకరణ సైతం పూర్తవడం మున్సి'పోల్స్'కు అనుకూలంగా పరిణమించాయి. వాస్తవానికి మున్సిపల్ ఎన్నికలను ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో నిర్వహింపజేయాలని ప్రభుత్వం భావించింది. అయితే అందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిరాకరించింది. బ్యాలెట్ బాక్సులతోనే జరపాలని ఆదేశించడంతో.. వాటి కోసం ఇతర రాష్ట్ర ప్రభుత్వాలను అభ్యర్థించారు. తెలంగాణ 40,000, తమిళనాడు, కేరళ చెరో 6,000 బ్యాలెట్ పెట్టెలను పంపేందుకు అంగీకరించాయి. కాగా.. ఇప్పటి వరకూ అమలవుతున్న విధానానికి భిన్నంగా ఈ సారి ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లలోని జాబితాలను అభ్యర్థుల పేర్లలోని ఆంగ్ల అక్షరమాల ప్రకారం కాకుండా రాజకీయ పక్షాల పేర్లలోని ఆంగ్ల అక్షరమాలను అనుసరించి రూపొందించనున్నారు.

### రిటర్నింగ్ అధికారుల నియామకం..

మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పట్టణ సంస్థల్లోని ప్రతి 2-4 వార్డులకు ఒక గ్రూపు చొప్పున ఏర్పాటు చేసి, వాటికి ఎన్నికల అధికారి (ఈవో) లేదా రిటర్నింగ్ ఆఫీసర్, అదనపు, సహాయ ఈవోలను నియమించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించింది. ప్రతి 1,200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ఉన్నతాధికారులు ఈ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే తిరుపతి, చిత్తూరు, కర్నూలు, విజయనగరం నగర పాలక సంస్థల్లో రిటర్నింగ్ , అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను నియమించారు.

# దైవసేవకుడివా... దళారీవా?

**టీటీడీ చైర్మన్‌కు ఆనంద్‌సూర్య ప్రశ్నలు**



ఆనంద్‌సూర్య

మంగళగిరి, జనవరి 31: టీటీడీ పాలకమండలి చైర్మన్ హోదాలో ఉంటూ క్షుద్ర రాజకీయాలు, దళారీ పనులు చేయడం వైవీ సుబ్బారెడ్డికి తగదని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద్‌సూర్య అన్నారు. అవే ముఖ్యమనుకుంటే టీటీడీ పదవికి రాజీనామా చేయాలన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న అనైతిక చర్యలకు మద్దతుగా ఉంటూ శాసనమండలి గ్యాలరీలో కూర్చొని ఎమ్మెల్సీలను కొనుగోలు చేసేందుకు సుబ్బారెడ్డి ప్రయత్నించడం దారుణమన్నారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండా, రాజకీయాలతో సంబంధాలు లేకుండా ఉండాల్సిన వ్యక్తికి మండలి గ్యాలరీల్లో ఏం పనని ప్రశ్నించారు. ఆయన దైవసేవకుడా, దళారీనా అంటూ సుబ్బారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ శారదా పీఠంలో కూర్చొని భూ సమీకరణలు, దళారీ పనులు, వాటిద్వారా వచ్చే కమీషన్లు నొక్కేయడమే ధ్యేయంగా పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. హథీరాంజీ మఠం భూములతో పాటు భీమిలీలో ఓ సత్రం భూములు, ద్వారకా తిరుమల దేవస్థానం భూములను కొట్టేసేందుకు కార్యాచరణ మొదలుపెట్టేశారని ఆరోపించారు. హథీరాంజీ మఠానికి తిరుపతి, హైదరాబాద్, పుణెలో రూ.వేలకోట్ల విలువచేసే 2వేల ఎకరాలకుపైగా భూములు ఉన్నాయన్నారు. వ్యూహం ప్రకారం వాటిని కాజేసేందుకు జగన్, సుబ్బారెడ్డి బృందం రంగం సిద్ధం చేసిందన్నారు. మఠంలో అవకతవకలు ఉన్నాయన్న అరోపణపై మహంతు అర్జున్‌దాస్‌ను సస్పెండ్ చేసి శ్రీకాళహస్తి ఈవోకు బాధ్యతలు అప్పగించారన్నారు. ఆర్జేసీని కాదని ఒక ఆలయ ఈవోకు బాధ్యతలను ఇవ్వడంలోనే ప్రభుత్వ దురుద్దేశం అర్థమవుతోందన్నారు. జగన్ ప్రభుత్వం సాగిస్తున్న కుట్రలను ఎదుర్కొంటామని, టీడీపీ తరపున న్యాయపోరాటం చేసి ఆ భూములను కాపాడతామని ఆనంద్‌సూర్య పేర్కొన్నారు.

## మఠం భూములు టీటీడీకి అప్పగించాలి

**బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భానుప్రకాశ్ రెడ్డి**

తిరుమల, జనవరి 31: హథీరాంజీ మఠం భూములను టీటీడీకి అప్పగించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భానుప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. మఠం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరి కాదన్నారు. వందల ఏళ్లుగా కొనసాగుతున్న మఠం ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో కొందరు రాజకీయ నాయకుల కబంధ హస్తాల్లో రూ.వందల కోట్ల విలువైన భూములు చిక్కుకుపోయాయని ఆరోపించారు. ఆ పొరపాట్లను సరిదిద్దాల్సిన ప్రభుత్వం హడావుడిగా మఠం మహంతు అర్జున్‌దాస్‌ను తొలగించి శ్రీకాళహస్తి ఆలయ ఈవోకు బాధ్యతలు ఇవ్వడం ఎంతవరకు సబబన్నారు. ఇదే తరహాలో వక్ఫ్‌బోర్డు, క్రైస్తవ మిషనరీల్లో జోక్యం చేసుకునే దమ్ము ఉందా అని నిలదీశారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రభుత్వ వ్యవహారశైలి ఉందన్నారు.

# మాట విననందుకే మహంతుపై వేటు?





### మఠం భూముల విషయంలో ఒక్కటైన 'గురుశిష్యులు'

- **పార్టీ పెద్దలకు రాజకీయ కోణంలో విషయం చేరవేత**
- **బాధ్యతల అప్పగింతలోనూ ఎన్నో ముందు జాగ్రత్తలు**

తిరుపతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): భూముల వ్యవహారంలో 'పెద్దల' మాట విననందుకే హథీరాంజీ మఠం మహంతుపై వేటు పడిందా? అంటే అవునన్న సమాధానమే వినిపిస్తోంది. మఠం వ్యవహారాలన్నీ క్షుణ్ణంగా తెలిసిన వర్గాలు దీన్నే ధ్రువీకరిస్తున్నాయి. కొంతకాలంగా ఒకరికొకరు దూరంగా ఉంటున్న 'గురుశిష్యులు' ఈ విషయంలో మాత్రం ఏకమై తెరవెనక తంతు నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. తన అధికారాలను ప్రశ్నించేవారిపై న్యాయస్థానాల్లో పోరాడే స్వభావం ఉన్న కారణంగానే మహంతును పక్కన పెట్టించినట్టు ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలు కూడా దీనితో ముడిపడి ఉన్నందున సదరు గురుశిష్యుల ప్రతిపాదనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపినట్టు తెలుస్తోంది. మఠం నిర్వహణ విషయానికొస్తే ఇంతకూ మహంతు పాల్పడిన అక్రమాలు ఏమిటి? అందులో దేవదాయ శాఖ తేల్చిందేమిటి? అన్న ప్రశ్నలొస్తున్నాయి.

#### మఠంపై కన్నెందుకంటే...

తిరుపతి కేంద్రంగా నడుస్తున్న హథీరాంజీ మఠానికి ఘన చరిత్ర ఉంది. తిరుమల శ్రీవారి ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసిన మఠంగా దేశవ్యాప్త ప్రతిష్ఠ ఉంది. ఇప్పటి అంచనా ప్రకారం దాదాపు రూ.5- 6వేల కోట్లకు పైబడిన ఆస్తులూ ఉన్నాయి. తిరుపతి గాంధీరోడ్డులో మఠం ప్రధాన కార్యాలయం ఉండగా తిరుమలలో కూడా మఠం, భక్తులకు కేటాయించేందుకు గదులు, శ్రీకృష్ణుడి ఆలయం ఉన్నాయి. తిరుపతిలో రెండు ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు 2,400 ఎకరాల భూములున్నాయి. హైదరాబాద్, చెన్నై, కంచి, ఊటీతో పాటు కర్ణాటక, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పలు చోట్ల ఆస్తులున్నాయి. ఆస్తుల లీజులు, అద్దెల రూపంలో భారీఎత్తున ఆదాయం మఠానికి అందుతోంది. మఠం నిర్వహణ కోసం పెద్దసంఖ్యలో సిబ్బంది ఉన్నారు. మఠం ఎవరి స్వాధీనంలో ఉంటే నిర్వహణ వారి చేతుల్లోనే వుంటుంది. రాజకీయంగా చూస్తే మఠం పెద్ద ఆదాయ వనరు. తమను నమ్ముకున్నవారికి నేతలు మఠంలో చిరుద్యోగులుగా ఉపాధి కల్పించవచ్చు. మఠం ఆస్తులు కారుచౌకగా లీజుపై దక్కించుకోవచ్చు. ఒకసారి లీజు రూపంలో భూములు చేతికొస్తే తిరిగి అవి మఠానికి దక్కుతాయన్న గ్యారెంటీ లేదు. అటువంటి ఉదాహరణలు తిరుపతిలో కోకొల్లలు. అధికార పార్టీకి చెందిన పెద్దల కన్ను మఠంపై పడటానికి ప్రధాన కారణం ఇదే. అయితే ఈ అసలు సంగతి దాచిపెట్టి.. రాజకీయ కోణంలో పార్టీ పెద్దల దృష్టికి విషయం తీసుకెళ్లినట్టు సమాచారం. ఉగాదికి పేదలకు ఇళ్లస్థలాల పట్టాలివ్వాల్సి ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగం భూముల అన్వేషణలో పడింది. తిరుపతిలో ప్రభుత్వ భూములు పెద్దగా లేవు. ఉన్నవన్నీ మఠం భూములే. పేదలకు ఇళ్లస్థలాలుగా వీటిని కేటాయించే అవకాశముందని పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో పైనుంచి సానుకూల సంకేతాలు అందినట్టు సమాచారం. మహంతు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయిన సమాచారం తొలుత అధికార పార్టీ సానుభూతిపరుల ద్వారానే మీడియాకు అందడం గమనార్హం.

#### మహంతుపై ప్రభుత్వానికి ఫిర్యాదులు

హథీరాంజీ మఠం మహంతు అర్జున్‌దాస్‌పై పలు ఆరోపణలున్నాయి. మఠం నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారని, ఆస్తులను అన్యాక్రాంతం చేశారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. గతంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి పర్యవేక్షణలో మఠం నడిచేది. కానీ సంప్రదాయానుసారం మహంతు తప్పక ఉండాలని అర్జున్‌దాస్ న్యాయస్థానాన్ని ఆశ్రయించి అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఇదంతా టీడీపీ హయాంలో జరగడంతో ఆయనపై టీడీపీ సానుభూతిపరుడనే ముద్ర పడింది. మఠం నిర్వహణ, భూముల వ్యవహారాల్లో అర్జున్‌దాస్ ఎవరికీ రబ్బర్ స్టాంపుగా వ్యవహరించరన్న పేరుంది. తనను ఒత్తిడికి గురి చేసినా, తన పెత్తనాన్ని తొలగించే ప్రయత్నం చేసినా కోర్టులను ఆశ్రయించి పోరాడే మనస్తత్వం కలిగినవారని చెబుతున్నారు. ఈ కారణంగానే తిరుపతి రాజకీయాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్న గురుశిష్యులకు మహంతు కొరుకుడు పడలేదు. దీంతో ఆ ఇద్దరూ ఒక్కటై ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో విజయం సాధించారు. మఠం బాధ్యతల నుంచి మహంతును తప్పించే సమయంలో అనేక ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. మఠం భూములు ఇతర అవసరాలకు వాడుకునేందుకు వీలుగా రెవెన్యూ వ్యవహారాలపై పట్టు కలిగినవారిని, ఇతర ఒత్తిళ్లకు లొంగకుండా సొంత సామాజికవర్గానికి చెందినవారిని ఎంపిక చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో తాము అనుకున్నది అనుకున్నట్టుగా జరిపించుకోవడం నేతలకు సులువుగా మారనుందని ఈ వ్యవహారం గురించి తెలిసిన వారంటున్నారు.

### సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేయండి

**హైకోర్టులో మహంతు పిటిషన్**

అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం మహంతు పదవి నుంచి తనను తొలగిస్తూ ఈ నెల 28న దేవదాయశాఖ కమిషనర్ జారీచేసిన ఆదేశాలను రద్దు చేయాలని అభ్యర్థిస్తూ మహంతు అర్జున్‌దాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ తనను సస్పెండ్ చేశారని వివరించారు. తనను మహంతుగా కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు.

### మఠం వ్యవహారాలపై న్యాయపోరాటం

మహంతుపై పలు ఆరోపణలున్న మాట నిజమే. కానీ మఠం భూముల అడ్డగోలు విక్రయాలకు పాల్పడిన ఉదంతాలు లేవు. ఇక్కడ మహంతును కాదని దేవదాయశాఖ చేసిన నిర్వాకమేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. 2003లో మఠం నిర్వహణ దేవాదాయశాఖ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉండేది. అప్పట్లో శాఖ అధికారులు తిరుపతి శివార్లలోని అవిలాల ప్రాంతంలో విలువైన భూములను లేఅవుట్లుగా మార్చి ప్లాట్లు వేసి బహిరంగ వేలంలో విక్రయించారు. ఆ ప్లాట్లు రిజిస్టర్ కాకుండా మహంతు అర్జునదాసే హైకోర్టును ఆశ్రయించి అడ్డుకోగలిగారు. ఇప్పటికీ ఆ భూములు మఠం ఆధీనంలోనే ఉన్నాయి. అయితే మహంతును తొలగించిన మర్నాడే.. అంటే గురువారమే ఆయా ప్లాట్ల యజమానులు సంబంధిత స్థలాలను చదును చేయించేందుకు ప్రయత్నించగా మఠం సిబ్బంది అడ్డుకున్నారు. మఠాన్ని అభిమానించే తిరుపతి వాసులు ఈ ఉదాహరణలు చూపి మహంతు పాలన మేలా, దేవదాయ శాఖ పాలన మేలా అని ప్రశ్నిస్తున్నారు.



శనివారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. తిరుమలేశుడు ఏడు ప్రధాన వాహనాలపై విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నాడు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. - ఆంధ్రజ్యోతి, తిరుమల

## అమరావతికి తమిళుల సంఘీభావం

చెన్నై, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 'తెలుగువారమై ఉండి అమరావతి రైతుల ఉద్యమానికి మద్దతివ్వకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతాం. అందుకే చెన్నైలోని తెలుగు ప్రజల తరపున రైతుల పోరాటానికి సంఘీభావం తెలియజేస్తున్నాం. రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందాలని గతంలో ఫండ్ కూడా ఇచ్చాం. ఇప్పుడు రైతులకు న్యాయం చేయాలన్న ఏకైక డిమాండ్‌తో పార్టీలకతీతంగా పోరాటానికి సిద్ధమవుతున్నాం' అని తమిళనాడులోని ప్రవాసాంధ్రులు ప్రకటించారు. చెన్నైలోని వివిధ సంఘాల ప్రతినిధులు, భాషాభిమానులు, ప్రవాసాంధ్రులు శుక్రవారం చెన్నైలో విలేకరులతో మాట్లాడారు. ఏపీ బంగారు భవిష్యత్తును కాంక్షిస్తూ రాజధాని కోసం వేల ఎకరాల భూములు ఇచ్చి దిక్కుతోచని స్థితిలో ఉన్న అమరావతి రైతులకు న్యాయం జరగాలన్నారు. ఇందుకోసం అమరావతి రైతుల ఉద్యమానికి సంఘీభావంగా తమిళనాడు తెలుగు అసోసియేషన్స్ సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వళ్లువర్‌కోట్టం వద్ద ఆదివారం ధర్నా చేస్తామని ప్రకటించారు.

### ఏపీఎస్ఆర్టీసీకి ఐటీ సేవల్లో ప్రథమస్థానం

విజయవాడ (బస్‌స్టేషన్), జనవరి 31: ఏఎస్ఆర్‌టీయూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఎక్స్‌లెన్స్ అవార్డు ఏపీఎస్ఆర్టీసీకి లభించింది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో దేశంలోని 64 ఆర్టీసీ సంస్థలు పాల్గొనగా ఏపీఎస్ఆర్టీసీ ఐటీ ఇన్ డిజిటలైజేషన్ విభాగంలో ఉత్తమ ప్రతిభను కనబరిచింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి విజయ్‌కుమార్ సింగ్ చేతుల మీదుగా ఏఎస్ఆర్‌టీయూ ఎక్స్‌లెన్స్ అవార్డు, రూ.10 లక్షల నగదును ఆర్టీసీ ఈడీ ఎ.కోటేశ్వరరావు (ఎ), సీఈ వి.సుధాకర్ (ఐటీ), డిప్యూటీ సీఈ వై.శ్రీనివాసరావు (ఐటీ) అందుకున్నారు.

### ఐఎన్‌టీయూసీ నేత కేఎస్ కన్నుమూత

విశాఖపట్నం, జనవరి 31: ఐఎన్‌టీయూసీ కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు, ఏపీ శాఖ ఉపాధ్యక్షుడు కానేటి సూర్యమోహన్‌కుమార్(కేఎస్) (74) శుక్రవారం విశాఖలో గుండెపోటుతో కన్నుమూశారు. మోహన్‌కుమార్ మృతి పట్ల ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి సంతాపాన్ని వ్యక్తంచేశారు.

### అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

గురజాల, జనవరి 31: అప్పుల బాధ తట్టుకోలేక గుంటూరు జిల్లాలో ఓ కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గురజాల మండలం కొత్త అంబాపురం గ్రామానికి చెందిన వడిశాల కొటిరెడ్డి (45) సుమారు 15 ఎకరాలు కౌలుకు తీసుకుని రూ.10 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. అప్పు తీర్చే మార్గం కనిపించక మనస్తాపం చెంది శుక్రవారం తెల్లవారుజామున ఉరి వేసుకున్నాడు.

### కదం తొక్కిన బ్యాంకు ఉద్యోగులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: కనీస వేతన సవరణ 20 శాతం ఉండాలని, నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు కదం తొక్కారు. బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న పది లక్షల మంది ఉద్యోగులు, అధికారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న తొమ్మిది ఉద్యోగ, అధికారుల కార్మిక సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శనలకు దిగారు.

### పట్టణ పేదల ఇళ్ల లేఅవుట్లకు సడలింపు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టణ ప్రాంతాల్లోని పేదలకు కల్పించే గృహవసతి కోసం లేఅవుట్లు, అపార్ట్‌మెంట్లకు కావాల్సిన అనుమతుల విషయంలో పురపాలకశాఖ కార్యదర్శి జె.శ్యామలరావు శుక్రవారం మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ పథకం కింద చేపట్టే లేఅవుట్ల ప్రతిపాదనలను ఆఫ్‌లైన్ విధానంలోనే పరిశీలించనున్నారు. గతంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) లేఅవుట్ల విషయంలోనూ ఇదే పద్ధతిని అనుసరించారు. అవసరమైన మార్పుచేర్పులను కాలయాపన లేకుండా చేసుకోవచ్చుననే అభిప్రాయంతో ఈ వెసులుబాటు కల్పించారు. ఈ ఇళ్ల స్థలాల విస్తీర్ణం తక్కువైనందున అవి ఉండే లేఅవుట్లలోని రహదారులు కనీసం 9 మీటర్ల (30 అడుగుల) వెడల్పు ఉంటే చాలు. అయితే ఈ రోడ్లు ఆయా ప్రాంతాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్లు లేదా ప్రధాన రహదారులకు అనుసంధానమై ఉండాలి.

### ఎట్టకేలకు ఇళ్ల బిల్లులు రూ.262 కోట్లు మంజూరు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఎట్టకేలకు పేదల ఇళ్లకు బిల్లులు మంజూరు చేసింది. గత ప్రభుత్వం ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏప్రిల్‌లో బిల్లులు నిలిపివేయగా ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం... ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా బిల్లులు ఇవ్వలేదు. దీంతో ఇళ్లు కట్టుకుంటున్న పేదల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కాకపోయినా కనీసం కేంద్రంతో కలిసి చేపట్టే వాటికి బిల్లులు ఇవ్వాలని గృహనిర్మాణశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పట్టణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల పథకం బీఎల్‌సీకి రూ.165కోట్లు విడుదల చేసేందుకు పరిపాలనా అనుమతులు మంజూరుచేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే పీఎంఏవై ఇళ్లకు మరో రూ.97కోట్లు విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## రెండేళ్లుగా.. ఇంట్లోనే బందీలుగా!

- **బొబ్బిలిలో ఓ కుటుంబం వింత పరిస్థితి**
- **పిల్లలను పాఠశాలకూ పంపని వైనం**
- **సీఎం జగన్ రావాలని, డిప్యూటీ సీఎం పోస్టు ఇవ్వాలని ఇంటి యజమాని డిమాండ్!**

బొబ్బిలి, జనవరి 31: ఇద్దరు దంపతులు.. వారికి ఇద్దరు పిల్లలు.. అందమైన కుటుంబం.. అందరితో కలిసిమెలిసి సరదాగా గడిపేవారు. ఇదంతా రెండేళ్ల కిందటి మాట. ఏమైందో ఏమో.. ప్రస్తుతం ఈ కుటుంబం బాహ్య ప్రపంచాన్ని చూడడం లేదు. ఇంటి నాలుగు గోడలకే పరిమితమయ్యారు. ఆఖరికి ఇరుగుపొరుగు వారితోనూ మాట్లాడడం లేదు. తాజాగా.. మీడియా ప్రతినిధులు వారిని కలిసి మాట్లాడితే.. సీఎం జగన్ రావాలని, తనకు డిప్యూటీ సీఎం పోస్టు ఇవ్వాలని వింత వాదన వినిపించడం విస్తుగొలిపే అంశం!. ఇదీ విజయనగరం జిల్లా బొబ్బిలిలోని ఓ కుటుంబం పరిస్థితి. స్థానికుల కథనం ప్రకారం... బొబ్బిలి పట్టణ పరిధిలోని ఓ వీధిలో ఇద్దరు పిల్లలతో కలసి భార్యాభర్తలు ఉంటున్నారు. వీరికి బంధువులు కూడా ఎక్కువే!. కానీ సుమారు రెండేళ్లుగా పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు. బంధువులతోనూ... కనీసం ఇరుగుపొరుగు వారితోనూ మాట్లాడడం లేదు. బ్యాంకులు, బజారు పనులు ఉంటే.. జన సంచారం తక్కువగా ఉన్న సమయంలో ఆ కుటుంబ యజమాని బయటకు వచ్చి.. వెంటనే లోపలికి వెళ్లి గడియ పెట్టుకుంటారని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. ఈ దంపతుల ఇద్దరు పిల్లలు రెండేళ్ల కిందటి వరకూ ఓ ప్రయివేటు పాఠశాలలో చదివేవారు. రెండేళ్ల నుంచి వారు కూడా బడికి వెళ్లకుండా రెండేళ్లుగా ఇంట్లో బందీలుగా ఉన్నారు. రెండు నెలల క్రితం ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లగా.. మహిళా ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తన సిబ్బందితో వారి నివాసానికి వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. పిల్లలను స్కూలుకు పంపించేందుకు ఒప్పించారు. అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పులేదు. ఆ విషయం ఆనోటా ఈనోటా పడి శుక్రవారం స్థానికంగా విస్తృత చర్చకు దారితీయగా, మీడియా ప్రతినిధులు వారి ఇంటికి వెళ్లి ఆ దంపతులతో మాట్లాడారు. సీఎం జగన్, ఆయన తల్లి విజయమ్మ రావాలని... తనకు డిప్యూటీ సీఎం పోస్టు ఇవ్వాల్ని ఇంటి యజమాని చెప్పడంతో మీడియా ప్రతినిధులు అవాక్కయ్యారు. ఆ తర్వాత మళ్లీ పొంతన లేకుండా మాట్లాడడంతో వారు తిరుగుముఖం పట్టారు. ఈ విషయమె ఏఎస్పీ గౌతమి శాలి దృష్టికి తీసుకెళ్లగా... తమ అధికారులను పంపి ఆరా తీస్తామన్నారు. ఆ కుటుంబ సభ్యులతో అధికారులు మాట్లాడి సమస్య ఏమిటో తెలుసుకోవాలని, వారి పిల్లలను పాఠశాలకు పంపించేలా చూడాలని స్థానికులు, బంధువులు కోరుతున్నారు.

### జర్మనీలో తెలుగు విద్యార్థి ఆత్మహత్య



మోహన్‌రెడ్డి (ఫైల్)

ముప్పాళ్ళ, జనవరి 31: ఉన్నత విద్య కోసం జర్మనీ వెళ్లిన విద్యార్థి.. ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరు జిల్లా ముప్పాళ్ళకు చెందిన విద్యార్థి లోకసాని మోహన్‌రెడ్డి (23)ది సామాన్య రైతు కుటుంబం. తండ్రి గోవిందరెడ్డి వ్యవసాయంతోపాటు విద్యుత్ పరికరాలు రిపేర్ చేస్తుంటారు. మోహన్‌రెడ్డి జర్మనీలోని డస్‌బర్గ్‌ఈసెన్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ చేసేందుకు 2017లో అక్కడకు వెళ్లాడు. కోర్సు పూర్తికావస్తున్న తరుణంలో కొన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. నాలుగు రోజుల క్రితమే తండ్రికి ఫోన్ చేసి సరిగా చదవలేకపోతున్నానని వాపోయాడు. అయితే కొడుక్కి ధైర్యం చెప్పిన తండ్రి పరీక్షలు బాగా రాయాలని కోరాడు. కానీ.. మనస్థాపం చెందిన మోహన్‌రెడ్డి బుధవారం తాను నివసిస్తున్న భవనంలోని నాలుగో అంతస్థు నుంచి దూకి ప్రాణం తీసుకున్నాడు.

# వినియోగదారులకు రక్షణేదీ?

- **సభ్యులు లేక ఫోరాలు అచేతనం**
- **నియామకాలు పట్టని ప్రభుత్వం**
- **పరిష్కారమవని పాత ఫిర్యాదులు**

"వినియోగదారుడు అత్యంత కీలకమైన వ్యక్తి. అతను మనపై ఆధారపడలేదు. మనమే అతడిపై ఆధారపడి ఉన్నాం. వినియోగదారుడు మనవద్దకు రావడం, అతడికి సేవ చేయడం అదృష్టంగా భావిద్దాం." - మహాత్మాగాంధీ

కడప, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వినియోగదారుల ఫోరం వ్యవస్థ అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారింది. మహాత్ముడి సూక్తులు గోడలపై బోర్డులకే పరిమితం అవుతున్నాయి. ఆచరణలో వినియోగదారులకు మాత్రం న్యాయం జరగడం లేదు. కమిటీ సభ్యుల నియామకంలో ప్రభుత్వ నిర్లిప్తతతో కేసులు పరిష్కారం కావడంలేదు. కేసుల విచారణ జరగక, వినియోగదారుల ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయనే ఆరోపణలున్నాయి. వారి సంరక్షణకు 1986లో వినియోగదారుల సంరక్షణ చట్టం(కన్జ్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్) అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ప్రతి జిల్లాలో రిటైర్డ్ జడ్జి చైర్మన్‌గా, న్యాయనిపుణుడు, సామాజిక నిపుణుడు ఒక్కొక్కరు చొప్పున సభ్యులుగా 'వినియోగదారుల ఫోరం' ఏర్పాటుచేయాలి. అయితే రాష్ట్రంలో మొత్తం 17 ఫోరాలకు గాను 13 ఫోరాల్లో సభ్యుల నియామకాలు చేపట్టకపోవడంతో అచేతనావస్థకు చేరుకుంటున్నాయి. కేసుల విచారణ జరగక, వినియోగదారుల ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయనే ఆరోపణలున్నాయి. కడప, కర్నూలు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, పశ్చిమగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కేంద్రాల్లో ఒక్కోటి, కృష్ణా, విశాఖపట్నం, చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో రెండు చొప్పున కన్జ్యూమర్ ప్రొటెక్షన్ ఫోరాలున్నాయి. వినియోగదారుల చట్టం ప్రకారం కేసులు పూర్తిస్థాయిలో విచారణ జరగాలంటే చైర్మన్, ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీని నియమించాలి. కడప, విశాఖ, నెల్లూరు, కృష్ణాజిల్లాల్లో మాత్రమే ముగ్గురు సభ్యులతో కూడిన ఫోరాలున్నాయి. మిగిలిన వాటిల్లో సభ్యులు లేకపోవడంతో కేసుల విచారణ పూర్తిగా ఆగిపోయిందని ఓ సీనియర్ న్యాయవాది తెలిపారు. పాతవి పరిష్కారం కాకపోవడంతో కొత్తగా కేసులు నమోదు కావట్లేదని, కీలకమైన వినియోగదారుల ఫోరం వ్యవస్థ అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారిందని న్యాయ నిపుణులు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని అన్ని జిల్లాల్లోని ఫోరాలకు చైర్మన్, ఇద్దరు సభ్యులతో పూర్తిస్థాయి కమిటీలను నియమించి, తమ హక్కులను పరిరక్షించాలని వినియోగదారులు కోరుతున్నారు.

**ఆయా జిల్లాల వినియోగదారుల ఫోరాల్లో ఖాళీల వివరాలు...**

| ఫోరం | ఖాళీలు |
|---|---|
| కర్నూలు | 2 |
| కృష్ణా జిల్లా | 3 |
| శ్రీకాకుళం | 3 |
| ప్రకాశం జిల్లా | 2 |
| విశాఖపట్నం-2 | 3 |
| విజయనగరం | 2 |
| పశ్చిమ గోదావరి | 2 |
| అనంతపురం | 2 |
| చిత్తూరు | 2 |
| చిత్తూరు జిల్లా | 2 |
| తూ.గోదావరి-1 | 3 |
| తూ.గోదావరి-2 | 2 |
| గుంటూరు | 2 |

## సీఆర్ ఫౌండేషన్‌లో మహిళలకు వృత్తి శిక్షణ

**ఫౌండేషన్ అధ్యక్షుడు కె.నారాయణ**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కె.నారాయణ

హైదరాబాద్ జనవరి 31(ఆంధ్రజ్యోతి): సీఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోసం విద్యార్థినులు, యువతులు, మహిళలకు ఉచితంగా వృత్తి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ చైర్మన్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 10వేలకు పైగా విద్యార్థినులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇప్పించామని తెలిపారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెంట్రల్ జర్నలిస్టు ఇన్వెస్టిగేషన్‌లో సీఆర్ ఫౌండేషన్ ఓల్డేజ్ హోం బెస్ట్ ఓల్డేజ్ హోంగా గుర్తింపు పొందిందన్నారు. హెల్త్‌సెంటర్ ద్వారా వైద్య సేవలు కూడా అందిస్తున్నామని చెప్పారు. తమ పని తాము చేసుకోలేని, అవసానదశలో ఉన్న వారికి పూర్తి బెడ్‌సేవలు అందించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వృత్తి విద్య శిక్షణతో పాటు సామాజిక అవగాహన పెంపొందించడానికి వివిధ అంశాలపై అనుభవజ్ఞులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని మహిళా సంక్షేమ కేంద్రం కన్వీనర్ పి.వనశ్రీ తెలిపారు. మహిళలకు డిజిటల్ మార్కెటింగ్(ఉద్యోగ అవకాశాలు చూపేందుకు), స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసం, సెల్ఫ్‌డిఫెన్స్ టెక్నిక్స్, కంప్యూటర్ కోర్సులు(ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ), టైలరింగ్, మిషన్ ఎంబ్రాయిడరీ, మగ్గంవర్క్, బ్యూటీషియన్ తదితర వృత్తి పనుల్లో 3 నెలల ఉచిత కోర్సులను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు 9030837067, 9642672629 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.


**బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్**

**గమనిక: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లోని పింఛనుదారులందరికీ**

**BSF పెన్షన్ అదాలత్**

BSF పింఛనుదారులు మరియు దక్షిణ రాష్ట్రాలకు చెందిన వారి SOKలు వారి సమస్యలు పరిష్కరించుకొనుటకు BSF వద్ద SHQ BSF త్రివేంద్రం వద్ద BSF పెన్షన్ అదాలత్ నిర్వహిస్తోంది, అందులో పాల్గొనవచ్చును.

**తేది మరియు సమయం : 24 ఫిబ్రవరి 2020 నుండి 25 ఫిబ్రవరి 2020 వరకు 1000 గం.ల నుండి 1700 గం.ల వరకు.**

**ప్రదేశం : సెక్టార్ HQ BSF త్రివేంద్రం**

**ఏవేని పింఛను సంబంధిత సమస్యలు కలిగినట్టి పింఛనుదారులు/కుటుంబ పింఛనుదారులు దాఖలు చేయవలసిన డాక్యుమెంట్లు:**

1. పింఛనుదారు/కుటుంబ పింఛనుదారు పేరు.
2. రెజిమెంటల్ నంబర్/IRLA నం.
3. PPO నం. పింఛనుదారు/కుటుంబ పింఛనుదారు ప్రస్తుత చిరునామా.
4. టెలిఫోన్ నం.
5. ఇ-మెయిల్/ఫ్యాక్స్ నం.
6. పింఛనుదారు పుట్టిన తేది (పుట్టిన తేది రుజువు జతపరచాలి)
7. పదవీవిరమణ తేది/ మరణించిన తేది (డెత్ సర్టిఫికెట్ కాపీ జతపరచాలి)
8. పదవీవిరమణ రకం: సూపర్ యాన్యుయేషన్/VRS/ఇన్‌వాలిడ్ వగైరా
9. సదరు పదవీవిరమణ పొందిన యూనిట్/HQ
10. బ్యాంక్ పేరు మరియు చిరునామా (పాస్‌బుక్ మొదటి పేజి కాపీ జతపరచాలి)
11. బ్యాంక్ ఖాతా నంబర్/ బ్యాంక్ BSR కోడ్.
12. భాగస్వామి/కుటుంబ పింఛనుదారు పేరు
13. భాగస్వామి/కుటుంబ పింఛనుదారు పుట్టిన తేది (పుట్టిన తేది రుజువు జతపరచాలి)
14. సమస్యల వివరాలు : 1) పింఛను మార్పుకు సంబంధించినవి. 2) ఇతర సమస్యలు

**గమనిక:** i) వ్యాజ్యాలలో ఉన్న కేసులు పెన్షన్ అదాలత్‌లో చర్చించబడవు. దక్షిణ రాష్ట్రాలలో నివసిస్తున్న BSF పింఛనుదారులు/కుటుంబ ఫించనుదారులందరూ పెన్షన్ అదాలత్‌లో పాల్గొనవచ్చును మరియు తపాలా ద్వారా/స్వయంగా/ఇమెయిల్/ఫ్యాక్స్ ద్వారా దిగువ చిరునామాకు 15 ఫిబ్రవరి 2020 లోగా పై సమాచారాన్ని దాఖలు చేయవలసిందిగా కోరబడుతున్నారు.

**చిరునామా:** ది డైరెక్టర్ (అకౌంట్స్) పే అండ్ అకౌంట్స్ డివిజన్ (BSF), 2వ అంతస్తు, పుష్ప భవన్, మాదాంగిర్, న్యూఢిల్లీ-110062, ఫోన్ నం.011-29054002, ఫ్యాక్స్: 011-29052520, ఇమెయిల్ (dir.pad.bsf@gmail.com)

ii) ఒకవేళ పింఛనుదారు వారి దరఖాస్తును ముందుగా దాఖలు చేసుకోనిచో, వారు SHQ BSF త్రివేంద్రం వద్ద 24 & 25 ఫిబ్రవరి 2020న వారు పైన తెలిపిన విధంగా డాక్యుమెంట్లను అన్నింటినీ తీసుకురాగలరు.

ఒకవేళ పై విషయం నిమిత్తం లేదా పెన్షన్ అదాలత్‌కు సంబంధించిన ఏవేని సమస్యలకు ఏదేని సహాయం/సహకారం కావలసినచో దిగువ వారిని సంప్రదించగలరు:

**Sh. N N D Dubey, DIG (RR) Adm Dte FHQ BSF:**

**ఫోన్: నం.011-24363302, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్**

**ఫోన్ నం.011-29054002, 24 గంటల BSF హెల్ప్‌లైన్ నంబర్: 1800113455**

**గమనిక:** ఎటువంటి TA/DA అనుమతించబడవు, అయితే సదరు ప్రదేశం వద్ద 24 & 25 ఫిబ్రవరి 2020 న టీ మరియు భోజనం ఏర్పాటు చేయబడును

davp 19110/11/0103/1920






వధూవరులను ఆశీర్వదిస్తున్న ఏపీ మాజీ సీఎం చంద్రబాబు, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ

### ఘనంగా పరిటాల సిద్ధార్థ నిశ్చితార్థ వేడుక

మొయినాబాద్, జనవరి 31: ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పరిటాల సునీతా రవీంద్ర కుమారుడు సిద్ధార్థ-మామిళ్లపల్లి తేజస్విని వివాహ నిశ్చితార్థ వేడుక శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. హైదరాబాద్ నగర శివారు గండిపేట ప్రాంతంలోని రిధిరా రిట్రీట్ రిసార్ట్‌లో ఈ వేడుక జరిగింది. వేడుకకు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఏపీ మాజీ మంత్రులు నారా లోకేష్, దేవినేని ఉమ, ఎమ్మెల్యే వంశీ, బీజేపీ ఎంపీ సుజనా చౌదరి, తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, టీడీపీ-టీఎస్ అధ్యక్షుడు రమణ, నటుడు మోహన్‌బాబు, మంచు లక్ష్మి, బీజేపీ నాయకుడు వీరేందర్‌గౌడ్ తదితరులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# సమతా తీర్పు!

తెలంగాణలోని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రెండు నెలల క్రితం ఒక మహిళపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలో ముగ్గురు నిందితులకు ఉరిశిక్ష విధిస్తూ గురువారం ఆదిలాబాద్ ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు చెప్పింది. పూసలు, బొట్టు బిళ్లలు, బెలూన్లు వంటివి అమ్ముకుంటూ ఊరూరా తిరిగే నిరుపేద దళిత మహిళ ఆమె. ఒక గ్రామం నుంచి పొరుగు గ్రామానికి పోతున్న క్రమంలో మధ్యలో ఉన్న పంటచేల్లో ఈ దుర్మార్గులు ఆమెను అటకాయించారు. నిర్మానుష్య స్థలానికి లాక్కుపోయి, అత్యాచారానికి ఒడిగట్టారు. ఆమె జీవించి ఉన్నపక్షంలో తాము దొరికిపోతామన్న భావనతో కొక్కోకొసే కత్తితో ఆమె గొంతుకోసి, శరీరమంతా పోట్లు పొడిచి పాశవికంగా హత్యచేశారు. తీర్పు వెలువడగానే ఆమె భర్త, ఇతర కుటుంబీకులు పోలీసులకు పాదాలకు నమస్కరించి మరీ కృతజ్ఞతలు తెలియచేశారు. నిందితులను సాధ్యమైన సత్వరంగా శిక్షించగలిగితే బాధిత కుటుంబీకులకు న్యాయం చేకూరిన సంతృప్తి కలుగుతుంది. వారికి ఉపశమనంతో పాటు, సమాజానికి సరైన సందేశమూ అందుతుంది.

గత ఏడాది నవంబరు 24న జరిగిన ఈ దారుణంలో నిందితులకు 66రోజుల్లో ఈ శిక్ష పడింది. అత్యాచార ఘటన జరిగిన కొంతకాలానికి మృతురాలి పేరును సమతగా పోలీసులు మార్చినప్పటికీ, ఈ దారుణం ఆమె గతకాలపు పేరుతోనే ప్రజల మనస్సుల్లో ఉండిపోయింది. మరో మూడురోజులకు, నవంబరు 27న హైదరాబాద్ నగర శివార్లలో పశువైద్యురాలైన 'దిశ' అత్యాచార ఘటన జరిగింది. ఆమె వాహనాన్ని రిపేర్ చేయించే పేరిట నలుగురు దుర్మార్గులు మాయ మాటలతో నమ్మించి, జాతీయ రహదారిపైన, టోల్‌గేట్‌కు అత్యంత సమీపంలో అఘాయిత్యం జరిపి, ఆపై హత్యచేసి, శరీరాన్ని లారీలో మరో ప్రాంతానికి తరలించి తగులబెట్టిన వైనం సమాజాన్ని కుదిపేసింది. నిందితుల్ని షాద్‌నగర్ పోలీసుస్టేషన్‌కు తరలించినప్పుడు వేలాదిమంది గుమిగూడి వారిని అప్పగించాలని నినదించిన విషయం తెలిసిందే. పలు దశల్లో పోలీసుల అలసత్వాన్నీ, వైఫల్యాన్నీ విస్పష్టంగా తెలియచెప్పిన ఈ దారుణం జరిగిన పదిరోజుల్లోనే నిందితులు ఎన్‌కౌంటర్‌కు గురయ్యారు. ఇందుకు పోలీసులకు దక్కిన ప్రశంసల్లో ఔచిత్యాన్ని అటుంచితే, దిశ అత్యాచారానికి మూడురోజుల ముందు జరిగిన సమత అత్యాచార ఘటనలో ప్రభుత్వం శ్రద్ధచూపకపోవడానికి కారణం ఈమె దళితురాలు కావడమేనంటూ దళితనాయకులు కొందరు తీవ్ర విమర్శలు చేశారు. పోలీసు విన్నపం, ప్రభుత్వ సిఫారుతో రాష్ట్ర హైకోర్టు సమత కేసు విచారణకు డిసెంబరు 11న ఆదిలాబాద్‌లో ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుచేయడం, 14న పోలీసులు చార్జిషీటు దాఖలు చేయడం, కోర్టు కూడా అంతేవేగంతో విచారణ జరిపి నెలన్నరకాలంలోనే ఈ తీర్పు వెలువరించడం జరిగిపోయాయి. ఐతే కేసు రాష్ట్ర హైకోర్టు ధ్రువీకరించవలసి ఉండటం, ఆపైన నిందితులకు ఉన్న పలు అప్పీళ్ల దశలను అటుంచితే, ఇంతవరకూ కొనసాగిన ఈ వేగాన్ని హర్షించవలసిందే. సమత కేసులో నిందితుల తరఫున వాదించడానికి న్యాయవాదులు ఎవరూ ముందుకు రాకపోవడం, వివరణ ప్రభుత్వమే ఒక న్యాయవాదిని నియమించవలసి రావడం విశేషం. నేరం ఇలా సత్వరమే రుజువుకావడానికి ఫోరెన్సిక్ నివేదికలు దోహదపడ్డాయి. సమత కేసులో మాదిరిగానే ఇటీవల వరంగల్ జిల్లాలో తొమ్మిది నెలల చిన్నారిపై అత్యాచారం జరిపి, హత్యచేసిన మరో ఘటనలో కూడా దర్యాప్తు, విచారణ ఎంతోవేగంగా పూర్తయి నిందితుడికి శిక్షపడింది. సమాజంలో ఆగ్రహావేశాలు రగిలించి, మీడియా దృష్టిని విశేషంగా ఆకర్షించిన దారుణాలపైనే పోలీసులు, ప్రభుత్వాలు, న్యాయస్థానాలు దృష్టిపెడుతున్నాయన్న అపప్రథ తొలగాలంటే అన్ని కేసుల్లోనూ ఇలాగే సత్వర న్యాయం అందించే ప్రయత్నం విశేషంగా జరగాలి. నిర్భయ ఘటన తరువాత చట్టాలు పదును తేలినా, అత్యాచారాలకు అడ్డుకట్ట పడటం లేదు. న్యాయప్రక్రియలో జాప్యం బాధిత కుటుంబాలకు తీవ్ర మానసిక క్షోభ కలిగిస్తున్నది. సమాజం ఆగ్రహావేశంతో చట్టాలకు అతీతమైన తక్షణ న్యాయాన్ని డిమాండ్ చేసే పరిస్థితి ఉత్పన్నమవుతున్నది. ఈ నేపథ్యంలో, సమత కేసులో సకాలంలో తీర్పు వెలువడటం ప్రశంసనీయమైనది.

# సమైక్య స్ఫూర్తిగా బాపు, బాబాసాహెబ్

■ రామచంద్ర గుహ



గతానుగతం

డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, మహాత్మా గాంధీ పరస్పర ప్రత్యర్థులూ, విరోధులా? ఇరవయ్యో శతాబ్ది మహోన్నత భారతీయులైన ఆ ఇరువురినీ అలా భావించవద్దని ప్రజాస్వామిక వాదులకు దేవనూర్ మహదేవ (కన్నడ రచయిత, సామాజిక క్రియాశీలి) విజ్ఞప్తి చేశారు. నిజమైన సమానత్వ సాధనా ప్రస్థానంలో సహ యాత్రికులుగా వారిని చూడాలని ఆయన అన్నారు. 'నిద్రాణ స్థితిలో వున్న దళితులను అంబేడ్కర్ మేలుకొలిపారు. ఆ జాగృతితో సమానత్వ వెలుగుల దిశగా జాతి పయనమయింది. కుల మతాల సంకుచితత్వంలో వున్న హిందువులను మానవతా వెలుగుల వైపు నడిపించడానికి గాంధీ మహా ప్రయత్నం చేశారు. అంబేడ్కర్ ఉనికి లేకపోయినట్టయితే, బహుశా, గాంధీ తన లక్ష్య సాధనలో అంతగా ముందుకు వెళ్ళగలిగివుండేవారు కాదేమో?! అదే విధంగా హిందువులలో గాంధీ ఉదారవాద, సహనశీల వైఖరులను పెంపొందించి వుండకపోయినట్టయితే అంబేడ్కర్‌ను ఈ క్రూర సవర్ణ సమాజం అంతగా సహించి, గౌరవించి వుండేది కాదు' అని కూడా మహదేవ వ్యాఖ్యానించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు: 'భారత్ తననుతాను కుల శృంఖలాల నుంచి విముక్త పరచుకోవాలంటే సవర్ణులు మారవలసిన అవసరమున్నది. ఇందుకు గాంధీ అవసరం. దళితుల పౌర హక్కుల పోరాటానికి అంబేడ్కర్ తప్పనిసరి. అందుకే వారిరువురినీ ఒకే పక్షానికి తీసుకురావాలని నేను అంటున్నాను'. మహదేవ తన అభి ప్రాయాలను మరింత విపులంగా వెల్లడిస్తూ ఇలా అన్నారు: "అస్పృశ్యతను గాంధీ ఒక 'పాపం'గా పేర్కొనగా, అంబేడ్కర్ ఒక 'నేరం'గా అభివర్ణించారు. ఆ రెండిటినీ మనం పరస్పర వ్యతిరేకమైవిగా ఎందుకు చూస్తున్నాం? అస్పృశ్యత దురాచార నిర్మూలనకు ఆ రెండు భావనలు తప్పనిసరి అని అర్థం చేసుకోవడమే విజ్ఞత అవుతుంది".

న్యూఢిల్లీలో విద్యార్థుల నిరసనలలో అంబేడ్కర్, గాంధీ పోస్టర్లను కలిసికట్టుగా ప్రదర్శించడాన్ని చూసినప్పుడు దేవనూర్ మహదేవ మాటలను నేను గుర్తు చేసుకున్నాను. బాపు, బాబాసాహెబ్ చిత్రాలను పక్కపక్కనే ప్రదర్శించడం ఇదే మొదటిసారి కానప్పటికీ చాలా అరుదైన విషయం. గతంలో గాంధీ అభిమానులు, ఈ మహోన్నత భారతీయులు ఇరువురినీ పరస్పర ప్రత్యర్థులుగా చూసేవారు. 1930, 40 దశకాలలో అంబేడ్కర్ తరచు గాంధీ, ఆయన భావాలపై వివాదాత్మక భాషలో విమర్శలు చేస్తుండేవారు. కాంగ్రెస్ వాదులకు అవి తీవ్ర ఆగ్రహావేశాలు తెప్పించేవి. తమ ప్రియతమ బాపును అలా విమర్శించడాన్ని వారు సహించేవారు కాదు. బ్రిటిష్ వలసపాలనకు అంబేడ్కర్ ఒక సంజాయిషీదారు అని వారు ప్రతి విమర్శలు చేస్తుండేవారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో వైస్రాయ్ కార్యనిర్వాహక వర్గంలో అంబేడ్కర్ చేరడాన్ని గాంధీ అనుయాయులు తీవ్రంగా ఆక్షేపించేవారు. ఇటీవలి దశాబ్దాలలో అంబేడ్కర్ వాదులు మరింత తరచుగా గాంధీని విమర్శిస్తున్నారు. కుల వ్యవస్థను సంస్కరించడంలో ఆయన కృషి చిత్తశుద్ధితో చేసినది కాదని కొట్టివేస్తున్నారు. పూణే ఒడంబడిక సందర్భంలోనూ, ఆ తరువాత తమ ప్రియతమ నాయకుడి పట్ల గాంధీ వైఖరిని వారు తప్పుపడుతున్నారు. అలాగే గాంధీ రాజకీయ వారసుడు జవహర్ లాల్ నెహ్రూ , అంబేడ్కర్ ప్రతిభాపాటవాలను సరైన విధంగా వినియోగించుకోకపోవడాన్ని దుయ్యబడుతున్నారు (నెహ్రూ కేబినెట్‌లో అంబేడ్కర్ రెండు సంవత్సరాల పాటు న్యాయశాఖ మంత్రిగా వున్నారు). ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలలో గాంధీపై దళిత మేధావులు తీవ్ర విమర్శలు చేస్తుంటారు. అయితే కర్ణాటకలో నిమ్న శ్రేణుల రచయితలు గాంధీని ఒక విశాల దృష్టితో చూస్తున్నారు. అంబేడ్కర్, గాంధీల కృషిని పరస్పర పూరకమైనదిగా చూడాలని కీర్తిశేషుడు డి. ఆర్.నాగరాజ్ తన ప్రశస్త పుస్తకం 'ది ఫ్లేమింగ్ ఫీట్'లో మనకు విజ్ఞప్తి చేశారు.

జమియా మిలియా ఇస్లామియా విద్యార్థులకు, షాహీన్ బాగ్ మహిళలకు డి.ఆర్. నాగరాజ్, దేవనూర్ మహదేవ మేధో కృషి గురించి బహుశ, తెలిసివుండకపోవచ్చు. ఆ కన్నడ మేధావులు విశాల దృక్పథంతో గాంధీ గురించి చేసిన విశ్లేషణను జమియా విద్యార్థులు, షాహీన్ బాగ్ మహిళా ఉద్యమకారులు ధ్రువీకరించారు. కర్ణాటక చింతనాపరుల వలే అంబేడ్కర్, గాంధీలను పరస్పర విరోధులుగా చూడవద్దని ఆ సాహసోపేత ఢిల్లీ నిరసనకారులు మనకు విజ్ఞప్తి చేశారు. ఆ ఇరువురు మహోన్నతులను ఒక సమున్నత లక్ష్య సాధనలో సహచరులుగా చూడాలని వారు కోరారు. మరింత మెరుగైన ప్రజాస్వామ్యానికి, బహుత్వ వాద సంస్కృతికై జరుగుతున్న పోరాటంలో అంబేడ్కర్, గాంధీ మేధో కృషి, మానవతావాద కార్యాచరణల వారసత్వాలను సమ్మిళితం చేయవలసిన అవసరమున్నదని జమియా విద్యార్థులు, షాహీన్ బాగ్ మహిళలు మనకు విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ రచయిత ఒమైర్ అహ్మద్ ఇటీవల షాహీన్ బాగ్‌ను సందర్శించిన తరువాత ట్విటర్‌లో ఒక ఆసక్తికరమైన వ్యాఖ్య పోస్ట్ చేశారు. ఆ నిరసన ప్రదర్శనలలో గాంధీ చిత్రాల కంటే అంబేడ్కర్ చిత్రాలే ఎక్కువగా ప్రదర్శితమవడం పట్ల ఆయన ఇలా వ్యాఖ్యానించారు: 'తమకు స్వాతంత్ర్యం సాధించిన నాయకుడికి ధన్యవాదాలు తెలిపే సంప్రదాయం నుంచి, స్వేచ్ఛాయుత పౌరులుగా తమ సొంత హక్కుల గురించి నిశ్చితంగా మాట్లాడేందుకుఅవసరమైన రాజ్యాంగ ఉపకరణాలనిచ్చిన నాయకుకి ధన్యవాదాలు చెప్పే ఆనవాయితీకి ప్రజలు మారారు'. అహ్మద్ ట్వీట్‌కు నేనిలా ప్రతిస్పందించాను: 'మీతో నేను ఒక షరతుపై అంగీకరిస్తున్నాను. హిందూ–ముస్లిం సమైక్యతను పటిష్ఠం చేయడంలో గాంధీతో సరి సమానులైన నాయకులు మరెవ్వరూ లేరు (నెహ్రూ సైతం ఇందుకు మినహాయింపు కాదు). ఇది మరింత వివరంగా చర్చించాల్సిన విషయం. ఏమైనా అంబేడ్కర్, గాంధీలను సమష్టిగా ఆవాహన చేసుకోవడానికి ప్రయత్నించడం చాలా ముదావహమైన విషయం'. దేశ వ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టాని(సిఏఏ)కి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న నిరసనలు పలు విధాల ఉత్తేజపరుస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొనడం, ఆ నిరసనలకు మహిళలు నాయకత్వం వహించడం ఒక గాఢానుభూతిని కలిగిస్తున్నాయి. మహిళలను ప్రోత్సహించే విషయమై కూడా అంబేడ్కర్, గాంధీలను సమష్టిగా ప్రస్తావించడం సముచితంగా ఉంటుంది. జెండర్ సమానత్వానికి అంబేడ్కర్, ఎటువంటి మినహాయింపులు లేకుండా సంపూర్ణంగా నిబద్ధుడైన విశాల హృదయుడు. ఆ నిబద్ధత రాజ్యాంగ రచనలో నిండుగా ప్రతిబింబించింది. హిందూ మత చట్టాలను సంస్కరించేందుకు ఆయన సలిపిన రాజీలేని కృషి కూడా ఆ నిబద్ధతకు ఒక తిరుగులేని తార్కాణమే. గాంధీ తన వ్యక్తిగత జీవితంలో పితృస్వామ్య సంప్రదాయాలు, ఆచారాలనే పాటించినప్పటికీ ప్రజా జీవితంలో మాత్రం మహిళా సాధికారతకు పరిపూర్ణంగా కృషి చేశారు. 1925లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా సరోజినీ నాయుడు ఎన్నికవ్వడానికి గాంధీయే ప్రధాన కారకుడు. ఆ కాలంలో అమెరికా, బ్రిటన్ మొదలైన పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాలలోని ఏ ప్రధాన రాజకీయ పార్టీకీ ఒక మహిళ అధినేత్రి కావడమనేది పూర్తిగా అనూహ్య విషయం మరి.





'బోధించు, సంఘటితపరచు, ఉద్యమించు'అని అణగారిన భారతీయులకు అంబేడ్కర్ పిలుపునిచ్చారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా విద్యార్థులు, మహిళలు మొక్కవోని దీక్షతో నిర్వహిస్తున్న నిరసనలు పూర్తిగా అంబేడ్కర్ స్ఫూర్తిదాయక పిలుపునకు అనుగుణంగా వున్నాయి. హిందూ అధిక సంఖ్యాకవాద ధోరణులను నిలువరించి ప్రజాస్వామ్యాన్ని, బహుత్వ వాదాన్ని సంరక్షించుకోవడానికి జరుగుతోన్న చైతన్యశీల కృషిలో అంతర్మత సామరస్యం కోసం గాంధీ జీవితాంతం చేసిన పోరాటం ప్రతిధ్వనిస్తోంది.

హిందూత్వ శక్తులతో ఎదురవుతున్న ముప్పును ఎదుర్కోవడానికి అంబేడ్కర్, గాంధీలను సమష్టిగా ఆవాహన చేసుకోవాలని దేవనూర్ మహదేవ నొక్కి చెప్పారు. ఆయన ఇలా అన్నారు: "వారణాసికి చెందిన పదహారేళ్ళ బాలుడు ఒకరు అన్న మాటలను మనం విని తీరాలి'. 'గాడ్సే దేశంలో నేను గాంధీతో నిలబడతాను' అని ఆ చిరుప్రాయుడు అన్నాడు. అలా నిలబడనిపక్షంలో ఏ ఛాందసవాదమైనా సరే తొలుత మీ కళ్ళను పెరికి వేసి మిమ్ములను అంధులను చేస్తుంది. ఆ తరువాత మీ మెదడును చితగ్గొట్టి, హేతుయుక్తంగా ఆలోచించలేకుండా చేస్తుంది. పిదప మీ గుండెను పగుల గొట్టి మిమ్ములను రాక్షసుడిగా చేస్తుంది. అంతిమంగా ఒక త్యాగం చేయమని మిమ్ములను అడుగుతుంది. ఈ ధోరణి నేడు పెచ్చరిల్లి పోతోంది. మనం మన బిడ్డల నయనాలను, వారి హృదయాలను, వారి మస్తిష్కాలను ఛాందసవాద కోరల నుంచి తక్షణమే కాపాడుకోవాలి. ఇటువంటి చైతన్యశీలతను సంతరించుకోకపోతే దళితులకు మరింత మహా ముప్పు వాటిల్ల గలదని నేను ఆందోళన చెందుతున్నాను'.

అంబేడ్కర్ గానీ, గాంధీ గానీ మానవాతీతులు కారనడంలో సందేహమేమీ లేదు. ఇరువురూ మహా తప్పులు చేశారు. ఆ మహోన్నతులిరువురినీ యాంత్రికంగా ఆవాహన చేసుకోకూడదు; గుడ్డిగా అనుకరించకూడదు. వారు ఈ భూమిపై నడయాడిన కాలానికి సంపూర్ణంగా భిన్నమైన ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. 21 వ శతాబ్ది మూడో దశాబ్ది రాజకీయ, సాంకేతికతా సవాళ్ళు 20వ శతాబ్ది మధ్యనాళ్ళ రాజకీయ, సాంకేతికతా సవాళ్లకు పూర్తిగా భిన్నమైనవి. అప్పటికీ, ఇప్పటికీ నైతిక, సామాజిక సవాళ్ళు మాత్రం ఒకే విధంగా వున్నాయి. కుల నిర్మూలన, జెండర్ సమానత్వ పోరాటాలు ముగియలేదు. అంతర్మత సామరస్య సాధన అత్యావశ్యక, అతి ప్రధాన కర్తవ్యంగా మిగిలి పోయింది. సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న హిందూత్వ శక్తులను ఓడించేందుకు అంబేడ్కర్, గాంధీ ఒకే పక్షాన ఉండవలసిన అవసరమున్నది.

**న్యూఢిల్లీలో విద్యార్థుల నిరసనలలో అంబేడ్కర్, గాంధీ పోస్టర్లను కలిసికట్టుగా ప్రదర్శించడాన్ని చూసినప్పుడు దేవనూర్ మహదేవ మాటలను నేను గుర్తు చేసుకున్నాను. బాపు, బాబాసాహెబ్ చిత్రాలను పక్కపక్కనే ప్రదర్శించడం ఇదే మొదటిసారి కానప్పటికీ చాలా అరుదైన విషయం. గతంలో గాంధీ అభిమానులు, ఈ ఇరువురినీ పరస్పర ప్రత్యర్థులుగా చూసేవారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్న హిందూత్వ శక్తులను ఓడించేందుకు అంబేడ్కర్, గాంధీ ఒకే పక్షాన ఉండవలసిన అవసరమున్నది.**

*(వ్యాసకర్త చరిత్రకారుడు)*

# ప్రజాస్వామ్య పెన్నిధి పెద్దల సభ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనమండలిని రద్దు చేయాలని ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానించిన సమయానికి పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, ఒడిస్సా, అస్సాం, రాజస్థాన్ రాష్ట్రాల్లో శాసనమండలి పునరుద్ధరణకు కసరత్తు జరుగుతున్నది. రాష్ట్రాల్లో మండలి ఉండాలా? వద్దా? అనే విషయంలో దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండాలనే వాదనలు వినిపిస్తున్నాయి. రాష్ట్రాల్లో పెద్దల సభ ఆవశ్యకతపై దేశవ్యాప్తంగా మరోసారి విస్తృత చర్చ జరుగుతున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసన మండలిని రద్దు చేసిన తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు విభక్త ఆంధ్రప్రదేశ్‌లో మండలి ఉండాలని వాదిస్తున్నది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పునరుద్ధరించిన మండలి వ్యవస్థకు ఆయన వారసుడి నుంచి గండం ఎదురైంది. అటు ఎన్టీఆర్, ఇటు వైఎస్ వారసులిద్దరూ తమ నాయకుల ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించడం లేదు. ఆ మాటకొస్తే ఎన్టీఆర్, వైఎస్ కూడా మండలి రద్దు లేదా పునరుద్ధరణ నిర్ణయాలను రాజకీయ కోణంలోనే తీసుకున్నారు తప్ప రాజ్యాంగ స్ఫూర్తితోనో, విలువల ప్రాతిపదికగానో కాదు. కేవలం మన దగ్గరే కాదు, దేశంలోని అనేక రాష్ట్రాల్లో రాజకీయ అవసరాలకోసం 'మండలి'తో ఆడుకున్న ఉదంతాలు అనేకం ఉన్నాయి.

2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం మొదట్లో ఇప్పుడు జగన్ ఎదుర్కొంటున్న పరిస్థితినే ఎదుర్కొన్నది. లోక్‌సభలో అనేక బిల్లులు సునాయాసంగా పాస్ అయినప్పటికీ, రాజ్యసభలో మాత్రం ఎన్.డి.ఎ.కు మెజారిటీ లేనందువల్ల ఇబ్బందులు తప్పలేదు. అయినా ఓర్పుతో, నేర్పుతో వ్యవహరించారు తప్ప, రాజ్యసభ ఉనికిని ప్రశ్నించలేదు. రాజ్యాంగ సవరణ తెచ్చి రాజ్యసభ ఉసురు తీయలేదు.



అసలు ఈ దేశంలో పెద్దల సభలుగా పిలిచే రాజ్యసభ కానీ, రాష్ట్ర స్థాయిలో శాసనమండలి గానీ ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందో అసలు కారణం తెలిస్తే, రాజ్యాంగ నిర్మాతల ఉదశాలు బోధ పడితే ఈ పరిస్థితి ఉండేది కాదు.

రాజ్యసభ, శాసనమండలి ఏర్పాటు చేయాలనే ఆలోచనకు ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తాయి. ఒకటి.. లోక్ సభలో ఎక్కువ సీట్లు వచ్చిన రాజకీయ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో ఒక్క సీటు కూడా గెలవని పార్టీ కూడా అధికారంలోకి వచ్చే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల విషయాలను ప్రస్తావించడానికి అవకాశం రాకపోవచ్చు. అందుకే రాష్ట్రాల నుంచి ఖచ్చితంగా కొంత మంది ప్రతినిధులు పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించడానికి రాజ్యాంగం కల్పించిన వెసులు బాటు పెద్దల సభ. దీన్నే కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌గా కూడా పిలుస్తారు. ఇదే సూత్రం శాసన మండలికి కూడా వర్తిస్తుంది. ఒక జిల్లా నుంచి ఒక్క శాసనసభ సీటు కూడా గెలవని పార్టీ కూడా రాష్ట్రంలో అధికారంలోకి రావచ్చు. కొన్ని వర్గాలకు అసెంబ్లీలో అడుగు పెట్టే అవకాశం రాకపోవచ్చు. అలాంటి జిల్లాకు, అలాంటి వర్గాలకు చట్టసభల్లో జరిగే చర్చల్లో అవకాశం మండలి ద్వారానే ప్రాప్తిస్తుంది.

**పెద్దల సభ గౌరవాన్ని తగ్గించిన రాజకీయ పార్టీలే తిరిగి వారి అవసరం కోసం పెద్దల సభ అవసరమా? అని వాదిస్తున్నాయి. రాజ్యాంగ నిర్మాతలు ఏ ఉద్దేశ్యంతో పెద్దల సభ పెట్టారో గ్రహించి, ఆ స్ఫూర్తితోనే పెద్దల సభ నడపగలిగితే అవి నిరర్థకం కావు.**

ఇక పెద్దల సభ రెండో లక్ష్యం చాలా ఉన్నతమైనది. సాధారణ ఎన్నికల్లో పోటీని తట్టుకుని గెలవలేని వారుంటారు. కానీ అలాంటి వారి అవసరం ప్రభుత్వంలోనూ, పార్లమెంటులోనూ ఉంటుంది. వారికి అవకాశం కల్పించడానికి పెద్దల సభ వేదిక. అలాంటి పెద్ద మనుషులుంటారు కాబట్టే దాన్ని పెద్దల సభ అంటారు. ఇక మూడో కారణం.. లోక్‌సభ, శాసనసభల్లో భావావేశంలో ఏదైనా నిర్ణయం చేసినా పెద్దల సభలో ఉన్న నిష్ణాతులు, అనుభవజ్ఞులు మంచి చెడులు ఆలోచించి, మరోసారి సమీక్ష చేస్తారు. ఇలాంటి మహోన్నత లక్ష్యాలు పెద్దల సభకున్నాయి. ఏడు దశాబ్దాల పార్లమెంటరీ వ్యవస్థ అలాంటి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నది కూడా.

ఆర్థికంగా వెనుకబడి ఉన్నవాళ్ళు, రోజువారీ రాజకీయం చేయలేని వాళ్లు, సమున్నత లక్ష్యాల కోసం పనిచేసే వారు జనం వద్దకు వెళ్లి ఓట్లు సాధించలేకపోవచ్చు. అర్హులైన, అవసరమైన వారు చట్టసభలో అడుగుపెట్టలేరనే ఆందోళన కాకతాళీయంగా అంబేడ్కకర్‌కే ఎదురైంది. కానీ, అదే రాజ్యాంగం కల్పించిన వెసులు బాటు వల్ల ఆయన రాజ్యసభకు నామినేట్ అయి, కేంద్రంలో న్యాయశాఖ మంత్రి కాగలిగారు. అంబేడ్కరే కాదు, కేరళకు చెందిన కృష్ణన్ మీనన్, ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన మన్మోహన్ సింగ్, ఇండియన్ ఆర్మీలో కమాండర్‌గా పనిచేసిన జస్వంత్ సింగ్, ఇస్రోలో పనిచేసిన శాస్త్రవేత్తలు, సచిన్ లాంటి క్రీడాకారులు, లతా మంగేష్కర్ లాంటి గానకోకిలలు, సంఘసేవకులు చాలా మంది పెద్దల సభ ద్వారా పార్లమెంటులో, మండలిలో అడుగు పెట్టారు. కళలు, సాహిత్యం, సైన్స్, సామాజిక సేవా రంగాల్లో సేవలందించిన వారిని పెద్దల సభకు ఎంపిక చేసే సంప్రదాయం కూడా మన దేశంలో ఉంది. మన దగ్గర కూడా టంగుటూరి అంజయ్య, భవనం వెంకట్రామరెడ్డి, కొణిజేటి రోశయ్య లాంటి వాళ్లు మండలికి ఎంపిక కావడం ద్వారానే ముఖ్యమంత్రులు కాగలిగారు. రాష్ట్ర మండలిలో రాజ్యసభకు లేని మరో ప్రత్యేకత ఉంది. మండలిలో స్థానిక సంస్థలకు, ఉపాధ్యాయులకు, పట్ట భద్రులకు కూడా తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఉంది. దీని కారణంగానే తెలంగాణలో చుక్కా రామయ్య, ఎపిలో రాము సూర్యారావు లాంటి విద్యావేత్తలు ఎమ్మెల్సీలు కాగలిగారు. తెలంగాణ రాష్ట్రంలో చట్టసభల్లో అవకాశం రాని సామాజిక వర్గాలను మండలి ద్వారా చట్టసభకు పంపే సంప్రదాయం కేసీఆర్ అమలు చేస్తున్నారు. ఆయా రంగాల్లో నిష్ణాతులు, అనుభవజ్ఞులు చట్టసభలో ఉండడం వల్ల ఆయా రాష్ట్రాలకు, దేశానికి మేలు చేసే అంశం. ఇంతటి మహోన్నత లక్ష్యాలు కలిగిన పెద్దల సభలను నిర్వీర్యం చేసిందీ రాజకీయ పార్టీలే. పెద్దల సభకు ఎవరిని ఎంపిక చేయాలనే విచక్షణ లేకుండా కాంట్రాక్టర్లను, ఆయా పార్టీలకు ఆర్థికంగా ఉపయోగపడేవారిని, రాజకీయ అవసరానికి తగ్గట్టుగా పెద్దల సభకు సభ్యులను ఎంపిక చేస్తున్నారు. ఇలా పెద్దల సభ గౌరవాన్ని తగ్గించిన రాజకీయ పార్టీలే తిరిగి వారి అవసరం కోసం పెద్దల సభ అవసరమా? అని వాదిస్తున్నాయి. రాజ్యాంగ నిర్మాతలు ఏ ఉద్దేశ్యంతో పెద్దల సభ పెట్టారో గ్రహించి, ఆ స్ఫూర్తితోనే పెద్దల సభ నడపగలిగితే అవి నిరర్థకం కావు. మంచి విధానాల రూపకల్పనకు, ఉజ్వల భవిత నిర్మాణానికి ఉపయోగపడే అద్భుత వేదికలుగా పెద్దల సభలు భాసిల్లుతాయి. భారతదేశంతో పాటు ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా లాంటి దేశాలు నేర్పుతున్న పాఠం కూడా ఇదే.

– గటిక విజయ్ కుమార్

# దేశవ్యాప్త రైతు ఉద్యమంగా అమరావతి!

ఆవేశం తప్ప ఆలోచన లేదు. ఏది చేయాల్నో, ఏది చెయ్యకూడదో అన్న అంశాలపై స్పష్టత లేదు. ఎనిమిది నెలలుగా నిరంతరం నిరర్థక వివాదాలే. ప్రజలను బతికించాల్సిన అధికారం బలితీస్తున్నది. తాను అనుకున్నదే జరగాలన్న మంకుపట్టు పాలకుల్లో ప్రమాదకర స్థాయికి చేరింది. 2014 లో అమరావతి పై అభ్యంతరం చెప్పని వైసీపీ ఇప్పుడు దానిపై కత్తి దూసింది. అమరావతి రాజధాని నిర్మాణానికి ఆనాటి ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి అంగీకరించబట్టే , దయా ధర్మాలతో రైతులు ఇచ్చిన భూముల్లో నిర్మితమైన శాసనసభే అమరావతికి మరణ శాసనం విధించింది. అబద్ధాలు అభాండాలతో అమరావతిని అంతర్ధానం చెయ్యడానికి యత్నిస్తున్నారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ అన్నారు, అమరావతి వల్ల ఒక సామాజిక వర్గానికే మేలు అని ప్రచారం చేశారు. ఈ ప్రాంతం సురక్షితం కాదని, రాజధాని ముంపునకు గురి అవుతుందని ప్రకటనలు చేశారు. ఈ కారణంగా రాజధాని ఆపేయాలని కోరుతూ కొందరు కోర్టుకెక్కారు. పిటీషనర్లు లేవనెత్తిన ప్రతి అంశాన్ని పరిశీలించి దాఖలైన నాలుగు కేసులను కొట్టి వేస్తూ జస్టిస్ స్వతంత్రకుమార్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం 2017 నవంబర్ 17 వ తేదీన 145 పేజీల సుదీర్ఘ తీర్పు వెల్లడించింది. ఈ ప్రాంతం మునిగి పోయే అంత వరదలు ఎప్పుడు రాలేదని, 1853 లో చరిత్రలో ఎప్పుడూ లేనంత భారీ వరదలు వచ్చినప్పుడు కూడా కృష్ణానది ఈ ప్రాంతంలోకి పొంగి వచ్చిన దాఖలాలు లేవని జాతీయ హరిత ట్రిబ్యునల్ తన తీర్పులో చెప్పింది. రాజధానిగా అమరావతిని ఎంపికచేయడం శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులకు విరుద్ధమన్న వాదనలను కూడా తోసిపుచ్చింది. కొన్ని రోజులు మాత్రమే ప్రవహించే కొండవీటి వాగువల్ల ముంపేమీ ఉండదని వ్యాఖ్యానించింది.

రాజధాని ప్రాంతం సంపన్నమైన వ్యవసాయ క్షేత్రం అన్న వాదనలతోనూ ట్రిబ్యునల్ అంగీకరించలేదు. రాష్ట్రంలో వున్న మొత్తం సాగు భూమితో చూస్తే అక్కడవున్న వ్యవసాయ భూమి కేవలం 0.027శాతమేనని, అక్కడ సాగు అవుతున్న వరి 0.077 శాతం మాత్రమే నని పేర్కొన్నది. రైతులనుండి బలవంతంగా భూములు గుంజుకుంటున్నారన్న పిటీషనర్ల వాదనలో పసలేదని చెప్పింది. పర్యావరణ ప్రభావ మదింపు సమయంలో బహిరంగ విచారణ జరగలేదన్న వాదనను ట్రిబ్యునల్ తోసిపుచ్చినది. ప్రభుత్వం రాజధాని మాస్టర్ ప్లాన్‌ను బహిర్గతం చేసి అన్ని వర్గాల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరించిన తరువాతనే తర్వాతనే నోటిఫై చేసినట్లు గుర్తు చేసింది. అమరావతి కొత్త రాష్ట్రానికి కేంద్రస్థానంలో ఉందని వెల్లడించింది. వరదముంపునకు ఎలాంటి ఆధారాలు లేవని, వి.వి. శ్రీనివాస్, కె. రవి, డి. కాశీ విశ్వేశ్వర్రావు కమిటీ స్పష్టం చేసింది. కానీ, ఉత్తుత్తి నివేదికల పేరు చెబుతూ అమరావతిని తరలించేందుకు ప్రభుత్వం ముందుకెళుతుంది. అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి అనుకూలంకాదని, అది ముంపు ప్రాంతమని మద్రాస్ ఐ.ఐ.టి నివేదిక ఇచ్చినట్లు బీసీజి నివేదికలో వెల్లడించారు. నిజమేనేమో అనుకున్నారు అందరూ. కానీ, అలాంటి నివేదికే ఇవ్వలేదని, అభిప్రాయాలు కూడా చెప్పలేదని ఆ విద్యాలయం తేల్చి చెప్పింది. రాజధానిని విశాఖలో పెట్టాలని జీఎన్ రావు కమిటీ నివేదిక ఇచ్చింది అని ప్రచారం చేశారు. కానీ, పరిపాలనా రాజధానిగా విశాఖపట్నం వద్దేవద్దని జీఎన్ రావు కమిటీ చెప్పింది. తుఫాన్ల ముప్పు ఉంది, అందుకే సముద్ర తీరానికి 50 కిలోమీటర్ల దూరంగా రాజధాని పెట్టాలని సూచించామని జీఎన్ రావు స్వయంగా చెప్పారు. కానీ, విశాఖ కేంద్రంగానే కీలక కార్యాలయాల కోసం తీరం వెంబడి ఉన్న భవనాలనే ఎంపిక చేస్తున్నారు. దీనిని బట్టి ప్రభుత్వం వేసిన కమిటీలు వెల్లడిస్తున్న నివేదికల్లో కూడా వాస్తవాలు ఎంతో ప్రజలే అర్థం చేసుకోవాలి. విచక్షణ కోల్పోయి విద్వేషంతో వ్యవహరిస్తే అది వినాశనానికి దారి తీస్తుందన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. విశాలమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, ఆనంద దాయకమైన రాజధాని అవసరమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి. ఏ రాష్ట్రానికైనా రాజధానే గుండెకాయ. కాబట్టి, అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ ప్రణాళికలతోనే భావితరాల అవసరాలు తీర్చేలా ప్రభుత్వం ముందడుగు వేయాలి. రాజధాని అంటే ఒక్క పాలనా కేంద్రమే కాదు. ఆర్థిక సముపార్జనకు, సేవారంగానికి, ఉపాధి అవకాశాలకు నిలయంగా వుండాలి. కడుతున్నది రాజధానే కాదు, జాతినిర్మాణం, సాంస్కృతిక పునర్జీవంతో ఏపీ వైభవాన్ని తెలిపే అంశాలన్నీ అమరావతి తనలో ఇముడ్చుకొనున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే అమరావతి ఆంధ్రప్రదేశ్ కి ప్రాణ వాయువు అవుతుంది. విశాలమైన అమరావతి రాజధాని నిర్మాణం ఎందుకంటే భవిష్యత్ అవసరాలు, ఎదురయ్యే సవాళ్లే రాజధానికి పునాదులు. ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, వంటి అనేక నగరాలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితుల ఏపీ అమరావతి ఎదుర్కొన కూడదన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం దూరదృష్టితో నగర నిర్మాణానికి ప్రణాళికలు వేసింది. ఇప్పుడు 12లక్షలున్న జనాభా కోటికి పెరిగినా ఇబ్బందుల్లేని విధంగా ప్రపంచానికి నమూనాగా నిలవనున్నది. భారత్‌లో నగరాలు ఎదుర్కొంటున్న మరో పెను ముప్పు కాలుష్యం. గ్రీన్ జోన్ లేకపోవడం, గ్రీన్ పాలసీ జోలికి వెళ్లకపోవడం, వాహనాలు పెరిగి గాలి కాలుష్యం పెరగిపోవడం, డ్రైనేజీ లాంటి కనీస వ్యవస్థలు లేకపోవడం తో నీరు, భూమి కలుషితం అవుతున్నాయి. పరిశ్రమ లెక్కడ, జనావాసాలెక్కడ అనే స్పష్టత ఇప్పటికీ కనిపించని దేశ నగరాలు అవస్థలకి ఆనవాళ్ళుగా నిలిచాయి. ఉదాహరణకి హైదారాబాద్‌లో ఎప్పుడో నిజాం కాలం నాటి అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ కొత్తగా పెరిగిన వలసల భారాన్ని తట్టుకోలేక పోతుంది. మౌలిక సౌకర్యాలు కల్పించలేక పోవడంతో నగర జీవనం అత్యంత దుర్భరంగా మారింది.



ఈ నేపథ్యంలో వైశాల్యాన్ని బట్టి చూసినా, ప్లానింగ్ ప్రకారం చూసినా ఇండియాలో మహానగర నిర్మాణానికి పునాది కానున్నది అమరావతి ఒక్కటే. నేటి అవసరాలు, రేపటి మార్పులను తట్టుకొంటూ భవిష్యత్ నగరాన్ని ఎలా నిర్మించాలో చూపించనున్నది అమరావతి. అన్ని అవసరాలు ఒకే చోట తీరే విధంగా తొమ్మిది సిటీల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. ఇండియాలో ఇప్పటి వరకు ఇలాంటి మోడల్ ప్లానింగ్ లేదు. పార్కింగ్, డ్రైనేజీ వంటి సమస్యలు రాకుండా అమరావతి నిర్మాణ ప్లానింగ్ చేశారు. బతుకు దెరువు కోసం పక్క రాష్ట్రాలకు, విదేశాలకు వెళ్లడమే ఇప్పటి వరకు మనకు తెలిసింది. ఇక ఆ అవసరం లేకుండా మన ముందు తరాలకు వర్క్ ప్లేస్‌గా మారనుంది అమరావతి. పాలనే కాదు, ఆలన కూడా వుండబోతుంది. హైదారాబాద్ లో మూడో నగరం సైబరాబాద్ పుట్టుకొచ్చాకనే నగర ఆదాయం ఒక్క సారిగా ఆర్థిక సామర్థ్యం అమాంతం పెరిగింది. ఐటీ ఎగుమతుల్లో ముందడుగు వేసింది. అమరావతిలో ఇలాంటి వ్యూహం మొదటి ఇటుక నుండే సిద్ధం చేశారు. అందుకే అమరావతి అపూర్వం కానుంది.

చంద్రబాబు తలపెట్టారన్న ద్వేషంతో అమరావతిని చంపేయ వద్దు. చంద్రబాబు కోసం అమరావతి కాదు, అయిదు కోట్ల ఆంధ్రుల భవితకోసమే అమరావతి. ఆంధ్రప్రదేశ్ ఆయువు అమరావతే. ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా, ఉజ్వలమైన, విభిన్న మైన, సమ్మిళితమైన, అధునాతన నగరంగా రాజధాని వుండాలన్న ప్రణాళికతో చేపట్టిన నవ్యాంధ్ర రాజధాని అమరావతి భారతదేశ తూర్పు ముఖ ద్వారం కానుంది. అమరావతి పేరు వింటేనే తెలుగుజాతి గుండె సగర్వంగా ఉప్పొంగుతుంది. అమరావతిని అర్థం చేసుకొని ప్రభుత్వం వద్ద చిల్లిగవ్వ లేని పరిస్థితుల్లో రైతులు వారి ప్రాణంతో సమానమైన భూములను రాజధాని నిర్మాణానికి ఈ పద్ధతిలో ఇవ్వడం దేశంలోనే ఓంప్రథమం. భూ సమీకరణ విధానంలో 28 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు ప్రభుత్వానికి అప్పగించారు. రాజధానిని మరో ప్రాంతానికి తరలిస్తే ఇలా భూములు ఇచ్చిన రైతులు 'మా పరిస్థితి ఏమిట'ని ఆందోళన చెందుతున్నారు. రూ 39 వేల కోట్ల విలువ చేసే పనులు మొదలు అయ్యాయి. రాజధానిని మరొక చోటికి మార్చడం వల్ల ఇప్పటి వరకు చేసిన వ్యయం అంతా వృధా అవుతుంది, చేసిన నిర్మాణాలన్నీ వ్యర్థం అవుతాయి.ప్రభుత్వం విచక్షణ కోల్పోయి విద్వేషంతో వ్యవహరించడం మంచిది కాదు. గత ప్రభుత్వం పై వున్నద్వేషాన్ని ప్రజలపై ప్రదర్శించడం మంచిది కాదు. ఆ భూముల, నిర్మాణం విషయంలో ఏదైనా అవకతవకలు, అవినీతి జరిగితే వాటి నిగ్గుతేల్చండి, దోషులను శిక్షించండి. అంతకానీ, ఎలుకల కోసం ఇల్లు తగులబెట్టుకున్న చందంగా చేసి, రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టవద్దు. కాబట్టి అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రజారాజధానిని నిర్మించడానికి ఈ ప్రభుత్వంకూడా నడుం బిగించాలి. అంతర్జాతీయ యవనికపై అమరావతి విజయ పతాక ఎగర వేస్తుందని అయిదు కోట్ల ఆంధ్రులు విశ్వసించారు. వారి నమ్మ కాన్ని వమ్ముకానివ్వ వద్దు.

రాజధానిని విశాఖకు తరలించాలన్న ప్రభుత్వం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 29 గ్రామాల ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. 45రోజులుగా పిల్లాపాపలతో సహా కుటుంబాలన్నీ రోడ్లపైకి వచ్చి తీవ్ర ఆందోళన చేస్తున్నారు. రాజధానికి భూములిచ్చిన ఈ రైతులకు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక నుంచి రైతులు సంఘీభావం తెలుపుతున్నారు. తెలంగాణ నుంచి నల్గొండ జిల్లా రైతులు పెద్దఎత్తున తరలివచ్చి తమ మద్దతు తెలిపారు. ఇలా రైతులంతా సంఘటితమవుతూండడం చూస్తుంటే ఈ ఆందోళన దేశవ్యాప్త ఆందోళనగా మారే అవకాశముందని స్పష్టమవుతున్నది. నాగజెముడు వలే నవ్యాంధ్ర ను నాశనం చేస్తున్నది వైసీపీ ప్రభుత్వం. జగన్ సంకుచిత రాజకీయ పైత్యం రాష్ట్రాభివృద్ధికి శరాఘాతంగా మారింది. రాష్ట్ర విభజనతో నవ్యాంధ్ర ప్రజలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న పరిస్థితుల్లో రాజధానిని మార్చి మరోసారి వికృత ప్రయోగం చేయడం మంచిది కాదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్ తన ఆలోచనా ధోరణిని విరమించుకోవాలి.

**నాగజెముడు వలే నవ్యాంధ్రను నాశనం చేస్తున్నది వైసీపీ ప్రభుత్వం. జగన్ సంకుచిత రాజకీయ పైత్యం రాష్ట్రాభివృద్ధికి శరాఘాతంగా మారింది. రాష్ట్ర విభజనతో నవ్యాంధ్ర ప్రజలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న పరిస్థితుల్లో రాజధానిని మార్చి మరోసారి వికృత ప్రయోగం చేయడం మంచిది కాదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్ తన ఆలోచనా ధోరణిని విరమించుకోవాలి.**

■ నెల్లూరు దుర్గాప్రసాద్
తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి

epaper.andhrajyothy.com

మహాజాతర




# భక్తజన గుడారం!

**మహాజాతర కోసం మేడారం ముస్తాబయ్యింది. ఇప్పటికే లక్షలాది మంది భక్తులు ముందస్తు మొక్కులు తీర్చుకుంటున్నారు. సమ్మక్క, సారలమ్మలు వనం వదిలి జనంలోకి అడుగిడే మహాఘట్టాలను తిలకించేందుకోసం అంతా ఆతురుతగా ఉన్నారు. గద్దెలనెక్కిన తల్లులు భక్తకోటిని ఆశీర్వదిస్తున్న వేళ ఉప్పొంగిన భక్తిపారవశ్యంతో మేడారం నలుమూలలు శిగమూగుతాయి. జాతరకు నెల రోజుల ముందు నుంచే భక్తులు వస్తున్నా... ప్రధానంగా నాలుగు రోజులపాటు జరిగే జాతరలో క్షణక్షణం భక్తిమయమై రోజుకో మహాఘట్టం ఆవిష్కృతమవుతుంది. ఆ అడవిపల్లె భక్తిశిఖరంపై దేదీప్యమానంగా వెలిగిపోతుంది. 'అసలు జాతరలో ఆ నాలుగు రోజులు ఏం జరుగుతుంది' అనే ఆసక్తి సహజంగానే చాలామందికి ఉంటుంది. మేడారంలో నాలుగురోజుల మహాఘట్టం ఎలా ఉంటుందంటే...**

### తొలి రోజు (ఫిబ్రవరి 5)

కన్నెపల్లి వెన్నెల సారలమ్మ గద్దెలకు వచ్చే రోజిది. ఇదే రోజున పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజులు గద్దెలకు వస్తారు. కన్నెపల్లిలోని ఆలయం నుంచి సారలమ్మ ప్రతిరూపాన్ని ప్రధాన పూజారి కాక సారయ్య గద్దెకు చేర్చుతాడు. ఉదయం నుంచే అటు కన్నెపల్లిలో, ఇటు మేడారంలో సందడి నెలకొంటుంది. ప్రతీ గడపా అలుకుపూతలు, మామిడి తోరణాలతో సారలమ్మకు స్వాగతం పలుకుతుంది. సాయంత్రం సూర్యాస్తమయం జరుగుతుండగా సారలమ్మను గద్దెకు తీసుకువచ్చే ఘట్టం ప్రారంభమవుతుంది. ఆలయంలో ప్రత్యేక పూజల సమయంలో తల్లి ఆవహించిన వెంటనే సారయ్యతోపాటు పూజారులు 4 కిలోమీటర్ల దూరంలోని మేడారానికి బయలుదేరుతారు. వీరికి భారీ పోలీసు బందోబస్తు కల్పిస్తారు. తల్లి ఆశీస్సుల కోసం తడిబట్టలతో భక్తులు ఆలయం బయట సాగిలపడుతారు. సంతానం కోసం వరంపడుతారు. వారిపై నుంచి తల్లిరూపాన్ని తీసుకొని పూజారులు మేడారానికి పరుగులు తీస్తారు. తల్లికి కన్నెపల్లిలోని ప్రతీ ఆడబిడ్డ నీళ్లారబోసి పూజలు చేస్తుంది. వడ్డెలు(పూజారులు) జంపన్నవాగును దాటుతూ మేడారానికి చేరుకుంటారు. భక్తులు, శివసత్తులు, కోయ కళాకారులు నృత్యాలు చేస్తూ ముందు నడుస్తారు. సారలమ్మ ప్రతిరూపాన్ని గద్దెపై ప్రతిష్ఠించడంతో జాతర ప్రారంభమవుతుంది. అప్పటికే పగిడిద్దరాజు, గోవిందరాజుల ప్రతిరూపాలైన పడిగెలు గద్దెలపైకి చేరుకుంటాయి. ఈ ముగ్గురు దైవాలు తల్లి సమ్మక్క రాక కోసం ఎదురుచూస్తారు.

### రెండో రోజు (ఫిబ్రవరి 6)

మేడారం జాతర మొత్తానికి అపూర్వఘట్టం ఇదే రోజున ఆవిష్కృతమవుతుంది. చిలుకలగట్టుపై ఉన్న సమ్మక్క గద్దెకు వచ్చేది ఈరోజే. ఉదయమే పూజారులు గద్దెను వనంతో(వెదురు) కొలుస్తారు. అడేరాలు, పసిడికుండలు తెచ్చి గద్దెలపై నిలుపుతారు. సాయంత్రం తల్లిరూపమైన కుంకుమభరిణెను తెచ్చేందుకు చిలుకలగట్టుకు బయలుదేరుతారు. గట్టుపైగల రహస్యప్రదేశంలోని నెమలినార చెట్టువద్దగల కుంకుమ భరిణెను తెచ్చేక్రమంలో పూజారులు ప్రత్యేకపూజలు చేస్తారు. ఈ సమయంలో మేడారమంతా సమ్మక్క నామస్మరణే. చిలుకలగట్టు దారి ఇసుకపోస్తే రాలనంత జనంతో నిండిపోతుంది. అందరిచూపూ తల్లికోసమే తండ్లాడుతుంది. ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్యతోపాటు మిగతా పూజారులు సమ్మక్కను తీసుకొని గట్టు దిగుతుండగా జిల్లా ఎస్పీ ఏకే-47 తుపాకీతో గాల్లోకి నాలుగురౌండ్లు కాల్పులు జరిపి గౌరవవందనం సమర్పిస్తారు. అంతే ఈ శబ్దం వినగానే జై సమ్మక్కా... అనే నినాదాలతో మేడారం పరిసరాలు మార్మోగుతాయి. భారీ పోలీసు బందోబస్తు



మధ్య సమ్మక్క రూపాన్ని పూజారులు గద్దెపై ప్రతిష్ఠిస్తారు. ఈక్రమంలో పూజారులను తాకితే పాపాలన్నీ హరించుకుపోతాయని భావించే భక్తులను నిలువరించడం పోలీసులకు కష్టంగా మారుతుంది. సమ్మక్క వస్తున్న తరుణంలో భక్తులు భారీగా జంతుబలులిస్తారు. ఎదురుకోళ్లతో స్వాగతం పలుకుతారు.

### మూడో రోజు (ఫిబ్రవరి 7)

మూడో రోజు మొక్కులకు ప్రత్యేకం. తల్లీబిడ్డలిద్దరూ గద్దెలపై ఉన్న ఆరోజున అశేష భక్తులు గద్దెలను దర్శించుకుంటారు. ఎత్తుబెల్లం, పసుపుకుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. కానుకలు చెల్లించి కరుణించమని వేడుకుంటారు. అర్ధరాత్రి మొదలైన మొక్కుల జోరు ఆరోజంతా కొనసాగుతాయి. జాతర మొత్తంలో ఈ రోజుకోసం ఎదురుచూసే భక్తులు తల్లులకు మొక్కులు ముట్టజెప్పి తిరుగు ప్రయాణం అవుతారు.

### నాలుగో రోజు (ఫిబ్రవరి 8)

భక్తకోటి పూజలందుకొని ఆశీర్వదించిన దైవాలు మరో రెండేళ్ల నిరీక్షణను మిగుల్చుతూ వనప్రవేశం చేస్తారు. దేవతా రూపాలను పూజారులు సాయంత్రం వేళ వారివారి స్థావరాలకు చేర్చడంతో జాతర ముగుస్తుంది. '.పోయొస్తాం సమ్మక్కా.. రెండేళ్లకు మళ్లొస్తాం'.. అంటూ భక్తులు మూటముల్లె సర్దుకొని గుండెలనిండా మధురానుభూతులను నింపుకొని భారంగా ఇంటికి పయనమవుతారు. అప్పటివరకు జనారణ్యమైన మేడారం క్రమంగా పలచబడిపోయి నిర్మాణుష్యంగా మారుతుంది.

● **దూడబోయిన రాకేశ్,** ములుగు
ఫొటోలు: **వీరగోని హరీశ్**

# చిలుకా... క్షేమమా?



వైరల్

'చిలుకా క్షేమమా..' అని మెగాస్టార్ చిరంజీవి ఆడిపాడిన మెలోడియస్ సాంగ్ అప్పట్లో పెద్ద హిట్. అయితే ఆయన అన్నది హీరోయిన్‌ను ఉద్దేశించి అయితే, ఇప్పుడు మాత్రం రామచిలుకల విషయంలో 'చిలుకా క్షేమమా?' అనాల్సివస్తోంది. ఎందుకంటే చిలుకలు కనిపించడం తగ్గిపోయి చాలా కాలమైంది. ఒకటీ రెండూ ఉన్నప్పటికీ అవి కాస్త చిలకజోస్యం కోసం పంజరాల్లో చిక్కుకుని కనిపిస్తున్నాయి. అందుకే ప్రస్తుతం 'చిలుక క్షేమం కాదు' అంటున్నారు మెగాస్టార్ కోడలు, హీరో రామ్‌చరణ్ భార్య ఉపాసన కొణిదెల.

'చిట్టీ చిలుకమ్మా.. తోటకెళ్లావా..' అని చిన్నప్పుడు పాడుకున్న పాట మనందరికీ గుర్తుండే ఉంటుంది. 'ఆకుపచ్చ రంగులో, ఎర్రటి ముక్కుతో గుంపులు గుంపులుగా విహరించే రామ చిలుకలను చూసి చాలా రోజులైంది' అనుకోవడమూ వినే ఉంటారు. 'బాధ్యతగా స్పందించకపోతే ఇక మీదట రామచిలుకలను చూడడం కూడా అరుదైపోతుంది' అని హెచ్చరిస్తున్నారు ఉపాసన.

ఆరోగ్యం, పర్యావరణం, జీవవైవిధ్య సంరక్షణ లాంటి అంశాల్లో ఉపాసనతో పాటు ఆమె భర్త రామ్‌చరణ్ కూడా గతంలో సామాజిక బాధ్యతతో స్పందించిన ఘటనలు చూశాం. ఈమధ్య రామ్‌చరణ్ తీసిన వైల్డ్ ఫొటోగ్రఫీతో ఒక ఎగ్జిబిషన్ కూడా ఏర్పాటుచేశారు. ఆ కోవలోనే ఇప్పుడు రామచిలుకల సంరక్షణ గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పెట్టిన తాజా పోస్ట్ వైరల్ అయింది. రామచిలుకతో తను దిగిన ఫొటోతో పాటు ఆ పోస్ట్‌లో 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పక్షి రామచిలుక, రాష్ట్ర జంతువు క్రిష్ణ జింక అనే విషయం మీకు తెలుసా?. రామచిలుకలను బంధించడం నేరం. ఆరేళ్లవరకూ జైలు శిక్ష పడొచ్చు. రామచిలుకలు స్వేచ్ఛగా ఎగరాలి గానీ పంజరంలో బందీలు కాకూడదు. మన తలరాతను చెప్పడానికీ, మనకు వినోదం పంచడానికి కాదు అవి ఉన్నది' అని ఫాలోవర్లకు సందేశమిచ్చారు. 'అటవీ జంతువుల సంరక్షణలో భాగంగా మీ వంతుగా పంజరాల నుంచి రామ చిలుకలను విడిపించండి, లేదా ఫిర్యాదు చేయండి' అని నెటిజన్లను ఆమె కోరారు. సామాజిక మాధ్యమాల్లో ఉపాసన పోస్ట్‌కు మంచి స్పందన వస్తోంది.

# సత్వర శక్తికి బెల్లం బెస్ట్!

గుడ్‌ఫుడ్

తీపి కోసం చక్కెరకు ప్రత్యామ్నాయంగా బెల్లం వాడుతాం. ఆరోగ్య గుణాలు మెండుగా ఉండే బెల్లం సత్వరమే శక్తి ఇవ్వడమే కాదు శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది. బెల్లం తినడం వల్ల కలిగే ప్రయోజనాలివి...



- బెల్లం జీర్ణాశయంలోని ఎంజైమ్‌లను ఉత్తేజం చేసి జీర్ణక్రియ సాఫీగా జరిగేలా చూస్తుంది.
- కాలేయంలోని విషపదార్థాలను తొలగిస్తుంది. ఒంట్లోని మలినాలను బయటకు పంపుతుంది. సత్వర శక్తినిస్తుంది.
- దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు, జింక్, సెలీనియం వంటి లవణాలు ఫ్రీరాడికల్స్‌ను బయటకు పంపుతాయి.
- మహిళలు రోజూ కొద్దిగా బెల్లం తింటే నెలసరి సమయంలో వచ్చే పొత్తికడుపులో నొప్పి, పోస్ట్ మోనోపాజ్ లక్షణాలు తగ్గిపోతాయి.
- బెల్లంలో అధిక మోతాదులో ఉండే ఐరన్, ఫోలిక్ ఆమ్లం రక్తహీనత సమస్యను తగ్గిస్తాయి. ముఖ్యంగా గర్భిణులకు బెల్లం అన్ని విధాలా మేలు చేస్తుంది.
- వేడినీళ్లలో బెల్లం వేసుకొని తాగితే ఈ సీజన్‌లో తరచుగా వేధించే జలుబు, తగ్గు నుంచి ఉపశమనం లభిస్తుంది. చలికాలంలో బెల్లం తింటే ఒళ్లు వెచ్చగా ఉంటుంది.

వంటిల్లు

# అదిరింది రొయ్య

**రొయ్యల రుచికి ఫిదా కాని వారుండరు. రొయ్యలు వేడి చేస్తాయని తరచుగా తినకపోయినా, 'రొయ్యల కూర' అని చెప్పగానే నోరూరడం ఖాయం. వాటితో కూర చేసినా, వేపుడు చేసినా రుచికరంగా ఉంటుంది. వెరైటీలను ఇష్టపడేవారు రొయ్యలతో పులావ్, గోంగూర కాంబినేషన్‌లో కూడా కర్రీ చేసుకోవచ్చు. రెగ్యులర్ మటన్, చికెన్ కాసేపు పక్కనపెట్టి రొయ్యల రెసిపీలు చేస్తే అదిరింది'రొయ్య' అనకుండా ఉండలేరు. ఆలస్యమెందుకు ఈ వీకెండ్‌లో వంటింట్లో మీరూ ప్రయత్నించండి.**



## రొయ్యల పులావ్

**కావలసినవి**

రొయ్యలు - పావుకేజీ, ఉప్పు - తగినంత, పసుపు- రెండు టీస్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్టు - ఒక టేబుల్‌స్పూన్, కారం - అర టీస్పూన్, నూనె - సరిపడా.

**మసాల కోసం**

నూనె - రెండు టేబుల్‌స్పూన్లు, యాలకులు - నాలుగైదు, దాల్చిన చెక్క - చిన్నముక్క, లవంగాలు - పది, ఉల్లిపాయలు - రెండు, పచ్చిమిర్చి - మూడు, అల్లంవెల్లుల్లి పేస్టు - రెండు టేబుల్‌స్పూన్లు, పసుపు - అర టీస్పూన్, ధనియాల పొడి - ఒక టీస్పూన్, టొమాటో - నాలుగు, కొబ్బరి తురుము - ఒక కప్పు, నిమ్మకాయ - ఒకటి, పుదీనా - చిన్న కట్ట, కొత్తిమీర - గార్నిష్ కోసం కొద్దిగా, ఉప్పు - తగినంత, ప్రాన్ స్టాక్ - ఆరు కప్పులు, బియ్యం - నాలుగు కప్పులు.

**తయారీ**

- రొయ్యలను శుభ్రంగా కడిగి కారం, ఉప్పు, అల్లంవెల్లుల్లిపేస్టు పట్టించి పక్కన పెట్టాలి.
- పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు వేసి వేగించాలి.
- తరువాత ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేయాలి.
- అల్లం వెల్లుల్లి పేస్టు వేసి మరికాసేపు వేగించాలి. ధనియాల పొడి, పసుపు వేసి కలియబెట్టాలి.
- టొమాటో ముక్కలు వేసి కొద్దిగా నీళ్లు పోసి ఉడికించాలి.
- ఇప్పుడు కొబ్బరి తురుము వేసి మరికాసేపు ఉడకనివ్వాలి.
- నానబెట్టిన బియ్యం వేసి కలపాలి. ప్రాన్ స్టాక్ వేసి ఉడికించాలి.
- అన్నం 80 శాతం ఉడికిన తరువాత మసాలా పట్టించిన రొయ్యలు వేసి నెమ్మదిగా కలపాలి.
- కొద్దిగా నిమ్మరసం పిండాలి. పుదీనా వేయాలి. మరో ఐదు నిమిషాలపాటు ఉడకనివ్వాలి.
- కొత్తిమీరతో గార్నిష్ చేసి దించుకోవాలి.



## రొయ్యల కూర

**కావలసినవి**

రొయ్యలు - అరకేజీ, నూనె - సరిపడా, టొమాటోలు - రెండు, ఉల్లిపాయ - ఒకటి, పచ్చిమిర్చి - నాలుగు, ఉప్పు - తగినంత, కొబ్బరి తురుము - రెండు టేబుల్‌స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు - నాలుగైదు, ధనియాలు - రెండు టేబుల్‌స్పూన్లు, పసుపు - ఒక టీస్పూన్, ఎండు మిర్చి - పది, చింతపండు - కొద్దిగా.

**తయారీ**

- కొబ్బరితురుము, వెల్లుల్లిరెబ్బలు, ధనియాలు, ఎండుమిర్చిని మిక్సీలో వేసి మసాలా పేస్టు తయారుచేసుకోవాలి.
- పాన్‌లో నూనె వేసి ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి వేగించాలి.
- తరువాత మసాలా పేస్టు వేసి చిన్నమంటపై ఐదు నిమిషాలు వేగించాలి.
- ఇప్పుడు రొయ్యలు వేసి కలపాలి.
- కొద్దిగా నీళ్లు పోసి ఉడికించి టొమాటో ముక్కలు, ఉప్పు వేయాలి.
- చిన్నమంటపై పదినిమిషాలు ఉడికించాలి.
- కొద్దిగా చింతపండు రసం పోసి మరికాసేపు ఉంచి దించాలి.
- అన్నంలోకి ఈ రొయ్యల కూర రుచిగా ఉంటుంది.

## రొయ్యల వేపుడు

**కావలసినవి**

రొయ్యలు - 200గ్రాములు, నిమ్మరసం - రెండు టీస్పూన్లు, నూనె - సరిపడా, అల్లం వెల్లుల్లి పేస్టు - ఒకటిన్నర టీస్పూన్, ఉప్పు - తగినంత, కారం - అర టీస్పూన్, గరంమసాలా - అర టీస్పూన్, ధనియాల పొడి - అర టీస్పూన్, యాలకులు - రెండు, జీలకర్ర - అర టీస్పూన్, ఉల్లిపాయ - ఒకటి, పచ్చిమిర్చి - రెండు, కరివేపాకు - కొద్దిగా, కొబ్బరి తురుము - ఒక టేబుల్‌స్పూన్.

**తయారీ**

- రొయ్యలను శుభ్రంగా కడిగి అందులో అల్లంవెల్లుల్లి పేస్టు, కారం, గరంమసాలా, ధనియాల పొడి, నిమ్మరసం, తగినంత ఉప్పు వేసి కలిపి పక్కన పెట్టుకోవాలి.



- పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక జీలకర్ర, యాలకులు వేసి వేగించాలి.
- తరువాత ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేయాలి. మరికాసేపు వేగనివ్వాలి.
- ఇప్పుడు మసాలా పట్టించి పెట్టుకున్న రొయ్యలు వేసి కలపాలి. కాసేపు వేగిన తరువాత కొబ్బరి తురుము వేయాలి.
- కరివేపాకు వేసి చిన్న మంటపై ఉడికించుకోవాలి.
- వేడి వేడిగా అన్నంతో పాటు సర్వ్ చేసుకోవాలి.

## గోంగూర రొయ్యల కర్రీ

**కావలసినవి**

రొయ్యలు - అరకేజీ, గోంగూర - రెండు కట్టలు, పచ్చిమిర్చి - ఆరు, పసుపు - చిటికెడు, ఉల్లిపాయ - ఒకటి, ఆవాలు - అర టీస్పూన్, నూనె - సరిపడా, అల్లంవెల్లుల్లి పేస్టు - ఒక స్పూన్, ధనియాల పొడి - ఒక టీస్పూన్, జీలకర్రపొడి - అర టీస్పూన్, గరం మసాలా - అర టీస్పూన్, ఉప్పు - రుచికి తగినంత.

**తయారీ**

- పాన్ తీసుకొని కాస్త నూనె వేసి, వేడి అయ్యాక పచ్చి మిర్చి, గోంగూర ఆకులు వేసి ఉడికించాలి
- గోంగూర ఉడికిన తరువాత తీసి పక్కన పెట్టుకోవాలి. బాగా మెత్తగా కావాలనుకుంటే మిక్సీలో వేసి పేస్టులా చేసుకోవచ్చు.
- తరువాత అదే పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక ఆవాలు, ఉల్లిపాయ వేసి వేగించాలి.
- ఉల్లిపాయలు వేగాక పసుపు, అల్లం వెల్లుల్లి పేస్టు వేయాలి. ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు వేయాలి.
- ఇప్పుడు శుభ్రం చేసి పెట్టుకున్న రొయ్యలు వేసి కలిపి మరికాసేపు వేగనివ్వాలి.
- చివరగా గోంగూర పేస్టు వేసి కలపాలి. మరికాసేపు ఉడికించి దించాలి.
- అన్నంతో లేదా చపాతీతో గోంగూర రొయ్యల కూర తింటే రుచిగా ఉంటుంది. .



ఆంధ్రజ్యోతి నవ్య యంగ్



టెక్ గురు

# సేఫ్టీ హై క్యాబ్!

**మొబైల్ తీస్తారు.. క్యాబ్ బుక్ చేస్తారు... రాగానే ఎక్కి కూర్చుంటారు. కానీ క్యాబ్‌లో జర్నీ సేఫ్‌గా ముగియాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో ఒక్కసారి ఆలోచించారా? తరచుగా మీరు క్యాబ్‌లో ప్రయాణించాల్సి వస్తే ఈ జాగ్రత్తలు పాటించండి.**

ఓలా, ఉబర్ వంటి అప్లికేషన్లలో క్యాబ్ బుక్ చేసినప్పుడు స్ర్కీన్ మీద డ్రైవర్ పేరు, వాహనం నెంబర్, కలర్, వాహనం మోడల్ వంటి వివరాలన్నీ కనిపిస్తాయి. వాటిని చాలామంది పెద్దగా పట్టించుకోరు. అయితే కచ్చితంగా బుకింగ్ స్ర్కీన్ మీద వచ్చిన వివరాలూ, మీ దగ్గరకు వచ్చిన వెహికల్ వివరాలు సరిపోలుతున్నాయో లేదో పరిశీలించుకోవాలి. క్యాబ్ బుకింగ్ అప్లికేషన్‌లో కనిపిస్తున్న డ్రైవర్ ఫోటో, క్యాబ్‌లో ఉన్న డ్రైవర్ ఇద్దరూ ఒకటా కాదా! అన్నది కూడా పరిశీలించాలి. ఏదైనా వ్యత్యాసం ఉంటే ఆ వెహికల్ క్యాన్సిల్ చేసి, మరోటి బుక్ చేసుకోవాలి.

## ఫోటో తీయండి!

క్యాబ్‌లో ఎక్కే ముందు, నెంబర్ ప్లేట్‌తో సహా డ్రైవర్‌నీ ఫోటో తీసి ఆ ఫోటోలను స్నేహితులకు, కుటుంబ సభ్యులకు పంపించాలి. దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగితే ఇవి కీలకమైన ఆధారంగా పనికొస్తాయి. చాలామంది ఫోటో తీయడానికి సంశయిస్తుంటారు. అలాంటి మొహమాటాలకు పోవాల్సిన పని లేదు. మన జాగ్రత్త మనం చూసుకోవడం చాలా అవసరం. ఫోటో తీస్తుంటే డ్రైవర్ ఏమనుకుంటాడో? చుట్టూ ఉన్న వాళ్ళు ఎలా ఫీలవుతారో? అని ఆలోచిస్తే మీ సెక్యూరిటీ ప్రమాదంలో పడుతుంది.

## షేరింగ్ క్యాబ్ బుక్ చేయకండి

డైరెక్ట్‌గా మన కోసం ప్రత్యేకంగా క్యాబ్ బుక్ చేస్తే డబ్బులు ఎక్కువ అవుతాయని, చాలామంది షేరింగ్ క్యాబ్ బుక్ చేస్తుంటారు. అలా ఎక్కువ మందితో కలిసి ప్రయాణించటం వల్ల రక్షణ కూడా లభిస్తుంది అని భావిస్తుంటారు. అయితే ఇది పూర్తిగా తప్పు. చాలా సందర్భాలలో డ్రైవర్, అతడి స్నేహితులు ప్యాసింజర్లుగా ముందే క్యాబ్‌లో కూర్చుని అందరూ కలిసి మహిళల మీద సామూహికంగా లైంగిక దాడి చేయడం గతంలో చాలా కేసుల్లో నమోదైంది. కాబట్టి అప్రమత్తంగా ఉండండి.

## ట్రిప్ వివరాలు షేర్ చేయండి

క్యాబ్‌లో కూర్చొని మీ ట్రిప్ ప్రారంభమైన వెంటనే, దానికి సంబంధించిన లైవ్ లొకేషన్‌ని ఆ క్యాబ్ బుకింగ్ అప్లికేషన్‌లో ఉండే ఆప్షన్ ద్వారా లేదా గూగుల్ మ్యాప్స్ ఓపెన్ చేసి అందులో కనిపించే లైవ్ లొకేషన్ షేరింగ్ సదుపాయం ద్వారా మీ కుటుంబ సభ్యులు లేదా స్నేహితులకు షేర్ చేయండి. దాంతో క్యాబ్ ఎలా మూవ్ అవుతోంది పరిశీలిస్తూ ఎక్కడైనా అవాంఛనీయంగా ఎక్కువ సమయం ఆగినట్లయితే, లేదా వేరే రూట్లో వెళుతున్నా వెంటనే మీ కుటుంబ సభ్యులు అప్రమత్తం కావడానికి ఇది ఉపయోగపడుతుంది.

### చైల్డ్ లాక్ ఎలా ఉంది?

ప్రతీ కారులోనూ చైల్డ్ లాక్ ఉంటుంది. చిన్న పిల్లలు ఆడుకుంటూ పొరపాటున డోర్ ఓపెన్ చేయకుండా ఉండడం కోసం డ్రైవర్ సీట్‌లో ఉన్న వ్యక్తి కారులో ఉన్న అన్ని డోర్లను తన దగ్గర ఉండే ఒక బటన్ ఉపయోగించి లాక్ చేయగలుగుతాడు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం క్యాబ్ కోసం ఉపయోగించే కార్లలో చైల్డ్ లాక్ డిజేబుల్‌గా ఉండాలి. అప్పుడు మాత్రమే ఎవరైనా డ్రైవర్ తప్పుగా ప్రవర్తించినప్పుడు మహిళలు డోర్ తెరుచుకుని బయటపడగలుగుతారు. కాబట్టి ప్రయాణం ప్రారంభం కావడానికి ముందే లాక్ డిసేబుల్ చేసి ఉందా? లేదా? అన్నది పరిశీలించాలి. అన్ని క్యాబ్ సర్వీసులు డిఫాల్ట్‌గా దీన్ని డిజేబుల్ చేస్తున్నాయి.



## వాయిస్ రికార్డర్

ప్రతీ ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్లలో వాయిస్ రికార్డర్ అప్లికేషన్ ఉంటుంది. మీ ఫోన్‌లో లేకపోతే వాయిస్ రికార్డర్ అప్లికేషన్‌ని డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోండి. క్యాబ్ ప్రయాణం ప్రారంభమైన వెంటనే సైలెంట్‌గా వాయిస్ రికార్డింగ్ మొదలుపెట్టండి. ఏదైనా అనుమానం వస్తే ఆ వాయిస్ రికార్డింగ్‌ని మీ కుటుంబ సభ్యులకు షేర్ చేయండి. దురదృష్టవశాత్తు ఏదైనా సంఘటన జరిగితే, పోలీస్ పరిశోధన కోసం ఆ ఆడియో రికార్డింగ్ ఉపయోగపడుతుంది. రాత్రి సమయాల్లో క్యాబ్‌లో ప్రయాణించేటప్పుడు కచ్చితంగా దీన్ని ఉపయోగించండి.

### గూగుల్ మ్యాప్స్ ఆఫ్‌లైన్ డౌన్‌లోడ్ చేసుకోండి



మీకు తెలిసిన ప్రాంతం గుండా క్యాబ్ వెళుతుంటే పరిసరాలను ఎప్పటికప్పుడు గమనించడం ద్వారా క్యాబ్ సరైన రూట్లో వెళుతుందా లేదా! అన్నది పరిశీలించండి. ఏదైనా కొద్దిగా తేడా వస్తే వెంటనే అప్రమత్తం అవ్వండి. ఒకవేళ బయట నగరాలకు వెళ్ళినప్పుడు లేదా తెలియని ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు రూట్ మీకు తెలియదు కాబట్టి గూగుల్ మ్యాప్ ఫాలో అవ్వండి. కొన్నిచోట్ల ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉండదు కాబట్టి గూగుల్ మ్యాప్స్‌లోకి వెళ్లి, మీరు వెళ్లాల్సిన డెస్టినేషన్‌కు రూట్ చూసుకుని దానికి సంబంధించిన ఆఫ్‌లైన్ మ్యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. దాంతో నెట్ కనెక్టివిటీ ఉన్నా లేకపోయినా, మీరు సరైన దారిలో వెళుతున్నారా లేదా! అన్నది పరిశీలించవచ్చు.

## అలసిపోతే

ఆఫీసులో నుంచి లేదా లేట్ నైట్ పార్టీలకు వెళ్లి వచ్చేటప్పుడు క్యాబ్‌లో చాలామంది ఆదమరిచి నిద్రపోతుంటారు. ఇది చాలా ప్రమాదకరం. డ్రైవర్ ఎప్పటికప్పుడు మిర్రర్ ద్వారా వెనక కూర్చున్న ప్రయాణికురాలిని గమనించే అవకాశం ఉంది. నిద్రపోతున్నట్లు తెలిస్తే రూట్ మార్చటం గానీ, ఇతర ప్రమాదాలు గానీ జరుగుతాయి. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో క్యాబ్‌లో ఆదమరిచి నిద్రపోకండి. అలాగే డ్రైవర్ అనుమానాస్పదంగా మీ వైపు చూస్తూ ఉన్నట్లయితే అప్రమత్తం అవ్వండి.

## ఇతర జాగ్రత్తలు

క్యాబ్‌లో ప్రయాణానికి ముందు, మీ ఫోన్ బ్యాటరీ ఫుల్‌గా ఉండటంతో పాటు, పవర్ బ్యాంక్, ఛార్జింగ్ కేబుల్ తప్పనిసరిగా వెంట ఉంచుకోండి. దీంతో ఏదైనా జరగరానిది జరిగినప్పుడు ఇంట్లోవాళ్లకు సమాచారం ఇవ్వడానికి ఈ ఏర్పాటు పనికొస్తుంది. కొన్నిసార్లు ట్రాఫిక్ ఎక్కువగా ఉందని చెబుతూ డ్రైవర్ రూట్ మార్చే ప్రమాదముంది. ఒక వేళ మీకు ఆ రోడ్ బాగా తెలిసి ఉంటే ఓకే.. లేదంటే ఎట్టిపరిస్థితుల్లోనూ రూట్ మార్చడానికి అంగీకరించకండి.



**నల్లమోతు శ్రీధర్**
fb.com/nallamothusridhar

టెక్ సందేహాలు

## డౌన్‌లోడ్ కోసం ఆప్షన్ ఉందా?

**ఫోన్‌లో ఫైళ్లను వేగంగా డౌన్‌లోడ్ చేసుకోవడానికి ఏదైనా ఆప్షన్ ఉందా?**

**- రాజ్ కుమార్**



ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం వాడే యూజర్లకు గూగుల్ ప్లే స్టోర్‌లో అడ్వాన్స్ డౌన్‌లోడ్ మేనేజర్ అనే ఒక ప్రత్యేకమైన అప్లికేషన్ లభిస్తోంది. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకుంటే మీ ఫోన్‌లో ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన ఫైల్స్ అన్నీ ఒకేసారి సర్వర్‌కి మల్టిపుల్ కనెక్షన్స్ సృష్టించబడి చాలా తక్కువ సమయంలో డౌన్‌లోడ్ చేసుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. ఇలా ప్రత్యేకంగా డౌన్‌లోడ్ మేనేజర్ వాడటం ద్వారా ఒకవేళ ఏ కారణం చేతనైనా ప్రస్తుతం డౌన్‌లోడ్ అవుతున్న ఫైల్ తాత్కాలికంగా పాజ్ చేయాలంటే చేసుకోవచ్చు. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత డౌన్‌లోడ్ లింకులను ఈ అప్లికేషన్‌లోకి షేర్ చేసినప్పుడు ఆటోమేటిక్‌గా డౌన్‌లోడింగ్ మొదలవుతుంది.

## యాప్స్ ఎక్కువైతే సమస్యా?



**ఫోన్‌లో భారీ మొత్తంలో యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల ఏమైనా సమస్య ఉంటుందా?**

**- శ్రీనివాస రావు**

వాస్తవానికి మన ఫోన్‌లో భారీ మొత్తంలో అప్లికేషన్స్ ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల ఎలాంటి సమస్యా ఉండదు. కానీ మన ఫోన్లో ఇన్‌స్టాల్ అయిన కొన్ని అప్లికేషన్స్ నిరంతరం బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతూ ఉంటాయి. మరి కొన్ని అప్లికేషన్స్ మనకు అవసరమైనప్పుడు మాత్రమే ఓపెన్ అయి ఆ తర్వాత క్లోజ్ అవుతాయి. ఎక్కువ మొత్తంలో బ్యాక్‌గ్రౌండ్‌లో ఓపెన్ అయిన అప్లికేషన్స్ వల్ల ఆటోమేటిక్‌గా అందుబాటులో ఉన్న రామ్ పరిమాణం తగ్గిపోతుంది. అది పరోక్షంగా ఫోన్ పనితీరు మీద ప్రభావం చూపిస్తుంది. కాబట్టి వీలైనంత వరకు ఎప్పటికప్పుడు మీ ఫోన్‌లో ఉన్న అప్లికేషన్స్ పరిశీలిస్తూ వాటిలో అనవసరమైన అప్లికేషన్స్ ఉంటే తొలగించడం శ్రేయస్కరం. దానివల్ల కచ్చితంగా మీకు ఫోన్ పనితీరులో వ్యత్యాసం కనిపిస్తుంది.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం: navya@andhrajyothy.com

విజేత

**ఓటమిని ఒప్పుకోని మనస్తత్వం, పోరాడే గుణం ఆయన సొంతం. మానసికంగా బలంగా ఉంటే అనుకున్నది సాధించడం సులువే అని చాటారు పుణేకు చెందిన 31 ఏళ్ల నిఖిల్ ప్రసాద్ బజీ. చిన్నతనంలోనే సెరిబ్రల్ పాల్సీ సోకడంతో కర్రసాయంతో గానీ నడవలేని పరిస్థితి ఆయనది. అయినా కూడా పట్టుదలతో చదివి న్యాయమూర్తి అవ్వాలన్న కలను నెరవేర్చుకున్నారు.**

# సంకల్పంతో సాధించాడు



"మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్, సివిల్ జడ్జ్ జూనియర్ డివిజన్ పరీక్ష ఫలితాల్లో నా పేరు చూసి ఎంతో సంతోషించా. ఇన్నాళ్ల నా కష్టానికి ముగింపు దొరికింది. శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారు మొదటి నుంచీ సానుకూల దృక్పథంతో ఉండాలి. లేదంటే ఈ ప్రపంచంలో బతకడం కష్టం. కష్టాలను అధిగమిస్తూ పాజిటివ్ ఆలోచనలతో సాగడం ఎంతో ముఖ్యం. అప్పుడే ఏదైనా సాధించగలుగుతారు" అని భావోద్వేగంతో అంటారు నిఖిల్.

**వైకల్యాన్ని నవ్వుతూ దాటేశారు**

చిన్నతనంలోనే సెరిబ్రల్ పాల్సీ జబ్బు కారణంగా కర్రల సాయంతో నడవాల్సిన పరిస్థితి ఆయనది. అయితే కుటుంబ సభ్యులు ఆయనకు ఏ ఇబ్బంది లేకుండా చూసుకున్నారు. ముఖ్యంగా వాళ్ల అమ్మ ఆయన్ను చంటి పిల్లాడిలా సాకింది. "నా పరిస్థితిని నేను ఒప్పుకునేవాడిని. నా బాల్యంలో స్నేహితులంతా క్రికెట్ ఆడుతుంటే నేను ఆడుతున్నట్టే భావించేవాణ్ణి. అయితే క్రికెట్ ఆడలేకపోయినా ఎంపైర్‌గా ఉండేవాడిని" అంటారు నిఖిల్. శారీరక వైకల్యాన్ని నవ్వుతూనే అధిగమించడం ఆ వయసు నుంచే అలవడింది. ఇంటర్ తరువాత ఉమ్మడి న్యాయ ప్రవేశ పరీక్షలో మంచి మార్కులు సాధించి, గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ (జీఎన్‌ఎల్‌యూ)లో ఎల్‌ఎల్‌బీ సీటు తెచ్చుకున్నారు నిఖిల్. అప్పుడు ఊరు విడిచి, ఒంటరిగా వెళ్లాల్సిన పరిస్థితి. అయినా అధైర్యపడకుండా వెళ్లారంటే ఇంటర్ రోజులే కారణం. ఆయన క్లాస్‌మేట్స్‌లో కొందరు అంధ విద్యార్థులు ఉండేవారు. వారు ఎవరి సాయం లేకుండా తమ పనులు తాము చేసుకునేవారు. వారిని చూసి ఆయన స్ఫూర్తి పొందారు.

**మెయిన్స్ ముందు ఫిజియోథెరపీ....**

లా కోర్సు పూర్తయ్యాక పుణే వచ్చేసి జడ్జి ఎగ్జామ్ ప్రిపరేషన్ మొదలెట్టారు నిఖిల్. మొదటి ప్రయత్నంలో విఫలం అయ్యారు. సబ్జెక్టు అనుభవం కోసం జిల్లా కోర్టులో, అప్పుల రికవరీ ట్రిబ్యునల్‌లో ఉద్యోగంలో చేరారు. అప్పుడే సివిల్ కోర్టులో జూనియర్ జడ్జి నోటిఫికేషన్ వచ్చింది. వెంటనే దరఖాస్తు చేసి ప్రిపరేషన్ మొదలెట్టారు. ఉద్యోగం, ప్రిపరేషన్ జంటగా సాగించారు. "రోజూ ఉదయాన్నే నాలుగింటికి లేచి తొమ్మిది వరకూ చదివేవాణ్ణి. తరువాత లాయర్‌గా ప్రాక్టీస్ కోసం కోర్టుకు వెళ్లిపోయేవాణ్ణి. వారాంతాల్లో అయితే రోజంతా పుస్తకాలతోనే గడిచిపోయేది. ప్రిలిమ్స్ క్లియర్ అయ్యాక మెయిన్స్ కోసం ఉద్యోగానికి కొన్ని రోజులు సెలవు పెట్టి చదివాను. మెయిన్స్ దగ్గరపడుతున్న కొద్దీ 12 గంటలు చేతిలో పుస్తకం ఉండేది. నా సంకల్పాన్ని సవాల్ చేస్తూ అదే సమయంలో 'బెల్స్ పాల్సీ' వచ్చింది. దాంతో ముఖంలో కొంత భాగం చచ్చుబడింది. ఆ ప్రభావం చదువుపై పడింది. అయినా కుంగిపోలేదు. ఎంతైనా సమస్యలతో పోరాడడం అలవాటైన వాడిని కదా! నెల రోజులు ఫిజియోథెరపీ చికిత్సతో కొంత కోలుకున్నా. ఆ పరీక్షలో లాయర్ ప్రాక్టీస్ అనుభవం ఎంతో ఉపయోగపడింది. మొత్తానికి మూడు దశల పరీక్షలో మెరుగైన ప్రదర్శన చేసి జడ్జి అవ్వాలన్న కలను నిజం చేసుకున్నాను. లక్ష్యం దిశగా సాగే తోవలో ఎన్నో అవాంతరాలు, కష్టాలు ఎదురవ్వొచ్చు. అయితే మీరు దృఢచిత్తంతో ఉంటే ఏది మిమ్మల్ని ఆపలేదు" అని తన ప్రిపరేషన్ రోజుల్ని గుర్తుచేసుకుంటారు నిఖిల్.

**భవిష్యత్ ప్రణాళిక**

"ప్రస్తుతానికైతే శిక్షణ షెడ్యూల్ ప్రకటన కోసం ఆశగా ఎదురుచూస్తున్నా. న్యాయానికి దేవాలయం లాంటి కోర్టులో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నా. భారత న్యాయవ్యవస్థ ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ ముందుకు సాగుతా" అని చెబుతారీ న్యాయవాది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు "మీ దృష్టంతా ప్రిపరేషన్ మీద ఉండాలి. కానీ ఫలితం మీద కాదు. తద్వారా మీలో ఏకాగ్రత, శ్రద్ధ పెరుగుతాయి" అని చెబుతున్న నిఖిల్ ప్రసాద్ జీవితాన్ని మించిన స్ఫూర్తిగాథ మరేం ఉంటుంది.



లిటిల్స్

జెన్ కథ



## శవపేటికను భద్రపరచు!

ఒక రైతు వయసు పైబడడంతో పొలం పనులకు వెళ్లలేక ఇంటి దగ్గరే ఉంటున్నాడు. రోజంతా ఇంటి అరుగుపై కూర్చుంటున్నాడు. ఆయన కొడుకు పొలం పనులు చక్కబెడుతున్నాడు. తండ్రి రోజూ అరుగుపై కూర్చుని ఉండటం గమనించిన అతడు ఒకరోజు "ఇక తండ్రి వల్ల ఏం ప్రయోజనం లేదని, ఏ పనీ చేయలేడని" అని మనసులో అనుకున్నాడు. ఒకరోజు విసుగు చెంది ఒక చెక్క శవపేటికను తయారుచేశాడు. దాన్ని తీసుకొచ్చి అందులో పడుకొమ్మని తండ్రితో అన్నాడు. తండ్రి మారు మాట్లాడకుండా అందులో పడుకున్నాడు. కొడుకు వెంటనే దాని మూత పెట్టేసి, కొండపైకి లాక్కుంటూ వెళ్లాడు. కొండపై నుంచి కిందకు తోసేద్దామనుకుంటున్న సమయంలో శవపేటికలో నుంచి వెలుతురు పడడం గమనించి మూత తీశాడు. అప్పుడు తండ్రి ప్రశాంతంగా కొడుకు వైపు చూస్తూ "నువ్వు నన్ను కొండపై నుంచి తోసేయాలని అనుకుంటున్నావని నాకు తెలుసు. అయితే దానికి ముందు నేనో సలహా ఇస్తాను" అని అన్నాడు తండ్రి. అప్పుడు కొడుకు "ఏంటది?" అని అడిగాడు. "నీకిష్టమైతే నన్ను కొండపై నుంచి తోసేయ్. కానీ ఈ చెక్క శవపేటికను దాచిపెట్టుకో. ఎందుకంటే ఇది భవిష్యత్తులో నీ పిల్లలకు ఉపయోగపడవచ్చు" అని అన్నాడు.

### పట్టికలో పదాలు కనిపెట్టండి

letter I

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| G | S | A | G | R | A | P | E | O | R | I |
| I | C | E | S | K | A | T | E | S | T | C |
| A | U | U | G | A | S | P | L | I | G | E |
| X | I | C | A | J | C | J | L | C | A | C |
| S | R | S | R | B | L | T | K | E | R | R |
| E | O | E | I | N | S | E | C | T | N | E |
| S | N | B | I | K | C | R | A | B | E | A |
| P | S | M | K | I | K | R | U | C | T | M |
| G | I | N | G | I | G | L | O | O | A | D |
| J | I | S | I | S | L | A | N | D | O | I |
| P | L | D | E | O | G | P | A | M | S | P |







### 7 తేడాలు గుర్తించండి



### బొమ్మ భాగాలను సరిగ్గా అతికించండి



### డైలీ సుడోకు - 267

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | | | 8 | 7 | | 5 |
| 6 | | | | 2 | | | | |
| | | 3 | 1 | | | 6 | 9 | |
| 9 | | | | 5 | 6 | | | |
| | 6 | | | | | | 4 | |
| | | | 8 | 4 | | | | 3 |
| | 5 | 7 | | | 1 | 3 | | |
| | | | | 8 | | | | 4 |
| 4 | | 1 | 7 | | | | | 9 |

**సుడోకు- 266 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 6 | 9 | 3 | 5 | 1 | 2 | 4 | 7 |
| 5 | 2 | 1 | 9 | 4 | 7 | 3 | 8 | 6 |
| 4 | 3 | 7 | 8 | 2 | 6 | 1 | 9 | 5 |
| 2 | 4 | 8 | 5 | 9 | 3 | 6 | 7 | 1 |
| 6 | 7 | 5 | 2 | 1 | 4 | 9 | 3 | 8 |
| 9 | 1 | 3 | 6 | 7 | 8 | 5 | 2 | 4 |
| 3 | 5 | 4 | 7 | 6 | 9 | 8 | 1 | 2 |
| 7 | 8 | 6 | 1 | 3 | 2 | 4 | 5 | 9 |
| 1 | 9 | 2 | 4 | 8 | 5 | 7 | 6 | 3 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

# రజనీతో మరోసారి


నయనతార,రజనీకాంత్

వెండితెరపై రజనీకాంత్, నయనతార జోడీ సూపర్‌హిట్. పదిహేనేళ్ల క్రితం వచ్చిన 'చంద్రముఖి', ఈ ఏడాది సంక్రాంతికి వచ్చిన 'దర్బార్'లో ఈ జోడీ సందడి చేసింది. 'కథానాయకుడు'లో ప్రత్యేక అతిథి పాత్రల్లో నటించారు కూడా! మరోసారి ఈ జోడీ సందడి చేయడానికి సిద్ధమవుతోంది. శివ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా సన్ పిక్చర్స్ ఓ సినిమా నిర్మిస్తోంది. ఖుష్బూ, మీనా, కీర్తీ సురేశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రధాన తారాగణంపై కొన్ని సన్నివేశాలు తెరకెక్కించారు. ఈ చిత్రంలో నయనతార కూడా నటిస్తున్నట్టు సన్ పిక్చర్స్ సంస్థ శుక్రవారం ప్రకటించింది.


నితిన్, రష్మిక

**వాట్టే వాట్టే బ్యూటీ... కండ్లే చేసే కంత్రీ డ్యూటీ!**

రష్మికా మందన్నను చూస్తూ 'తిప్పుతుంటే నాడుమే నాటీ... నా కండ్లే చేసే కంత్రీ డ్యూటీ' అని నితిన్ అంటున్నారు. వీళ్లిద్దరూ జంటగా నటిస్తున్న చిత్రం 'భీష్మ'. అందులోని 'వాట్టే వాట్టే బ్యూటీ' పాటలో లైన్స్ ఇవి. మహతీ స్వరసాగర్ సంగీతమందించగా... కాసర్ల శ్యామ్ రాసిన గీతమిది. ధనుంజయ్, అమల చేబోలు పాడారు. సాంగ్ వీడియో ప్రోమోను శుక్రవారం విడుదల చేశారు. నితిన్, రష్మిక మధ్య కెమిస్ట్రీ... వాళ్లిద్దరి స్టెప్పులకు తోడు కాసర్ల శ్యామ్ రచన ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఫుల్ సాంగ్ లిరికల్ వీడియో ఆదివారం సాయంత్రం విడుదల చేయనున్నట్టు నిర్మాత సూర్యదేవర నాగవంశీ తెలిపారు. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి పీడీవీ ప్రసాద్ సమర్పకులు.

# లిప్‌లాక్ చేస్తే తప్పేంటి?

**- ఐశ్వర్యా రాజేశ్**



"నేను తెలుగమ్మాయినే అయినా... పెరిగింది తమిళనాడులో కాబట్టి. ఇక్కడి జనాలకు ఇంకా దగ్గర కాలేదు. మాతృ భాషలో నటించాలని ఎంత కోరిక ఉన్నా ఎలా అప్రోచ్ అవ్వాలో తెలియలేదు. ఇప్పుడే కెరీర్ మొదలైంది కాబట్టి కొంచెం సమయం పడుతుంది. ఏడాదికి రెండు సినిమాలు వచ్చేలా ప్లాన్ చేసుకుని తెలుగువారికి దగ్గరవుతా" అని ఐశ్వర్యా రాజేశ్ అన్నారు. ఆమె కథానాయికగా క్రాంతి మాధవ్ దర్శకత్వం వహించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. కె.ఎస్.రామారావు సమర్పణలో కె.ఎ.వల్లభ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఐశ్వర్యా రాజేశ్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. నేను తెలుగులో అంగీకరించిన తొలి సినిమా ఇది. రెండేళ్ల క్రితం క్రాంతి మాధవ్ ఈ కథ చెప్పారు. సువర్ణ పాత్ర గురించి ఓ అవగాహనకు వచ్చాక 'మీరు తీస్తుంది తెలుగు సినిమానేనా' అని దర్శకుణ్ణి అడిగా. ఎందుకంటే తెలుగు సినిమాలో కథానాయికలంటే గ్లామర్‌గా, కలర్‌ఫుల్‌గా ఉండాలి. ఇందులో నాదేమో అందుకు భిన్నమైన పాత్ర కావడంతో ఆ అనుమానం వచ్చింది. నేను ఏ సినిమా అంగీకరించినా రెండు ఓ రోజులపాటు క్యారెక్టర్ అర్థం చేసుకోవడానికి సమయం తీసుకుంటా. విజయ్, నాకూ మధ్య సీన్స్ బాగా వచ్చాయంటే మేమిద్దరం చేసిన ప్రాక్టీస్ కారణం. విజయ్‌తో సినిమా అనగానే లిప్‌లాక్‌లు తప్పనిసరిగా ఉంటాయి అంటూ ఎంతోమంది ఎన్నో రకాలు చెప్పారు. అలాంటి ఒక్క కోణం ఆయనలో చూడలేదు. కథకు అవసరమైతే లిప్‌లాక్ చేయడంలో తప్పేముంది. ఇందులో నటించిన నలుగురు హీరోయిన్లలో ఎవరి పాత్రకు ప్రాధాన్యం ఉంటుందనేవి సినిమా చూస్తేనే తెలుస్తుంది. నాని-'శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న సినిమాతో తప్పకుండా ప్రేక్షకులకి చేరువవుతా. నా కోసం రచయితలు, దర్శకులు మంచి పాత్రలో రాస్తారో లేదో చూడాలి" అని అన్నారు.

# క్లాస్‌రూమ్ ప్రేమకథ


దివ్యారావు

అవార్డ్ చిత్రాల దర్శకుడు నరసింహ నంది స్వీయ దర్శకత్వంలో తాజాగా నిర్మించిన 'డిగ్రీ కాలేజ్' చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. వరుణ్, దివ్యారావు ఇందులో జంటగా నటించారు. ఈ చిత్రం గురించి దర్శకుడు మాట్లాడుతూ 'నేను ఇంతవరకూ తీసిన చిత్రాలకు భిన్నంగా కమర్షియల్ అంశాలు మేళవించి ఈ సినిమా తీశాను. ఇద్దరు కాలేజీ స్టూడెంట్స్ మధ్య క్లాస్‌రూమ్‌లో, బయట జరిగిన యథార్థ ప్రేమ సంఘటనల ఆధారంగా రూపొందించాం. రొమాంటిక్ అంశాలు కథకు అనుగుణంగా ఉంటాయి' అని తెలిపారు.
















| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 40,723.49 | 11,962.10 | 40,791 | 46,395 | 71.32 | 58.17 |
| 190.33 | 73.70 | 57 | 225 | 26 పైసలు | |

ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత)

# వృద్ధి మళ్లీ పైకి

## 2020-21లో 6-6.5 శాతానికి చేరొచ్చు

- సంస్కరణల జోరు పెంచాలి
- ద్రవ్య లోటు లక్ష్యాలను సడలించాలి
- 5 లక్షల కోట్ల డాలర్ల ఎకానమీ కోసం 1.4 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పెట్టుబడులు
- వస్తు తయారీకి ఊతమివ్వాలి
- 'ఆర్థిక సర్వే 2019-20' సూచనలు



న్యూఢిల్లీ: భారత ఆర్థిక వృద్ధి మళ్లీ పుంజుకుంటోందని, వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21)లో 6-6.5 శాతానికి చేరుకోవచ్చని 'ఆర్థిక సర్వే 2019-20' నివేదిక అంటోంది. "ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో వృద్ధి మళ్లీ పుంజుకోనుంది. పెరిగిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐ), డిమాండ్, జీఎస్‌టీ వసూళ్లు తదితర అంశాలు ఇదే సూచిస్తున్నాయి. అయితే, అంతర్జాతీయ మార్కెట్లో వాణిజ్యపరమైన ఆందోళనలు, ముడి చమురు ధరల పెరుగుదల వంటి అంశాలు వృద్ధికి గండి కొట్టే ప్రమాదమూ లేకపోలేద"ని హెచ్చరించింది. ఆర్థిక శాఖ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) కేవీ సుబ్రమణియన్ నేతృత్వంలో రూపొందించిన ఈ సర్వే నివేదికను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంట్‌కు సమర్పించారు. దశాబ్ద కనిష్ఠానికి జారుకున్న వృద్ధి రేటును పెంచేందుకు ప్రభుత్వం ద్రవ్యలోటు లక్ష్యాలను సడలించాలని, మరింత విస్తృత విధానాలు అవసరమని సర్వే నివేదిక సూచించింది. సంస్కరణలను వేగవంతం చేయాలని కోరింది. అంతేకాదు, ఆహార సబ్సిడీలను తగ్గించాలని..సంపద, ఉద్యోగాల సృష్టిలో కీలకపాత్ర పోషించే వ్యాపారులకు సముచిత గౌరవం లభించాలని అభిప్రాయపడింది. ఎందుకంటే, సంపద పుట్టుకొస్తేనే తిరిగి దాన్ని ఇతరులకు పంచగలమని రిపోర్టు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వృద్ధి 11 ఏళ్ల కనిష్ఠ స్థాయి 5 శాతానికి పరిమితం కావచ్చని ప్రభుత్వ అంచనా. 2008-09 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత మళ్లీ ఇదే అత్యంత కనిష్ఠ స్థాయి వృద్ధి కానుంది.

**అరవింద్ ఆరోపణలకు ఆధారాల్లేవ్..**

2011 తర్వాత నుంచి వృద్ధి రేటును 2.7 శాతం మేర పెంచి చూపారంటూ మాజీ సీఈఏ అరవింద్ సుబ్రమణియన్ చేసిన ఆరోపణలను ప్రస్తుత సీఈఏ తోసిపుచ్చారు. ఆ ఆరోపణలకు ఎలాంటి ఆధారాల్లేవని, నిరూపించే డేటా కూడా లేదన్నారు.

### 3.8 శాతానికి ద్రవ్యలోటు!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్య లోటును జీడీపీలో 3.3 శాతానికి కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, మందగమనం కారణంగా పన్ను వసూళ్లు తగ్గడంతోపాటు ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కార్పొరేట్ పన్ను తగ్గించడంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడింది. దీంతో, ద్రవ్య లోటు ఈసారి 3.8 శాతానికి పెరిగే అవకాశం ఉంది. విత్త లోటు నియంత్రణ లక్ష్యాలను తప్పడం మోదీ సర్కారుకిది వరుసగా మూడో ఏడాది కానుంది.

### సంఘటితం వాటా పెరిగింది

- 2011-12లో 17.9 శాతంగా ఉన్న సంఘటిత ఉద్యోగాల వాటా 2017-18లో 22.8 శాతానికి పెరిగింది. ఎకానమీ వ్యవస్థీకరణ రేటు పెరుగుదలకు ఇది సంకేతం.
- 2011-12 నుంచి 2017-18 మధ్య కాలంలో కొత్తగా 2.62 కోట్ల ఉద్యోగాల కల్పన జరిగింది.
- 2011-12తో పోలిస్తే 2017-18లో మహిళకు ఉద్యోగాల కల్పన రేటు 8 శాతం వృద్ధి చెందింది.

## ఆర్థిక సర్వేలోని ముఖ్యాంశాలు

- రూ.1.84 లక్షల కోట్లకు చేరిన ఆహార సబ్సిడీల బిల్లును తగ్గించుకోవడం ద్వారా ద్రవ్యలోటు కట్టడికి కొంత వెసులుబాటు లభిస్తుంది
- 2025 నాటికి భారత ఆర్థిక వ్యవస్థను 5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేర్చడంలో నైతిక సంపద సృష్టి కీలకం. ఇందుకు వ్యవస్థలో నమ్మకాన్ని పెంచడంతోపాటు సాధికారిక మార్కెట్లు, వ్యాపార అనుకూల విధానాలు, రైతుల ఆదాయం పెంచే చర్యలు అవసరం
- కొత్త వ్యాపారాల ప్రారంభంతో పాటు ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపులు, కాంట్రాక్టుల అమలును మరింత సులభతరం చేసేందుకు అవసరమైన సంస్కరణలు చేపట్టాలి
- ఎగుమతులను ప్రోత్సహించేందుకు నౌకాశ్రయాల్లో అధికార యంత్రాంగాన్ని, నిబంధనలను సరళీకరించాలి
- దేశంలో ఉద్యోగావకాశాలు పెంచేందుకు వస్తు తయారీ రంగానికి ఊతమివ్వాలి. ప్రపంచ దేశాలకు ఎగుమతి కోసం కంపెనీలు భారత్‌లో అసెంబ్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలి
- ఆర్థిక వ్యవస్థ పరిణామాన్ని రెట్టింపు స్థాయికి (5లక్షల కోట్ల డాలర్లు) పెంచేందుకు వచ్చే ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కోసం 1.4 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాలి
- ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ(డిజిన్వెస్ట్‌మెంట్) జోరును పెంచాలి. తద్వారా ఈ సంస్థల్లో ప్రభుత్వ జోక్యం తగ్గడంతోపాటు కార్యకలాపాల దక్షత పెరుగుతుంది. ఇది సంస్థల లాభదాయకతకు దోహదపడుతుంది. పారిశ్రామిక ప్రోత్సాహం, సంపద పెరుగుదలకూ తోడ్పడుతుంది
- పెట్టుబడుల ఆధారిత వృద్ధి కోసం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగ పునరుద్ధరణపై దృష్టి సారించాలి
- మూలధన వ్యయాలు పెంచి, రెవెన్యూ వ్యయాలు తగ్గించుకోవడం ఆస్తుల సృష్టికి దోహదపడుతుంది. ఇప్పటివరకు వినియోగదారుల కొనుగోళ్ల వృద్ధిని ప్రధానంగా ముందుకు నడిపించాయి. ఇక ప్రభుత్వ భారీ పెట్టుబడులు వృద్ధి చోదకం కావాలి

### థాలీనామిక్స్!



ఆర్థిక సర్వేలో సుబ్రమణియన్ ఓ ఆసక్తికర అధ్యయన వివరాలను ప్రస్తావించారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ గతంలో 'దోశనామిక్స్' ద్వారా ధరలు, వడ్డీ రేట్ల సంబంధాన్ని వివరించగా.. దేశంలోని సామాన్యులకు ప్లేటు భోజనం ధర అందుబాటును సుబ్రమణియన్ 'థాలీనామిక్స్' ద్వారా వివరించే ప్రయత్నం చేశారు. 'థాలీనామిక్స్: దేశంలో ప్లేటు భోజనం ధరలు' అనే భాగంలో వెజ్, నాన్ వెజిటేరియన్ థాలీకి చెల్లిస్తున్న ధరపై జరిపిన అధ్యయన వివరాలను ప్రస్తావించింది. 2006-07 నుంచి 2019-20 మధ్య కాలంలో దేశ ప్రజలకు వెజ్ థాలీ ధరను చెల్లించగలిగే శక్తి 29 శాతం మేర పెరిగిందని సర్వే తెలిపింది. నాన్ వెజిటేరియన్ థాలీ విషయంలో ఇది 18 శాతంగా ఉంది.

- దేశంలోని నాలుగు (ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ) ప్రాంతాల్లోనూ వెజ్ థాలీ ధర 2015-16 నుంచి తగ్గుతూ వచ్చింది. గత ఏడాదిలో మాత్రం మళ్లీ కాస్త పెరిగింది. 2015-16 నుంచి కూరగాయలు, పప్పు ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు దోహదపడింది. 2019లో మళ్లీ వీటి ధరలు పెరగడమే ఇందుకు కారణం.
- 2015-16 తర్వాత కూడా వెజ్ థాలీ ధర పెరుగుతూనే ఉండి ఉంటే గనుక ఐదుగురు కుటుంబ సభ్యుల కుటుంబం రెండు పూటల భోజనం కోసం ఏటా రూ.10,887 అదనంగా ఖర్చు చేసి ఉండేవారు. అంటే, 2015-16 నుంచి కూరగాయల భోజనానికి ఆ కుటుంబం ఏటా రూ.10,887 ఆదా చేయగలిగిందన్న మాట. నాన్ వెజ్ భోజనం విషయంలో 2015-16 నుంచి వార్షిక ఆదా రూ.11,787గా నమోదైంది.

### పీఎస్‌బీలకు రూపాయికి 23 పైసల నష్టం

ఆర్థిక ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)ను పలు సమస్యలు వేధిస్తున్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. పీఎస్‌బీల కార్యనిర్వహణ దక్షతను పెంచేందుకు ఫిన్‌టెక్‌లను, ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్ కేటాయింపులు వంటి అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించింది. పీఎస్‌బీల్లో ప్రభుత్వ ఈక్విటీ కింద రూ.4.30 లక్షల కోట్ల ప్రజాధనాన్ని పెట్టుబడిగా పెట్టారు. గత ఏడాదిలో పీఎస్‌బీల్లో పెట్టుబడిగా పెట్టిన ప్రజాధనంలో ప్రతి రూపాయి 23 పైసల మేర నష్టపోయారు. ఇందుకు భిన్నంగా, 90 దశకం సంస్కరణల తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లోని ప్రజల పెట్టుబడిలో ప్రతి రూపాయి విలువ 9.6 పైసల మేర పెరిగింది.

### సర్వే ఇతివృత్తం

- పెట్టుబడుల ఆధారిత వృద్ధి
- సంపద సృష్టి
- వ్యాపారానుకూల విధానాలు
- విశ్వాసాన్ని పెంచడం

*భారతీయుల సంపదను పెంచడంపై దృష్టిసారించిన ఆర్థిక సర్వే.. ఎకానమీని 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చేందుకు బహుముఖ వ్యూహం అవసరమని చెబుతోంది.*

*- నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి*

## ఎస్‌బీఐ లాభంలో 41 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఈ ఏడాది డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.6,797.25 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,823.29 కోట్ల లాభంతో పోల్చితే ఇది 41 శాతం అధికం. మొండి బకాయిల వసూలు పెరగడంతో పాటు ఎన్‌పీఏ కేటాయింపులు తగ్గడం బ్యాంకు మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించడానికి దోహదపడింది. స్టాండ్ అలోన్ ప్రాతిపదికన కూడా లాభం 41.18 శాతం పెరిగి రూ.5583 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో స్టాండ్ అలోన్ లాభం రూ.3,955 కోట్లుగా ఉంది. లాభదాయకత, ఆస్తుల నాణ్యత, ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి, కాపిటల్ ఆడిక్వసీ అన్నింటిలోనూ తాము మెరుగైన పనితీరు ప్రదర్శించగలిగామని ఎస్‌బీఐ చైర్మన్ రజనీశ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. అలాగే డిపాజిట్లు, రుణాల్లో కూడా బలమైన వృద్ధి నమోదయిందని ఆయన అన్నారు. నికర వడ్డీ మార్జిన్ 22.42 శాతం పెరిగి రూ.27,779 కోట్లకు చేరింది. ఎస్సార్ స్టీల్ నుంచి రూ.11 వేల కోట్లు వసూలు కావడం నికర వడ్డీ ఆదాయం మెరుగుపడేందుకు, తద్వారా ఎన్ఐఎం పెరిగేందుకు కూడా దోహదపడింది. స్థూల ఎన్‌పీఏలు 8.71 శాతం నుంచి 6.94 శాతానికి, నికర ఎన్‌పీఏలు 3.95 శాతం నుంచి 2.65 శాతానికి తగ్గాయి. కాగా, డీహెచ్ఎఫ్ఎల్ ప్రభావం కారణంగా తాజాగా మొండి బకాయిల్లోకి చేరిన రుణాల పరిమాణం రూ.4,523 కోట్ల నుంచి రూ.16,525 కోట్లకు పెరిగింది.

### లాభాల్లోకి బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో లాభాల బాట పట్టింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.4643.71 కోట్ల నికర నష్టం ప్రకటించిన బ్యాంకు ఈ త్రైమాసికంలో రూ.138.20 కోట్ల కన్సాలిడేటెడ్ నికరలాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.11,791.16 కోట్ల నుంచి రూ.13,430.53 కోట్లకు పెరిగింది. ఎన్‌పీఏ ప్రొవిజనింగ్ రూ.9123.65 కోట్ల నుంచి రూ.4028.03 కోట్లకు తగ్గింది. స్థూల ఎన్‌పీఏలు 16.30 శాతం, నికర ఎన్‌పీఏలు 5.97 శాతంగా నమోదయ్యాయి. స్టాండ్ అలోన్ ప్రాతిపదికన ఈ త్రైమాసికంలో బ్యాంకు రూ.13,338.09 కోట్ల ఆదాయంపై రూ.105.52 కోట్ల నికరలాభం ఆర్జించింది.

### కోరమాండల్ లాభం రూ.265 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎరువులు, పంట సంరక్షణ, స్పెషాలిటీ పోషకాలను తయారు చేసి విక్రయిస్తున్న కోరమాండల్ ఇంటర్నేషనల్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి ఏకీకృత ప్రాతిపదికన రూ.265 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం లాభం రూ.154 కోట్లతో పోలిస్తే 72 శాతం పెరిగింది. సమీక్ష త్రైమాసికానికి ఆదాయం రూ.3,059 కోట్ల నుంచి రూ.3,288 కోట్లకు పెరిగిందని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సమీర్ గోయెల్ తెలిపారు. ఎబిటా ఆకర్షణీయంగా 42 శాతం వృద్ధితో రూ.305 కోట్ల నుంచి రూ.432 కోట్లకు చేరింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.10,296 కోట్ల ఆదాయంపై రూ.831 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. లాభం 36 శాతం పెరిగింది. కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈశాన్య ప్రాంతంలో మెరుగైన వర్షాలు, రైతులతో అనుసంధాన కార్యక్రమం, మెరుగైన నిర్వహణ సామర్థ్యాలు మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు ప్రకటించడానికి దోహదం చేశాయని గోయెల్ తెలిపారు.

## విప్రో సీఈఓ పదవికి నీముచ్‌వాలా గుడ్‌బై



న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల దిగ్గజం విప్రో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) పదవి నుంచి అబిదాలీ జెడ్ నీముచ్‌వాలా తప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే కంపెనీకి కొత్త సారథిని నియమించే వరకు కార్యకలాపాలు సక్రమంగా జరిగేలా నీముచ్‌వాలా తన పదవిలో కొనసాగుతారని విప్రో శుక్రవారం నాడు వెల్లడించింది. కుటుంబపరమైన కారణాలతో తన పదవి నుంచి తప్పుకోవాలని నీముచ్‌వాలా నిర్ణయించుకున్నారని కంపెనీ తెలిపింది. తదుపరి సీఈఓ కోసం డైరెక్టర్ల బోర్డు అన్వేషణను ప్రారంభించినట్టు పేర్కొంది. విప్రోకు నాయకత్వం వహించడంతో పాటు వృద్ధికి దోహదపడినందుకు నీముచ్‌వాలాకు కంపెనీ కృతజ్ఞతలు తెలిపింది. గత నాలుగేళ్ల కాలంలో ఆయన బలమైన కార్యనిర్వాహక ఆలోచనా విధానం పెంపొందించమేకాకుండా కీలకమైన కొనుగోళ్లను చేపట్టారని, డిజిటల్ వ్యాపారం మరింత విస్తరించేలా కృషి చేశారని విప్రో చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీ తెలిపారు. దాదాపు 75 ఏళ్ల చరిత్ర కలిగిన విప్రోకు సేవలు అందించడం ఎంతో గర్వకారణమని నీముచ్‌వాలా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన అజీమ్ ప్రేమ్‌జీ, రిషద్, బోర్డు డైరెక్టర్లు, విప్రో సహోద్యోగులు, కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో 23 ఏళ్ల పాటు పని చేసిన నీముచ్‌వాలా 2015లో గ్రూప్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా విప్రోలో చేరారు.

### పారిశ్రామికంలో రికవరీ

న్యూఢిల్లీ : ఆర్థిక రంగానికి అత్యంత కీలకమైన ఎనిమిది రంగాలు డిసెంబరులో రికవరీ బాట పట్టాయి. నవంబరు నెలలో ప్రతికూల వృద్ధిలో ఉన్న ఈ రంగాలు డిసెంబరులో 1.3% వృద్ధిని నమోదు చేశాయి. క్రూడాయిల్, సహజ వాయువు, విద్యుత్ విభాగాల్లో క్షీణత చోటు చేసుకున్నా బొగ్గు, ఎరువుల విభాగాలు సానుకూల వృద్ధిని నమోదు చేయడం రికవరీకి దోహదపడింది.

### 2018-19 వృద్ధి రేటు 6.1 శాతమే

న్యూఢిల్లీ: ప్రభుత్వం 2018-19 సంవత్సరం వృద్ధి రేటును 6.1 శాతానికి కుదించింది. వ్యవసాయం, గనులు, తయారీ రంగాల్లో క్షీణతతో వృద్ధి రేటు 6.8 శాతం ఉండవచ్చని గతంలో ప్రకటించిన అం చనాను సవరించింది. ప్రామాణికంగా పరిగణిస్తు న్న 2011-12 స్థిర ధరల కింద జీడీపీ 2017-18లో రూ.139.81 లక్షల కోట్లు కాగా 2018-19లో రూ.131.75 లక్షల కోట్లుంది. ఆ గణాంకాల ప్రకారం వృద్ధి రేటు 6.1 శాతానికే పరిమితమైందని జాతీయ గణాంక సంస్థ ప్రకటించింది.

### సబ్బుల ధరలు 6 % పెంపు: హెచ్‌యూఎల్

న్యూఢిల్లీ: సబ్బుల ధరల ను సుమారు 6% వరకూ పెంచనున్నట్లు హిందూస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ప్రకటించింది. గడచిన ఆరు నెలల్లో పామాయిల్ ధరలు 25 శాతం నుంచి 30 శాతం వరకు పెరగడంతో ధరలు పెంచినట్లు తెలిపింది. డవ్, లక్స్, లైఫ్‌బాయ్, పియర్స్, హమామ్, లిరిల్, రెక్సోనా సబ్బులను హెచ్‌యూఎల్ ఉత్పత్తి చేస్తోంది. కాగా డిసెంబరు త్రైమాసికంలో 12.96 శాతం వృద్ధితో రూ.1631కోట్ల లాభాన్ని ఆర్జించగా అమ్మకాలు 3.87 శాతం పెరిగి రూ.9953 కోట్లకు చేరుకున్నాయని హెచ్‌యూఎల్ తెలిపింది.

## అరవింద్ సారథ్య ఐబీఎం

### భారతీయుడికి సీఈఓ పగ్గాలు



న్యూయార్క్: అమెరికా కంపెనీలకు సారథ్యం వహిస్తున్న భారత సంతతి వ్యక్తుల్లో మరొకరు చేరారు. అమెరికా ఐటీ దిగ్గజం ఐబీఎం (ఇంటర్నేషనల్ బిజినెస్ మెషిన్స్ కార్పొరేషన్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ అరవింద్ కృష్ణ ఎన్నికయ్యారు. ప్రస్తుత సీఈఓ వర్జీనియా (గిన్ని) రోమెట్టి స్థానంలో కృష్ణ నియమితులయ్యారు. ఈయనను కంపెనీ సీఈఓగానే కాకుండా డైరెక్టర్ల బోర్డు సభ్యుడిగా ఐబీఎం డైరెక్టర్ల బోర్డు ఎంపిక చేసింది.

ఏప్రిల్ ఆరో తేదీ నుంచి ఇది అమల్లోకి వస్తుంది. ప్రస్తుతం కృష్ణ ఐబీఎం క్లౌడ్, కాగ్నిటివ్ సాఫ్ట్‌వేర్ యూనిట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఇక ఐబీఎం చైర్మన్, ప్రెసిడెంట్, సీఈఓగా ఉన్న రోమెట్టి బోర్డు ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొనసాగనున్నారు. ఈ ఏడాది చివరి వరకు ఆమె సేవలు అందిస్తారు. ఈమె దాదాపు 40 ఏళ్లు ఐబీఎంలో వివిధ హోదాల్లో పని చేశారు.

ఐబీఎం తదుపరి కాలానికి సరైన సీఈఓ కృష్ణ. బ్రిలియంట్ టెక్నాలజిస్ట్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్, క్వాంటమ్ కంప్యూటింగ్, బ్లాక్‌చెయిన్ వంటి కీలకమైన టెక్నాలజీల అభివృద్ధిలో కృష్ణ కీలక పాత్ర పోషించారు. ఆయన అద్భుతమైన ఆపరేషనల్ లీడర్. ఈ రోజు విజయం సాధిస్తూ రేపటి వ్యాపార నిర్మాణానికి దోహదపడే సత్తా ఆయనలో ఉంది. ఐబీఎం క్లౌడ్, కాగ్నిటివ్ సాఫ్ట్‌వేర్ వ్యాపార వృద్ధిలో కృష్ణ ముఖ్య భూమిక పోషించారు. గత ఏడాదిలో రెడ్‌హాట్‌ను కంపెనీ హస్తగతం చేసుకోవడంలో కృష్ణదే ముఖ్యపాత్ర.

*- వర్జీనియా రోమెట్టి*

"ఐబీఎం తదుపరి సీఈఓగా ఎన్నికవడం పట్ల ఎంతో ఆశ్చర్యానికి గురయ్యాను. నాపై విశ్వాసంతో బోర్డు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు". ఐబీఎంలో అద్భుతమైన టాలెంట్ కలిగిన వ్యక్తులున్నారు. టెక్నాలజీ ద్వారా క్లయింట్ల క్లిష్టమైన సమస్యలను పరిష్కరించేందుకు దోహదపడుతున్నాం. ఐటీ పరిశ్రమలో శరవేగంగా మార్పులు చోటు చేసుకుంటున్న తరుణంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐబీఎమర్స్, రెడ్ హాటర్స్, క్లయింట్లతో పని చేసేందుకు ఎదురుచూస్తున్నాం. మా ముందు అపార అవకాశాలున్నాయి, వీటి ద్వారా క్లయింట్ల వ్యాపారాలను వృద్ధి పరచడానికి దోహదపడతాం.

*- అరవింద్ కృష్ణ*

ఐబీఎం సీఈఓను ఎంపిక చేసే విషయంలో బోర్డు ప్రపంచస్థాయి ప్రక్రియను చేపట్టినట్లు ఐబీఎం డైరెక్టర్ల బోర్డు మైకేల్ ఎస్క్యూ తెలిపారు. ఇందులో భాగంగానే వ్యాపార చతురత, నిర్వహణా నైపుణ్యాలు, టెక్నాలజీ విజన్ కలిగిన కృష్ణను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఐబీఎంతో పాటు దాని క్లయింట్లను క్లౌడ్, కాగ్నిటివ్ యుగంలో కొత్త అధ్యాయానికి తీసుకువెళ్లే సత్తా కృష్ణకు ఉందని బోర్డు ఎగ్జిక్యూటివ్ కాంపెన్సేషన్, మేనేజింగ్ రిసోర్సెస్ కమిటీ చైర్మన్ అలెక్స్ గోర్స్కి తెలిపారు. రోమెట్టి తర్వాత కృష్ణ 'ఆదర్శ నాయకుడు' అని అన్నారు.

### ఇదీ నేపథ్యం..

- 57 ఏళ్ల వయసున్న అరవింద్ కృష్ణ 1990లో ఐబీఎంలో చేరారు
- ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కాన్పూర్ (ఐఐటీ కే)లో ఈయన అండర్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేశారు
- సెయింట్ జోసెఫ్ అకాడమీ డెహ్రాడూన్‌లో పాఠశాల విద్యను పూర్తి చేశారు
- యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు
- ఇంతకు ముందు అరవింద్ ఐబీఎం ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ జనరల్ మేనేజర్‌గా, ఐబీఎం సాఫ్ట్‌వేర్ స్ట్రాటజీ వైస్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. ఐబీఎం సాఫ్ట్‌వేర్, ఐబీఎం రీసెర్చ్‌లోనూ కీలకమైన పలు టెక్నికల్ బాధ్యతలు నిర్వర్తించారు. ఐబీఎం సాఫ్ట్‌వేర్ బిజినెస్‌ను ముందుండి నడిపించారు
- ఐఐటీకే నుంచి కృష్ణ ప్రముఖ అలుమ్నీ పురస్కారాలను పొందారు. ఐఈఈఈ, ఏసీఎం జర్నల్స్ ఎడిటర్‌గా ఉన్నారు. 15 పేటెంట్లకు కో ఆథర్‌గా ఉన్నారు

### బహుళజాతి దిగ్గజాలకు భారత సంతతి సారథులు

| | |
|---|---|
| సత్య నాదెళ్ల | మైక్రోసాఫ్ట్ సీఈఓ |
| సుందర్ పిచ్చయ్ | గూగుల్, అల్ఫాబెట్ సీఈఓ |
| అజయ్ బంగా | మాస్టర్ కార్డ్ సీఈఓ |
| శంతను నారాయణన్ | అడోబ్ సీఈఓ |
| ఇంద్రానూయి | పెప్సీకో మాజీ సీఈఓ |

### కీలక స్థాయికి దిగువకు..

**టెక్ వ్యూ**

నిఫ్టీ 12100 కన్నా పైన పాజిటివ్‌గా ప్రారంభమై కరెక్షన్ సాధించింది. ఆ తర్వాత రోజంతా బలహీనతను కొనసాగిస్తూ 12000 కన్నా దిగువకు వెళ్లింది. చివరికి 73 పాయింట్ల నష్టంతో ఆ మానసిక అవధి కన్నా దిగువనే క్లోజయింది. సానుకూలత కోసం ఈ స్థాయిలో పునరుజ్జీవం తప్పనిసరి. గత కొద్ది రోజుల్లో నిఫ్టీ 450 పాయింట్ల మేరకు దిగజారింది. సానుకూలత కోసం మద్దతు తీసుకుని కన్సాలిడేట్ కావడం అవశ్యం.

**శనివారం స్థాయిలివే...**

**నిరోధం : 12000 మద్దతు : 11910**

- ఇప్పటివరకు ప్రధాన నిరోధంగా ఉన్న 12000 ఇప్పుడు మద్దతు స్థాయిగా మారింది. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌కు అవకాశం ఉంటుంది.
- మరింత బలహీనపడి 11920 కన్నా దిగజారితే మరింత కరెక్షన్‌లో పురోగమిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 11800. ఇదే గతంలో ఏర్పడిన కనిష్ఠ స్థాయి.

**సూచన :** మార్కెట్ కన్సాలిడేట్ అయిన తర్వాతే స్వల్పకాలిక బై పొజిషన్లు శ్రేయస్కరం.

■ వి.సుందర్ రాజా

### సాధారణ నిస్తేజం

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** మాఘ శుక్ల సప్తమి
**నక్షత్రం :** అశ్విని
**అప్రమత్తం :** రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, వృషభ, కన్య రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.
**ట్రెండ్ మార్పు వేళలు : 2.13**
**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 12.55 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 3 గంటల వరకు నిస్తేజంగా ఉండి తదుపరి ముగింపు వరకు నిలకడగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.
**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ ఒంటి గంట సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 2.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 12005, 12040**
**మద్దతు స్థాయిలు : 11920, 11885**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | |
|---|---|
| 31వ తేదీకి.. | |
| హైదరాబాద్ | 355 |
| 1వ తేదీకి.. | |
| చిత్తూరు | 393 |
| గోదావరి | 365 |
| విజయవాడ | 365 |
| విశాఖపట్నం | 400 |
| వరంగల్ | 358 |

డజను గుడ్లు రూ. 60

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 82 | విజయవాడ | 87 |
| వరంగల్ | 82 | గుంటూరు | 87 |
| మహబూబ్‌నగర్ | 82 | ఒంగోలు | 89 |
| కరీంనగర్ | 82 | చిత్తూరు | 84 |
| కర్నూలు | 82 | నెల్లూరు | 83 |
| విశాఖపట్నం | 75 | అనంతపురం | 79 |
| గోదావరి | 81 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 40,820 | 40,700 | 42,020 | --- | 40,770 |
| క్రితం ముగింపు | 40,320 | 40,800 | 42,220 | 40,700 | 40,860 |
| 22 క్యారెట్లు | 38,850 | 37,700 | 38,650 | --- | 38,830 |
| క్రితం ముగింపు | 38,420 | 37,900 | 38,840 | 37,690 | 38,910 |
| వెండి (కిలో) | 46,500 | 48,000 | 48,300 | --- | 50,300 |
| క్రితం ముగింపు | 46,200 | 47,400 | 47,600 | 47,200 | 50,100 |

# ఫీల్ గుడ్ బడ్జెట్టే!!

## రాజకీయ, ఆర్థిక నిపుణుల అంచనా

న్యూఢిల్లీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది నెలల కిందటే లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి! మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి బడ్జెట్ ఇది! మరి, ఈ బడ్జెట్ ఎలా ఉండబోతోంది!? వరాల బడ్జెట్ ఉంటుందా!? వాతల బడ్జెట్ ఉంటుందా!? అందరిలోనూ ఆసక్తి రేపుతున్న ఉత్కంఠ ఇది! మరికొన్ని గంటల్లో ఈ ఉత్కంఠకు తెరపడనుంది. కానీ, ఈసారి 'ఫీల్ గుడ్' బడ్జెట్టే ఉంటుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందుకు ఒక కారణం.. ఆర్థిక మాంద్యం కాగా.. మరొక కారణం ఢిల్లీ ఎన్నికలని విశ్లేషిస్తున్నారు. ఆర్థిక మందగమనం తార స్థాయికి చేరిన నేపథ్యంలో కన్స్యూమర్ డిమాండ్, ఇన్వెస్ట్‌మెంట్ పెంచడానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్ని చర్యలూ తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆమె శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో పన్ను చెల్లింపుదారులకు భారీ ఊరట కలిగించే అవకాశాలున్నాయి. సెక్షన్ 80సి కింద పన్ను రాయితీలను కల్పించడం, స్టాండర్డ్ డిడక్షన్‌ను పెంచడం వంటి అనేక చర్యలను ప్రకటించవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వేతన వర్గాలు పొదుపు చేసేందుకు వీలుగా జాతీయ పింఛన్ పథకం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్ల పెంపు, పన్ను లేని సీనియర్ సిటిజన్స్ సేవింగ్ పథకం తదితరాలను ప్రకటించవచ్చునని అంచనా వేస్తున్నారు. మధ్య తరగతి చెల్లించే పన్ను శ్లాబ్‌లను పెంచి, పన్ను లేని నగదు చేతిలో ఆడేలా చేయడం ద్వారా వినియోగాన్ని పెంచాలని, తద్వారా, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే పథకాలను ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు వీలుగా గ్రామీణ రంగానికి భారీ కేటాయింపులు ఉంటాయని, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు అనేక రాయితీలు ప్రకటిస్తారని అంటున్నారు. కార్పొరేట్ బాండ్లు, అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రభుత్వ బాండ్లు, పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి అనేక నిర్ణయాలను ప్రకటించవచ్చని తెలిసింది.

# సీఏఏ చరిత్రాత్మకం

**పార్లమెంటు ఉభయ సభల సంయుక్త భేటీలో రాష్ట్రపతి కోవింద్**



ఉభయసభల సంయుక్త సమావేశంలో మోదీ, థావర్ చంద్ గెహ్లాట్, మన్మోహన్‌సింగ్

న్యూఢిల్లీ, జనవరి 31: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) చరిత్రాత్మకమని రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కొనియాడారు. ఈ చట్టాన్ని తెచ్చి పార్లమెంటు ఉభయ సభలు మహాత్మా గాంధీ ఆకాంక్షను నెరవేర్చాయని పేర్కొన్నారు. సీఏఏ వ్యతిరేక ఆందోళనలను పరోక్షంగా ప్రస్తావిస్తూ నిరసన పేరిట హింస తగదని హితవు పలికారు. శుక్రవారం బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. సీఏఏను ఆయన ప్రస్తుతించడంపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు సభ్యులు 'షేమ్ షేమ్' అంటూ అరిచారు. సీఏఏను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ సహా 14 ప్రతిపక్ష పార్టీల ఎంపీలు చేతికి నల్ల బ్యాండ్ ధరించి హాజరయ్యారు. హిందీలో 70 నిమిషాల పాటు రాష్ట్రపతి ప్రసంగం కొనసాగింది. పాకిస్థాన్‌కు చెందిన హిందువులు, సిక్కులకు అక్కడ ఉండటం ఇష్టం లేనప్పుడు భారత్‌కు రావచ్చని, వారు ఇక్కడ జీవనం సాగించేలా చూడటం ప్రభుత్వ బాధ్యతని గాంధీజీ నాడే చెప్పారని పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో ఆ విశ్వాసంపై తీవ్రమైన దాడి జరిగిందని అన్నారు. అయోధ్యపై సుప్రీం కోర్టు తీర్పు అనంతరం దేశ ప్రజలు ప్రదర్శించిన పరిణతి ప్రశంసనీయమని అన్నారు. ఆర్థిక అంశాల విషయానికొస్తే... 'మెరుగైన రేపటి' కోసం స్థానికంగా తయారైన ఉత్పత్తులనే వినియోగించాలని ప్రజలను కోరారు. ఈ దశాబ్దాన్ని 'భారత దశాబ్దం'గా, ఈ శతాబ్దాన్ని 'భారత శతాబ్దం'గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రపతి ప్రసంగానికి ముందు సీఏఏను వ్యతిరేకిస్తూ పార్లమెంటు కాంప్లెక్స్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం ముందు ప్రతిపక్షాలు ధర్నా చేశాయి.



ప్రసంగిస్తున్న రాష్ట్రపతి కోవింద్

**ప్రతిపక్షాల వాదనను తిప్పికొట్టాలి: మోదీ**

సీఏఏలో ఎలాంటి పౌరసత్వం లేవని, ముస్లింలకు కూడా అన్ని హక్కులూ ఉంటాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సీఏఏ.. ముస్లింల పట్ల వివక్ష చూపేదిగా ఉందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను తిప్పికొట్టాలని ఎన్డీయే భాగస్వామ్య పార్టీలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో సభలో ఎన్డీయే పక్షాలు వ్యవహరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఆయా పార్టీలతో ప్రధాని సమావేశం నిర్వహించారు. సీఏఏ విషయంలో అధికార పక్షం ఆత్మరక్షణలో ఉండాల్సిన అవసరమే లేదని, ప్రతిపక్షాలపై దూకుడుగా స్పందించాలని ఈ సందర్భంగా మోదీ అన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# తాయిలాలు తగ్గించండి

(మొదటి పేజీ తరువాయి)

రుణమాఫీ లబ్ధి పొందినవారు చేస్తున్న వినియోగం తక్కువ. పొదుపు తక్కువ. మదుపు తక్కువ. ఉత్పత్తి (దిగుబడి) తక్కువ. మొత్తానికి మొత్తం ఈ రుణ మాఫీల వల్ల ప్రయోజనం తక్కువ" అని సర్వే వివరించింది. ఇక, కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ బిల్లు రూ.3 లక్షల కోట్లు ఉందని, అందులో సింహభాగం అంటే రూ.1.84 లక్షల కోట్ల దాకా ఉన్న ఆహార సబ్సిడీ బిల్లులో భారీ కోత పెట్టాలని కూడా ఆర్థిక సర్వే గట్టిగా ప్రతిపాదించింది. చౌక డిపోల ద్వారా అందించే సరకుల ధరలను పునస్సమీక్షించాలని సూచించింది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద అందించే వీటి ధరలను మూడేళ్లుగా పెంచలేదని తెలిపింది. అత్యవసర (నిత్యావసర) సరకుల చట్టం వంటి కాలదోషం పట్టిన చట్టాల్ని ఎత్తేయాలని తేల్చిచెప్పింది.

**వాస్తవ విరుద్ధమైన సర్వే: కాంగ్రెస్**

ఆర్థిక సర్వేను కాంగ్రెస్ తప్పుబట్టింది. సామాన్యుడు ఎదుర్కొంటున్న అనే సమస్యలకు ఇది దర్పణం పట్టడం లేదనీ, వాస్తవాలకు దూరంగా ఉందని, దేశం ఎదుర్కొంటున్న సంక్లిష్ట ఆర్థికస్థితిని కూడా తెలియజెప్పడం లేదని కాంగ్రెస్ ప్రతినిధి రాజీవ్ గౌడ విమర్శించారు. ఆర్థిక సలహాదారు ఓ అధ్యాయం మేర రాసిన థాలినామిక్స్ (భోజన కొనుగోలుశక్తి)ని ఆక్షేపిస్తూ ఆ థాలి కాస్తా ఖాళీగా మారుతుందని వ్యాఖ్యానించారు.

### ఈసారి జీడీపీ 6-6.5%

రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడిన పడుతుందని, స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు 6 నుంచి 6.5 శాతం దాకా పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. 2019-20లో ఇది 5 శాతం ఉందని, 2021 మార్చినాటికి పుంజుకోవడం ఖాయమని పేర్కొంది. నిజానికి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 7 శాతం ఉంటుందని నిరుటి సర్వే అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 6-6.5 శాతానికి కుదించిందంటే.. పరిస్థితులు కుదుటపడినా.. భారీ ప్రగతి అసాధ్యమని సర్వే తేల్చినట్లేనని నిపుణులు అంచనా వేస్తున్నారు. ద్రవ్యలోటు అంచనా 3.3 శాతం ఉంటుందనుకున్నా అది 3.8 శాతానికి పెరిగిపోయింది. ఇలా పెరగడం వరుసగా ఇది మూడో ఏడాది.

### వ్యాపారులను గౌరవించాలి

సంపదను సృష్టిస్తేనే దానిని పంచిపెట్టగలం. అందుకే ఈ ఏడాది ఆర్థిక సర్వే థీమ్.. 'సంపద సృష్టి'! ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ ఈ సర్వే రూపకర్త. సంపద పెరగాలంటే మొదట దానిని సృష్టించే వారిని.. అంటే వ్యాపార, పరిశ్రమాధిపతులను గౌరవించాలని స్పష్టం చేసింది. తద్వారా.. పన్ను ఉగ్రవాదం ఆగాలని, వాణిజ్యవేత్తల వేధింపులకు అడ్డుకట్ట పడాలని చెప్పకనే చెప్పింది.

### జీడీపీ లెక్కల రగడ..

వృద్ధి రేటు విషయంలో మాజీ ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ వెల్లడించిన అభిప్రాయాలను ప్రస్తుత ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ కొట్టిపడేశారు. ఓ చాప్టర్ అంతా జీడీపీ లెక్కల వివాదంపైనే రాశారు. జీడీపీ వృద్ధి రేటు లెక్కను 2011 నుంచి ఏటా 2.5 పర్సంటేజీ పాయింట్ల మేర ఎక్కువ చేసి చూపారని అరవింద్ సుబ్రమణ్యన్ నిరుడు ఓ వివాదం రేపారు. తన వాదనకు బలం చేకూర్చేలా 2011-17 మధ్య కాలంలో వివిధ రంగాల ఆర్థిక సూచీలను ఆయన చూపారు. ఇంతవరకూ ప్రకటిస్తున్న జీడీపీ వృద్ధి రేటు అసలు సరైంది కాదే కాదన్నారు. కానీ ప్రస్తుత ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి దీనిని కౌంటర్ చేస్తూ- 'జీడీపీని ఎక్కువ చేసి చూపామంటూ ఆయన ఇచ్చిన ఆధారాలు తప్పు అని స్పష్టమవుతోంది. ఇదేమీ అంకెల గారడీ కాదు. 51 దేశాల జీడీపీ వృద్ధి రేటు లెక్కలతో బేరీజు వేశాం. మెథడాలజీ కూడా ఇదే! ఓవర్ ఎస్టిమేషన్ మిగిలిన దేశాల్లో వివిధ స్థాయుల్లో ఉంది. మన వరకూ చూస్తే దేశం యావత్తునూ పరిగణించి, వివిధ రంగాల ప్రగతిని తీసుకొని సరి చూశాం. ఎక్కడా ఓవర్ ఎస్టిమేషనే లేదు" అని తేల్చిచెప్పారు.




**రెస్టారెంట్ పెట్టడం కంటే.. పిస్తోలు కొనడం సులువు**

మన దేశంలో ఓ హోటల్ పెట్టడం కంటే పిస్తోలు వంటి మారణాయుధం కొనడం చాలా సులువు. బెంగళూరులో రెస్టారెంట్ పెట్టాలంటే 36 డాక్యుమెంట్లు, వాటికి అనుమతులు కావాలి. అదే ఢిల్లీలో అయితే 26 అనుమతులు, ముంబైలో 22 అవసరం. ఢిల్లీ, కోల్‌కతాల్లో పోలీస్ ఈటింగ్ హౌస్ లైసెన్స్ కూడా పొందాల్సి ఉంటుంది. అంటే పోలీస్ విభాగం నుంచి అదనపు క్లియరెన్స్ కింద మరిన్ని డాక్యుమెంట్లు సమర్పించాలన్నమాట. మొత్తం మీద ఈ రెండు మహానగరాల్లో ఓ రెస్టారెంట్ కోసం 45 డాక్యుమెంట్లు కావాలి. ఇదీ పరిస్థితి. అదే ఓ పిస్తోలు లేదా రివాల్వర్ లేదా ఇతర మారణాయుధాల్ని కొనాలంటే కేవలం 12 నుంచి 18 డాక్యుమెంట్లుంటే సరిపోతుంది. సింగపూర్ లేదా చైనాల్లో సైతం రెస్టారెంట్ ప్రారంభించాలంటే కేవలం నాలుగు డాక్యుమెంట్లు సరిపోతాయి. బార్లు, రెస్టారెంట్లు ఉపాధికల్పన ప్రదేశాలని, వాటికి అడ్డంకులు పెట్టడం సరికాదని సర్వే సర్వే అభిప్రాయపడింది.

## సర్వే హైలైట్స్



కృష్ణమూర్తి సుబ్రమణియన్

- జీడీపీ వృద్ధిరేటు ప్రస్తుతం ఉన్న 5 నుంచి 6-6.5 శాతానికి పెరగొచ్చు
- ప్రస్తుత ద్రవ్యలోటు అంచనాలను వృద్ధిరేటు హెచ్చుతగ్గుల మేరకు సవరించాలి.
- వృద్ధిరేటు పెరగాలంటే కీలక రంగాల్లో సంస్కరణలు వేగవంతం చేయాలి.
- ప్రపంచ పరిస్థితుల వల్లే మందగమనం.. అయితే దేశీయ పరిస్థితులూ కొంత కారణం
- 2019-20లో పారిశ్రామిక ప్రగతి 2.5 శాతం మాత్రమే
- ద్రవ్యోల్బణం నిరుడు ఏప్రిల్‌లో 3.2 శాతం ఉండగా, డిసెంబరు నాటికి 2.6 శాతానికి తగ్గుదల
- కూరగాయలు, పప్పుదినుసుల ధరలు పెరుగుతూ వచ్చాయి
- ప్రథమార్ధంలో వ్యవసాయ వృద్ధి స్వల్ప పెరుగుదల
- ఏప్రిల్-నవంబరు కాలంలో జీఎస్టీ వసూళ్ల 4.1 శాతం పెరుగుదల
- 2025 నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థికానికి పెరగాలంటే నైతిక రీతుల్లో సంపద సృష్టి జరగాలి
- 5 లక్షల కోట్ల డాలర్ల లక్ష్యం చేరాలంటే రానున్న ఐదేళ్లలో 1.4 లక్షల కోట్ల డాలర్లను మౌలిక సౌకర్యాలపై ఖర్చు చేయాలి
- 2011-12 నుంచి 2017-18 కాలంలో 2.62 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పించడం జరిగింది
- మహిళలకు ఉద్యోగాల్లో 8 శాతం పెరుగుదల
- ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విధానాలు మెరుగుపడాలి. ఖాతాదారుల్లో విశ్వాసం పాదుకొల్పే చర్యలు తీసుకోవాలి
- కొత్త వ్యాపారాన్ని ఆరంభించుకోవడానికి గానీ, పన్నుల చెల్లింపులకు గానీ ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు గానీ, కాంట్రాక్టుల అమలుకు గానీ సులువైన విధానాలు ఉండాలి.
- మేకిన్ ఇండియా ద్వారా దేశాన్ని అసెంబ్లింగ్ హబ్‌గా మార్చాలి. 2025 నాటికి 4 కోట్ల ఉద్యోగాలు, 2030 నాటికి 8 కోట్ల ఉద్యోగాలు సృష్టించాలి
- రియల్ ఎస్టేట్ సంస్థలు ఇళ్ల ధరవరలు తగ్గించాలి. అప్పుడే వాటి ఇన్వెంటరీ (అంటే నిర్మాణ సామగ్రి) క్లియర్ అవుతుంది. అటు బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు గాడిన పడి కాస్త మెరుగుపడతాయి
- త్వరితగతిన కార్మిక సంస్కరణలు చేపట్టాలి
- 2022 నాటికి లక్షన్నర ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

# కళాశాల విద్యార్థినులకు స్కూటర్లు

## పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు

**ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ ఉచిత హామీలు**

న్యూఢిల్లీ, జనవరి 31: ప్రతిష్ఠాత్మక ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ మేనిఫెస్టో విడుదల చేసింది. 'ఢిల్లీ సంకల్ప పత్రం'గా దీనిని పేర్కొంది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ప్రకాశ్ జావడేకర్, హర్షవర్ధన్ సమక్షంలో శుక్రవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో పార్టీ ఢిల్లీ శాఖ అధ్యక్షుడు మనోజ్ తివారీ మేనిఫెస్టో వివరాలను వెల్లడించారు. రూ.2కే నాణ్యమైన కిలో గోధుమ పిండి, ఆడ పిల్ల పుట్టినపుడే రూ.2 లక్షల డిపాజిట్ వంటి పేదలను ఆకట్టుకునే పథకాలతో పాటు.. నల్లా ద్వారా ఇంటింటికీ శుద్ధ జలం, కళాశాల విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు, 9వ తరగతి విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తామని, 10లక్షల మంది యువతకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది.

# యూపీలో ఆ 23 మంది పిల్లలు క్షేమం

**పోలీసుల కాల్పుల్లో నిందితుడు సుభాష్ హతం**

**అతడి భార్యను రాళ్లతో కొట్టి చంపిన స్థానికులు**

ఫరూకాబాద్, జనవరి 31: యూపీలో 23 మంది చిన్న పిల్లలను బంధించిన సుభాష్ బాథమ్ పోలీసుల కాల్పుల్లో హతమయ్యాడు. పోలీసులు దాదాపు 8 గంటలు శ్రమించి పిల్లలను క్షేమంగా విడిపించారు. మరోవైపు అతని భార్యను స్థానికులు రాళ్లతో కొట్టి చంపేశారు. అంతకు ముందు పిల్లలను వదిలేయాలని పోలీసులు సుభాష్‌తో చర్చించడానికి ప్రయత్నించారు. కానీ అతడు పోలీసులపైకి పలుమార్లు కాల్పులు జరిపాడు. నాటు బాంబులతో బెదిరించాడు. దీంతో ఎదురు కాల్పులు జరపవలసి వచ్చింది. ఈ ఘటనలో సుభాష్ అక్కడికక్కడే చనిపోయాడు. సుభాష్ కాల్పుల్లో ముగ్గురు గాయపడ్డారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటల సమయంలో పోలీసులు పిల్లలను విడిపించారు. అప్పటికే నిందితుడిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న స్థానికులు అతని భార్యను రాళ్లతో కొట్టారు. తీవ్ర గాయాల పాలైన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయింది. కాగా, పిల్లలు బయటపడటంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా యూపీ పోలీసులను, సీఎం యోగిని అభినందించారు.

# ఈయూ.. బై ..బై !

**అధికారికంగా బ్రిటన్ వేరు కాపురం**

**తెల్లవారుజామునే అమల్లోకి బ్రెగ్జిట్**

**అంతం కాదు.. ఆరంభం: జాన్సన్**

లండన్, జనవరి 31: బ్రిటన్ వేరు కాపురం ఆరంభమైంది. ఐరోపా సమాఖ్య(ఈయూ) నుంచి విడిపోవాలన్న ప్రజాభీష్టం నెరవేరింది. బ్రిటన్ కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 11 గంటలు, భారత కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున 4.30 గంటల నుంచి బ్రెగ్జిట్ అమల్లోకి వచ్చింది. మూడున్నర ఏళ్ల క్రితం నిర్వహించిన రెఫరెండంలో 52% ప్రజలు బ్రెగ్జిట్ వైపే మొగ్గు చూపారు. ఎన్నో అవాంతరాల మధ్య అది చట్టంగా మారడానికి ఇన్నేళ్లు పట్టింది. ఈయూ నుంచి వేరుపడిన తొలి దేశం బ్రిటనే! ఈయూతో 47 ఏళ్ల అనుబంధాన్ని తెగదెంపులు చేసుకోవడం ద్వారా ప్రపంచదేశాలతో సరికొత్తగా వాణిజ్య ఒప్పందాలు చేసుకునేందుకు బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు అమిత స్వేచ్ఛ లభిస్తుంది. ఈయూ నుంచి వేరుపడటం అంతం కాదని, ఇదో కొత్త ఆరంభమని జాన్సన్ స్పష్టం చేశారు. బ్రిటన్ చరిత్రలో మరో నూతనాధ్యాయం మొదలైందని జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో జాన్సన్ పేర్కొన్నారు.

# కొడుకు ప్రియురాలిపై అత్యాచారం

**పెళ్లి చేస్తానని పిలిచి ఘాతుకం**

**బలవంతంగా తాళి కట్టి రేప్.. తమిళనాడులో ఘటన**

చెన్నై, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కొడుకు ఓ అమ్మాయిని ప్రేమించాడు. తండ్రి వద్దన్నాడు. కొడుకు చచ్చిపోతానన్నాడు. దీంతో ఆ తండ్రి ప్రేమికులిద్దరినీ విడదీయడానికి నీచమైన పథకం వేశాడు. సదరు యువతి ఇంటికి వెళ్లి పెళ్లి చేస్తానంటూ తీసుకువచ్చాడు. మార్గమధ్యలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడే తాళి కట్టాడు. తమిళనాడులోని నాగపట్నం జిల్లాలో ఈ ఘటన జరిగింది. నిందితుడి పేరు నిత్యానందం. అతని కుమారుడు ముకేశ్ కన్నన్. ముకేశ్ కన్నన్, బాధితురాలు కొంతకాలంగా ప్రేమలో ఉన్నారు. కానీ పెళ్లికి రెండు కుటుంబాలు ఒప్పుకోలేదు. ఈ నేపథ్యంలోనే నిత్యానందం యువతిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇకనుంచి తనతోనే కాపురం చేయాలని, లేకపోతే చంపేస్తానని బెదిరించాడు. ఆమెను తన స్నేహితుడి ఇంట్లో నిర్బంధించాడు. పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. మరోపక్క, ఆ అమ్మాయి వేరే పెళ్లి చేసుకోబోతోందని కొడుకును నమ్మించాడు. ఇదిలా ఉండగా నిర్బంధంలో ఉన్న యువతి తప్పించుకుని వేదారణ్యం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

# ఉరి మళ్లీ వాయిదా

**నిరవధికంగా వాయిదా వేసిన కోర్టు**

న్యూఢిల్లీ, జనవరి 3: నిర్భయ హత్యాచార కేసు దోషుల ఉరితీత మళ్లీ ఆగిపోయింది. ఇలా ఆగడం ఇది రెండోసారి. డెత్ వారెంటు ప్రకారం శనివారం ఉదయం 6 గంటలకు వారిని ఢిల్లీలోని తిహాడ్ జైలులో ఉరితీయాలి. ఇందుకోసం తలారి కూడా తయారుగా వచ్చాడు. ఉరితీత నమూనా కూడా జరిగినట్లు వార్తలొచ్చాయి. అయితే దోషుల్లో ముగ్గురు- అక్షయ్ కుమార్, పవన్ గుప్తా, వినయ్ శర్మ ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో వేసిన ఓ పిటిషన్ వేశారు. ఉరికి వ్యతిరేకంగా తమకున్న న్యాయపరమైన మార్గాలేవీ ఇంకా పూర్తికాలేదని, అంచేత ఫిబ్రవరి 1న డెత్ వారెంట్ అమలు జరపడానికి వీల్లేదని వాదించారు. వీరి తరపున వాదించిన ఏపీ సింగ్ అనే అడ్వొకేట్.. 'చివరిక్షణం దాకా తమకు తాము సమర్థించుకునే అవకాశం దోషులకు ఉంటుందని, వారు క్యూరేటివ్ పిటిషన్లు వేశారనీ, ఇంకా రాష్ట్రపతి క్షమాభిక్ష కూడా ఓ అవకాశంగా వారికి ఉందని, ఇవేవీ పూర్తవకుండా ఉరితసేయడం ఉచితం కాదని' వాదించారు. తమ డెత్‌వారెంట్ అమలును నిరవధికంగా వాయిదా వెయ్యాలని కోరారు. నలుగురు దోషుల్లో ముఖేశ్ కుమార్ అనే ఒక్కడి అవకాశాలు మాత్రమే పూర్తయి ఉరికి సిద్ధంగా ఉన్నాడు. కానీ నియమావళి ప్రకారం.. ఒక కేసులో ఒకరి కంటే ఎక్కువ మంది దోషులు ఉన్నపుడు అందరినీ ఒకేమారు ఉరితీయాలి తప్ప ఒక్కో రోజూ ఒక్కొక్కరిని కాదు. ఈ రూల్‌ను తిహాడ్ జైలు అధికారులు సవాల్ చేశారు. కానీ సెషన్స్ కోర్టు జడ్జి ధర్మేంద్ర రాణా దీంతో ఏకీభవించలేదు. అయితే, దోషులు ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేస్తున్నారని, ఒకరి తరువాత మరొకరు రకరకాల పిటిషన్లతో కాలపయాపన చేస్తున్నారని ఆయన తప్పుపట్టారు.

## ఫార్మింగ్టన్ కేసులో మరో తెలుగు టెకీకి జైలు శిక్ష

వాషింగ్టన్, జనవరి 31: అమెరికాలో ఫార్మింగ్టన్ విశ్వవిద్యాలయం పేరుతో విద్యార్థులకు అక్రమంగా వీసాలిచ్చిన కేసులో మరో తెలుగు టెకీ ఫణిదీప్ కర్నాటికి 6 నెలల జైలు శిక్ష పడింది. శిక్ష అనుభవించాక అతడిని భారత్‌కు తిప్పి పంపుతామని అధికారులు తెలిపారు. కాగా.. ఈ కేసులో పలువురు తెలుగు విద్యార్థులు, టెకీలకు జైలు శిక్ష పడింది. వారిలో భరత్ కాకిరెడ్డి(18 నెలలు), సురేశ్ కందల(18 నెలలు), ప్రేమ్ రంపీస(ఏడాది), సంతోష్ సామ(రెండేళ్లు), అవినాశ్ తక్కలపల్లి(15 నెలలు), అశ్వంత్ నూనె(ఏడాది), నవీన్ ప్రత్తిపాటి(ఏడాది) ఉన్నారు.

## కాల్పులు జరిపింది మావాడే

**'జామియా' నిందితుడిపై బజ్‌రంగ్‌దళ్ ప్రకటన**

న్యూఢిల్లీ/నోయిడా, జనవరి 31: జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో ఆందోళనకారులపై గురువారం కాల్పులు జరిపింది తమ కార్యకర్తేనని బజ్‌రంగ్‌దళ్ ప్రకటించింది. బులంద్‌షహర్‌కు చెందిన నేత ఒకరు ఈ ప్రకటన చేశారు. నిందితుడు మైనర్‌గా భావిస్తున్న నేపథ్యంలో పోలీసులు జువెనైల్ జస్టిస్ బోర్డు ఎదుట హాజరుపరిచారు. దీంతో అతనికి బోర్డు 14 రోజుల ప్రొటెక్టివ్ కస్టడీ విధించింది. కాగా తన చర్య పట్ల నిందితుడిలో ఎటువంటి పశ్చాత్తాపమూ కనిపించడం లేదని పోలీసులు తెలిపారు. కాల్పులకు ఉపయోగించిన పిస్తోలును తన గ్రామం నుంచే తెచ్చుకున్నాడని, జనవరి 26న కాసర్‌గంజ్ హింసలో చనిపోయిన చందన్ గుప్తా మరణానికి ప్రతీకారం తీర్చుకొనేందుకు ఇక్కడికి వచ్చాడని తెలిపారు.

# చౌకీదార్ పేరుతో దోచేస్తున్నారు

- ప్రధాని మోదీది హిట్లర్, గాడ్సే రాజనీతి
- ఎన్‌ఆర్సీ, సీఏఏతో దేశ సమగ్రతకే ముప్పు
- సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్ ధ్వజం
- విజయవాడలో ఎన్‌ఆర్సీ, సీఏఏ వ్యతిరేక సభ
- రాజ్యాంగం కోసం మరో పోరాటం
- అంబేడ్కర్ మునిమనవడు రాజారత్నం



విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాజారత్నం అంబేడ్కర్, స్వామి అగ్నివేశ్, రామకృష్ణ, కేశినేని నాని తదితరుల అభివాదం

విజయవాడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీలో రెండు రాజనీతులు ఉన్నాయని, నియంత హిట్లర్, గాంధీజీని హతమార్చిన గాడ్సే రాజనీతులను కలిపి ఆయన అవలంబిస్తున్నారని మాజీ ఎంపీ, సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్ దుయ్యబట్టారు. ఈ రెండూ అత్యంత ప్రమాదకరమన్నారు. చౌకీదార్ పేరుతో మోదీ దేశాన్ని దోచేస్తున్నారని దుమ్మెత్తిపోశారు. ఎన్‌ఆర్సీ, సీఏఏ, ఎన్‌పీఆర్‌కు వ్యతిరేకంగా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో వివిధ ముస్లిం సంఘాలు శుక్రవారం సాయంత్రం భారీ బహిరంగ సభ నిర్వహించాయి. ముఖ్యఅతిథి అగ్నివేశ్ మాట్లాడుతూ కేంద్రం రూపొందించిన ఎన్‌ఆర్సీ, సీఏఏ, ఎన్‌పీఆర్‌ను కేరళ, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ వ్యతిరేకించాయని, ఈ చట్టాన్ని అమలు చేయబోమని కుండబద్దలు కొట్టాయని వివరించారు. దీన్ని అమలు చేసిన అసోంలో మెజారిటీ పౌరుల పౌరసత్వం ప్రశ్నార్థకమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఇష్టం లేకపోయినా మోదీ, అమిత్‌షా బెదిరింపు ధోరణితో బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపించారు. ఏపీలోని వైసీపీ ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఆర్సీని నిలువరించడానికి ముస్లిం యువత సైనికుల్లా తయారుకావాల్సిన అవసరం ఉందన్నారు. మోదీతో తమకు ఎలాంటి విరోధం లేదని, ఆయన అవలంబిస్తున్న విధానాలను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. దేశంలో అన్ని వర్గాలపైనా ఎన్‌ఆర్సీ ప్రభావం పడుతుందన్నారు. అంబేడ్కర్ మునిమనవడు రాజారత్నం అంబేడ్కర్ మాట్లాడుతూ పౌరసత్వం విషయంలో ఒక్క అంగుళం వెనక్కి తగ్గేది లేదని కేంద్ర హోంమంత్రి ప్రకటించారన్నారు. అదే పౌరసత్వం కోసం తాము పది అడుగులు ముందుకు వేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రాజ్యాంగాన్ని మోదీ ముత్తాత రాయలేదని, తన తాత రాశారని చెప్పారు. దేశంలో మీడియా మొత్తం మోదీ పైకంలో ఉందని విమర్శించారు. ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 15న నిర్వహించబోయే బహిరంగ సభలో తమ సత్తా ఏమిటో కేంద్ర ప్రభుత్వానికి చూపిస్తామన్నారు. పీవోడబ్ల్యూ కార్యదర్శి సంధ్య, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడారు. ఏప్రిల్‌లో ఇంటింటికి వచ్చే జనన గణన సిబ్బందికి ఎలాంటి సమాచారం ఇవ్వొద్దని నేతలు పిలుపునిచ్చారు.

**నెల్లూరులో కదంతొక్కిన ముస్లిం మహిళలు**



నెల్లూరు: ఎన్‌ఆర్సీ, సీఏఏ, ఎన్పీఆర్‌లను రద్దు చేయాల్సిందేనని, అప్పటి వరకు ఉద్యమం కొనసాగిస్తామని ముస్లిం సంఘాలు ప్రకటించాయి. శుక్రవారం నెల్లూరులోని మసీదుల్లో ప్రార్థనలు జరిపిన ముస్లిం మహిళలు, యువకులు నగరంలో ర్యాలీ నిర్వహించారు.

# వార్షికోత్సవాల పేరిట భారీగా నగదు వసూళ్లు

**కార్పొరేట్ విద్యాలయాలపై చర్యలు తీసుకోండి**

**హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం**

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వార్షికోత్సవాల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి భారీగా నగదు వసూలు చేస్తున్న కార్పొరేట్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ (ప్రైవేటు)విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ మేరకు కృష్ణా జిల్లా కోడూరు మండలం సాలింపాలెం పంచాయతీకి చెందిన సైకం రాజశేఖర్ పిటిషన్ దాఖలు చేశారు. సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తల్లిదండ్రులను అడిగి ఆ డబ్బులు తీసుకురావాలని విద్యార్థులపై ఒత్తిడి చేయడంతో పాటు, అలా తీసుకురానివారిని తోటి విద్యార్థుల ముందు అవమాన పరుస్తున్నాయని పిటిషన్లో పేర్కొన్నారు. రకరకాల ఆర్థిక కారణాలతో తల్లిదండ్రులు ఆ డబ్బులు చెల్లించలేకపోవడంతో.. అటు విద్యార్థులు అవమానాన్ని భరించలేక తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని వివరించారు. ఇది పిల్లల మానసిక వికాసంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థి నుంచి వెయ్యి, రెండు వేల చొప్పున.. ఇలా ఏటా వార్షికోత్సవాల కోసమే లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పిటిషన్‌లో హైదరాబాద్, గుంటూరు, విజయవాడల్లోని శ్రీచైతన్య స్కూల్, విజయవాడలోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్, సూళ్లూరుపేటలోని నారాయణ ఈ-టెక్నో స్కూల్, విజయవాడలోని నెల్లూర్ రవీంద్ర భారతి స్కూల్స్, గుంటూరు, విశాఖపట్నంలోని భాష్యం స్కూల్స్, విజయవాడలోని డాక్టర్ కేకేఆర్ గౌతం ఇంటర్నేషనల్ స్కూల్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్, అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఇలా డబ్బులు గుంజుతున్న పాఠశాలలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు.

## కశ్మీర్‌లో ముగ్గురు జైషే ఉగ్రవాదులు హతం

జమ్మూ, జనవరి 31: జమ్మూ కశ్మీర్‌లో ముగ్గురు జైషే మహమ్మద్ టెర్రరిస్టులు హతమయ్యారు. శుక్రవారం ఉదయం నలుగురు ఉగ్రవాదుల బృందం ఓ ట్రక్కులో దాక్కొని శ్రీనగర్ వెళ్తోంది. జమ్మూ-శ్రీనగర్ హైవేపై ఓ టోల్ గేట్ వద్ద భద్రతా దళాలు తనిఖీలు నిర్వహించగా ఉగ్రవాదులు జవాన్లపైకి కాల్పులు జరిపారు. ఎదురుకాల్పుల్లో ఒక ముష్కరుడు హతమయ్యాడు. మిగతా ముగ్గురు సమీపంలోని అడవిలోకి పారిపోయారు. అనంతరం జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు.

# అధికారులతో కీలక భేటీలున్నాయి!

- అందుకే జగన్ రాలేకపోయారు
- హాజరుకు మినహాయింపు ఇవ్వండి
- ఈడీ కోర్టుకు జగన్ న్యాయవాది నివేదన
- అంగీకరించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణ 7కి వాయిదా

హైదరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అధికారులతో కీలకమైన సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యక్తిగతంగా హాజరుకాలేకపోయారని ఆయన తరఫు న్యాయవాది అశోక్‌రెడ్డి ఈడీ కేసులను విచారించే సీబీఐ ప్రత్యేక కోర్టుకు నివేదించారు. ఆయన వ్యక్తిగతంగా హాజరు కాకుండా మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సీఆర్‌పీసీ సెక్షన్ 317 కింద పిటిషన్ దాఖలు చేశారు. మూడు రాజధానుల ఏర్పాటుకు సంబంధించి హైపవర్ కమిటీ సమావేశంతోపాటు శాసనమండలి రద్దుపైనా కీలకమైన సమావేశాల్లో ఆయన పాల్గొనాల్సి ఉందని తెలిపారు. దీంతో ఈ వాయిదాకు మినహాయింపు ఇచ్చిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఫిబ్రవరి 7కి వాయిదా వేశారు. కాగా, సీబీఐ దాఖలు చేసిన 11 చార్జిషీట్లలో ఈ వాయిదాకు జగన్ వ్యక్తిగత హాజరుకు మినహాయింపు కోరవచ్చని హైకోర్టు సూచించిందని సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి సీబీఐ ప్రత్యేక కోర్టుకు నివేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలతో మెమో దాఖలు చేశారు. ఇది నిజమేనా అని సీబీఐ సీనియర్ పీపీ బి.ప్రవీణ్‌రాజును న్యాయమూర్తి ప్రశ్నించారు. స్పెషల్ పీపీ సురేందర్‌కు ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్న రాజు.. వ్యక్తిగత హాజరుకు మినహాయింపు కోరేందుకు హైకోర్టు మౌఖికంగా అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందుకు అనుమతించిన న్యాయమూర్తి.. ఈ వాయిదా వరకు మినహాయింపునిచ్చారు. ఇంకోవైపు.. జగన్ సంస్థల్లో ప్రైవేటు వ్యక్తుల పెట్టుబడులకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన సీసీ 9/2012 చార్జిషీటులో నిందితుడిగా తనను తొలగించాలని కోరుతూ జగన్ దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్‌పై ఆయన తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి 3గంటల పాటు వాదనలు వినిపించారు. తదుపరి విచారణను న్యాయమూర్తి ఫిబ్రవరి 7కి వాయిదా వేశారు.

## 'సెట్స్' నిర్వహణకు ఏపీ ఆన్‌లైన్ సేవలు

- 2020-21 విద్యా సంవత్సరానికి పొడిగించాలని నిర్ణయం

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): 2020-21 విద్యా సంవత్సరంలో వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే 'ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్)'కు ఏపీ ఆన్‌లైన్ సేవలను మరోసారి వినియోగించుకోనున్నారు. 2017-18 నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న 'సెట్స్'కు ఏపీఆన్‌లైన్-టీసీఎస్ సేవలు వినియోగించుకున్న ప్రభుత్వం 2020-21లో నిర్వహించనున్న సెట్స్‌కు కూడా వాటి సేవలను పొడిగించబోతోంది. ఇందులో భాగంగా సెట్స్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తరఫున చెల్లించాల్సిన ఫీజులపై ఏపీ ఆన్‌లైన్‌తో రాష్ట్ర ఉన్నత విద్యామండలి తాజాగా సంప్రదింపులు జరిపింది. పరీక్ష ముందు, తర్వాత వివిధ ప్రక్రియలు చేపట్టేందుకుగాను ఒక్కో విద్యార్థికి రూ.287(18% జీఎస్టీ కలపకుండా) చెల్లించేలా అవగాహనకు వచ్చారు. 2019-20లో ఇది రూ.305గా ఉంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి తాజాగా ఉన్నత విద్యాశాఖకు ప్రతిపాదన పంపింది. ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయగానే ఏపీ ఆన్‌లైన్‌తో ఉన్నత విద్యామండలి ఒప్పందం కుదుర్చుకుంటుంది.

## నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు శనివారం ప్రారంభం కానున్నాయి. మొత్తం 905 సెంటర్లలో 3,37,054 మంది జనరల్ విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో 2,46,653మంది ఎంపీసీ, 90,401బైపీసీ గ్రూపు విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు ఒకేషనల్ విద్యార్థులు 66,611 మంది పరీక్షలు రాస్తారు. ఈనెల 20 వరకు రోజూ ఉదయం 9- 12గంటల వరకు, సాయంత్రం 2-5 గంటల వరకు.. రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షల్లో జంబ్లింగ్ పద్ధతి అమలు చేస్తున్నారు. అన్ని సెంటర్లలో వీడియో కెమెరాల పర్యవేక్షణ కూడా ఉంటుంది. విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాల నివృత్తికి వాట్సాప్ (9391282578)కు కాల్ చేయాలి. ఇంటర్ బోర్డులో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు.

# 'సాయి' నామస్మరణం

### విశాఖకు ఆయన 'రెండో సీఎం'

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

*రాష్ట్రానికంతా ఒక ముఖ్యమంత్రి! విశాఖపట్నానికి మాత్రం 'రెండో సీఎం' కూడా ఉన్నారు! ఆయనే... వైసీపీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయ సాయి రెడ్డి! ఇది జిల్లా అధికారులు, నాయకులే చెప్పే మాట! సాయిరెడ్డి విశాఖ వచ్చారంటే.. అంతా హైఅలర్ట్! అధికారిక సమీక్షలైనా.. 'ప్రత్యేక' సమావేశాలైనా ఆయనే 'సెంటర్ ఆఫ్ అట్రాక్షన్'! ఇంతా చేస్తే.. విశాఖకు సంబంధించి ఆయనకు ఎలాంటి అధికారిక హోదా లేదు! విశాఖ నగరానికి అధికార పార్టీ ఇన్‌చార్జి అంతే! ఎంపీగా తన కోటా నుంచి ఇచ్చిన నిధుల వ్యయంపై జిల్లా కలెక్టర్‌తో చర్చించే అధికారం మాత్రమే ఆయనకు ఉంది! కానీ.. జరుగుతున్నది, అంతకు మించి!*

ఎందుకో, ఏమో తెలియదు! వైసీపీకి విశాఖ అంటే ప్రత్యేక 'ఆసక్తి'! సీఎం జగన్‌కు కీలక సహచరుడు, ఇంకా చెప్పాలంటే అత్యంత విశ్వసనీయుడైన విజయ సాయిరెడ్డికి విశాఖ బాధ్యతలు అప్పగించారు. అధికారంలోకి రాకముందు ఒకటి రెండేళ్ల ముందునుంచే సాయిరెడ్డి విశాఖను తన 'రెండో ఇల్లు'గా మార్చుకున్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఈ నగరాన్నే 'దత్తత'కు తీసుకున్నారు. అధికారంలోకొచ్చిన తర్వాత.. పూర్తిస్థాయిలో చక్రం తిప్పుతున్నారు. అధికార యంత్రాంగం అంతా ఆయన కనుసన్నల్లోనే పని చేస్తోంది.

### సమావేశాల పరంపర

విజయ సాయిరెడ్డి నెలకు కనీసం రెండు మూడు సార్లైనా వస్తారు. నగరంలో, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నింటిపైనా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షిస్తుంటారు. అలాగే... ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ప్రత్యేకంగా ప్రభుత్వ అతిథి గృహానికి పిలిపించుకుని కీలక అంశాలపై చర్చిస్తుంటారు. ఒక్కోసారి తన ఇంటికి కూడా పిలిపించుకుంటారు. ఇలా ప్రత్యేకంగా నిర్వహించే సమావేశాల్లో.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కురసాల కన్నబాబు, జిల్లా మంత్రి అవంతి శ్రీనివాస్, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలెవరూ పాల్గొనరు. వారికి కనీస సమాచారం కూడా ఉండదు. ఇలాంటి రహస్య భేటీల్లో ఎక్కువగా భూములకు సంబంధించిన అంశాలపైనే చర్చిస్తారని అధికార వర్గాలు చెబుతాయి.



### ఆ అధికారం లేదు!

రాజ్యసభ సభ్యులకు ప్రభుత్వ పథకాలపై కలెక్టర్లతో సమీక్షించే అధికారం లేదు. తన ఎంపీ కోటా నుంచి ఇచ్చిన నిధులు ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు? ఆ పనులు ఎంతవరకు వచ్చాయని మాత్రమే వారు అడిగి తెలుసుకొని ఆదేశాలు ఇవ్వొచ్చు. అంతకు మించి ఏమైనా చేస్తే పరిధి దాటి ముందుకు వెళుతున్నట్టే.

\- ఈఏఎస్ శర్మ, పూర్వ సీనియర్ ఐఏఎస్ అధికారి



విశాఖ ఉత్సవ్ సమయంలో పుష్ప ప్రదర్శన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న విజయసాయిరెడ్డి (ఫైల్)

### పార్టీ ఇన్‌చార్జికి అంత పవరా?

విజయసాయిరెడ్డి విశాఖ జిల్లాకు వైసీపీ ఇన్‌చార్జి. ఆ హోదాతో ఆయన పార్టీ కార్యక్రమాలపై సమీక్షించవచ్చు. ప్రభుత్వ పథకాలు, ఇతర అంశాలపై సమీక్షించే అధికారం లేదని అధికార వర్గాలే చెబుతున్నాయి. అయినా సరే... సార్ పిలిచారంటే చాలు ఐఏఎస్, ఐపీఎస్‌లు రెక్కలు కట్టుకుని వాలిపోవాల్సిందే. ఇక కలెక్టరేట్‌లో నిర్వహించే సమీక్ష సమావేశాల్లో సాయిరెడ్డి 'సెంటర్'లో కూర్చుంటారు. కలెక్టర్‌తో పాటు ప్రతి ఒక్కరూ ఆయనకే అన్ని వివరాలు చెబుతారు. విశాఖ జిల్లాలో మంత్రులకంటే ఆయనే పవర్‌ఫుల్. ఆయన అపాయింట్‌మెంట్ కూడా ప్రముఖులకే లభిస్తుంది. తాము హాలులో కూర్చొని వెనక్కి రావలసిందే తప్ప ఆయన్ను కలిసే భాగ్యం దక్కదని పార్టీ నాయకులు, కార్యకర్తలు చెబుతుంటారు. నిజానికి... పార్టీ ఇన్‌చార్జిగా ఆయన వైసీపీ కార్యకర్తలు, నేతలకే ఎక్కువగా అందుబాటులో ఉండాలి. కానీ, అధికారిక సమీక్షలపైనే అధికంగా దృష్టి సారిస్తుంటారు.

### ప్రజాసేవకు ప్రగతి భారతి ట్రస్టు

ముందే చెప్పినట్లు... సాయిరెడ్డికి విశాఖపైన ప్రత్యేక ఆసక్తి! రాజ్యసభ సభ్యుడిగా విశాఖనే దత్తతకు తీసుకున్నారు. మరెక్కడా కాకుండా ఇక్కడే 'ప్రగతి భారతి' పేరిట ఒక సేవా ట్రస్టును స్థాపించారు. అధికారంలోకి రాగానే ఏర్పాటైన ఈ ట్రస్టుకు విశాఖ నగరంలోని ప్రముఖులు, వ్యాపారులు పోటీలు పడి రూ.5 లక్షల నుంచి పది లక్షలు విరాళాలుగా ఇచ్చారు. విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలు కూడా కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా తమ ట్రస్టుకు నిధులు ఇవ్వాలని సాయి రెడ్డి పిలుపునిచ్చారు. విశాఖ జిల్లాకు గతంలో మోపిదేవి వెంకట రమణ ఇన్‌చార్జి మంత్రిగా ఉండేవారు. 3నెలల క్రితం ఆయనను మార్చి కన్నబాబును నియమించారు. ఇక్కడ సాయిరెడ్డి అన్ని వ్యవహారాలు చూసుకోవడంతో ఇన్‌చార్జి మంత్రి విశాఖ వ్యవహారాలపై పెద్దగా దృష్టిపెట్టడం లేదని చెబుతారు.

### ప్రత్యేక విమానంలో రాక..

ఇటీవల సాయిరెడ్డి విశాఖకు వచ్చారు. నెలకు రెండు మూడు సార్లు వస్తూనే ఉంటారు కదా... ఇందులో ప్రత్యేకత ఏముందంటారా! కచ్చితంగా ఉంది. ఈసారి కొందరు న్యాయ నిపుణులతో కలిసి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయన సిరిపురంలోని ప్రభుత్వ అతిథి గృహానికి వెళ్లారు. ఐఏఎస్ అధికారులు వినయ్‌చంద్, సృజన, కోటేశ్వరరావులను పిలిపించుకున్నారు. ఈ అతిథి గృహానికి ఎదురుగా ఉన్న వాల్తేరు క్లబ్, పక్కనున్న దసపల్లా భూములపైనే చర్చ జరిపినట్లు తెలిసింది. ప్రస్తుతం ఇతరుల స్వాధీనంలో ఉన్న ఈ భూములపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. విశాఖలో అగ్రశ్రేణి వాల్తేరు క్లబ్.. లీజుకుతీసుకున్న స్థలంలోనే నడుస్తోంది. ఆ భూముల వారసులు వాటిని విక్రయించాలనే యోచనలో ఉన్నారు. క్లబ్‌ను ఖాళీ చేయాలని కోరగా కార్యవర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అలాగే... దసపల్లా భూములు కూడా చేతులు మారి న్యాయస్థానాల్లో నలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ భూములపై ఐఏఎస్ అధికారులతో సాయిరెడ్డి ప్రత్యేకంగా చర్చించడం సంచలనం సృష్టించింది. అధికారుల నుంచి పూర్తి సమాచారం తీసుకుని, న్యాయ నిపుణుల సలహాలతో వాటిని కోరుకున్నవారికి అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసింది. తిరిగెళ్తూ.. రెండు అట్టపెట్టెల్లో ఫైళ్లు కూడా తీసుకెళ్లినట్లు సమాచారం.

### పోలీస్ అధికారి కాపలా!

సాయిరెడ్డి విశాఖ నగరంలోకి వచ్చారంటే చాలు... పోలీస్ కమిషనరేట్‌లోని ఒక అధికారి పూర్తిగా ఆయన సేవలోనే ఉంటారు. సీతమ్మధారలో ఎంపీ తీసుకున్న నివాసంలోనే మకాం వేస్తారు. సాయిరెడ్డి తిరిగి వెళ్లే దాకా... అదే డ్యూటీ!



విలేకరులతో మాట్లాడుతున్న సిట్ సభ్యులు వైవీ అనురాధ, భాస్కరరావు

# ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

- వైట్‌నర్‌తో కొన్ని పేర్లు చెరిపి కొత్తగా రాశారు
- ఎన్‌వోసీల జారీలో భారీ అక్రమాలు
- 'విశాఖ'పై సిట్ సభ్యులు వెల్లడి
- సిట్ పరిధిలోకి 22-ఏ ఫైళ్లు
- విచారణ గడువు పెంచాలని వినతి

విశాఖపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విశాఖలో భూ ఆక్రమణలకు పాల్పడిన పలువురు.. రికార్డులు ట్యాంపర్ చేసినట్లు గుర్తించామని ప్రత్యేక దరాప్తు బృందం(సిట్) సభ్యులు వైవీ అనురాధ, టి.భాస్కరరావు తెలిపారు. సిట్ కార్యాలయంలో వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ట్యాంపరింగ్ జరిగిన ఫైళ్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నామన్నారు. కొన్నిరికార్డుల్లో పేర్లను వైట్‌నర్‌తో చెరిపేసి కొత్తవి రాశారని, ఏ పేర్లను కొట్టేశారో ఫోరెన్సిక్ ల్యాబ్‌లో గుర్తిస్తారని, అందుకే అక్కడికి పంపుతున్నామని వివరించారు. రికార్డులు ట్యాంపరింగ్ కింద 570 ఫిర్యాదులు పరిశీలించామన్నారు. ఎక్కువగా జిరాయితీ భూముల రికార్డులు మార్చినట్లు గుర్తించామన్నారు. విశాఖ పరిసరాల్లో విలువైన ప్రభుత్వ భూములు కూడా ఆక్రమణలకు గురైనట్లు తేలిందన్నారు. మూడు రోజుల క్రితం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలంసాహ్నిలను కలిసి గుర్తించిన అంశాలను తెలియజేశామన్నారు. ఇప్పటివరకు విచారించిన మేరకు 150పేజీల మధ్యంతర నివేదిక సీఎంకి సమర్పించామన్నారు. విశాఖలో ప్రభుత్వ భూమి గజం కూడా ఆక్రమణకు గురికాకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారని సిట్ సభ్యులు తెలిపారు. 22-ఏలో ఉన్న 19 కేసుల పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగానికి రాశామని, అయితే ఇంతవరకూ మినహాయింపు జరగలేదన్నారు. గతంలో వచ్చిన 1,386 ఫిర్యాదులలో 963 సిట్ పరిధి కిందకు వచ్చాయని సభ్యులు తెలిపారు. వాటిలో ఇప్పటివరకూ విచారించిన వాటిలో 278 పిటిషన్లు తిరస్కరించగా, 137 పెండింగ్‌లో ఉంచామన్నారు. మరో 141 ఫిర్యాదులపై విచారణ పూర్తిచేశామని, వీటిలో 92 ఎన్‌వోసీ కేసులు ఉన్నాయన్నారు. వాటిని పరిశీలించి 62 తిరస్కరించగా, 30 ఫిర్యాదులపై మధ్యంతర నివేదికలో ప్రస్తావించామన్నారు. విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం తదితర మండలాల్లో ఎన్‌వోసీలు జారీ చేసిన భూములు కొన్నింటిని వెనక్కి తీసుకోవాలని సిఫారసు చేశామన్నారు. ఇదే వ్యవహారంలో భారీ అక్రమాలు జరిగాయని, దీనికి సంబంధించి పలువురి అధికారులపై చర్యలకు సిఫారసు చేసినట్లు తెలిపారు. సర్వీస్‌లో ఉంటే చర్యలు, రిటైరైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటారన్నారు. నాన్ సిట్ పరిధిలోకి వచ్చే ఫిర్యాదులపై విచారణ ఏ మేరకు జరిగిందో రెవెన్యూ యంత్రాంగాన్ని నుంచి సమాచారం తీసుకుంటామని చెప్పారు. సిట్‌కు వచ్చిన ఫిర్యాదులలో ఇంకా కొన్ని విచారణ చేయాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే సిట్‌కు గడువు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు.

# పోస్టుల భర్తీకి పచ్చజెండా

- అన్ని శాఖల్లోనూ చాలినంత ఉద్యోగులు
- విద్య, వైద్య విభాగాలు మరింత కీలకం
- పోస్టులు ఖాళీగా పెట్టుకుని సేవ ఎలా చేస్తాం?
- ప్రభుత్వ ఉద్యోగాలపై సీఎం జగన్ వ్యాఖ్యలు
- అన్ని విభాగాల్లో 63 వేలకు పైగా ఖాళీల గుర్తింపు
- భర్తీ క్యాలెండర్‌పై ఉన్నతస్థాయి సమీక్ష
- వయోపరిమితి సడలింపుపై 21న క్లారిటీ



పౌరసరఫరాల శాఖ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం జగన్

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): "మన ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారికి ప్రభుత్వ సేవలు అందించేందుకు చాలినంత మంది ఉద్యోగులు అవసరం. కానీ, ఇప్పుడు దాదాపు అన్ని శాఖల్లోనూ ఖాళీలున్నాయని తెలుస్తోంది. వీటిని సత్వరమే భర్తీచేసి ప్రజలకు సేవలందించాలి. ముఖ్యంగా విద్య, వైద్య శాఖల్లో పోస్టులు ఖాళీగా ఉండడానికి వీల్లేదు" అని సీఎం జగన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖాళీ ఉద్యోగాల గుర్తింపు, భర్తీపై ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకుని ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఆయా రంగాల్లో సమూల మార్పులు ఆశిస్తున్నట్టు చెప్పారు. విద్య, వైద్య శాఖల్లో ఖాళీలను ముందుగా భర్తీచేయాలన్నారు. 'ఉద్యోగాల భర్తీ క్యాలెండర్'పై శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి కొడాలి నాని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, డీజీపీ గౌతం సవాంగ్, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఆసుపత్రికి ఎవరైనా రోగులు వస్తే.. ఆ సమయంలో అక్కడ ఉండాల్సిన సిబ్బంది లేకపోతే.. ఆ ఆసుపత్రి నిర్వహించి కూడా ఉపయోగం లేదు. ఇప్పటికే 'నాడు-నేడు' ద్వారా మనం ఆసుపత్రుల రూపు రేఖలను మారుస్తున్నాం. దీనిని దృష్టిలో పెట్టుకుని పెద్ద ఎత్తున రోగులు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్నారు. వీరికి సేవలు అందించేందుకు వీలుగా డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టు పోస్టులు పూర్తిగా భర్తీ అయి ఉండాలి" అని కోరారు. అదేసమయంలో ప్రభుత్వ పాఠశాలలో కూడా 'నాడు-నేడు' చేపడుతున్నందున పాఠశాలల్లో సిబ్బంది లేకపోతే ఎంత డబ్బు ఖర్చుపెట్టినా వృథా అవుతుందని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు సరిపడా లేకపోతే పాఠశాలల సమర్థత తగ్గుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. అప్పుడే స్కూళ్లలో మనం చేపడుతున్న ఆధునీకరణ పనులు, అమ్మ ఒడి, మధ్యాహ్న భోజనంలో నాణ్యతల కోసం తీసుకుంటున్న చర్యలకు అర్థం ఉంటుందన్నారు.

### పోలీసులకు సెలవులు ఇవ్వాల్సిందే

పోలీసు విభాగంలో వారాంతపు సెలవులను సమర్థంగా అమలు చేయాలని డీజీపీ సవాంగ్‌ను సీఎం జగన్ ఆదేశించారు. అయితే, సెలవుల కారణంగా పోలీసుశాఖ సామర్థ్యం తగ్గకూడదని హితవు పలికారు. రెవెన్యూ విభాగంలోనూ ప్రాధాన్యతా పోస్టులపై దృష్టి పెట్టాలని సూచించారు. సర్వే సిబ్బందికి అవసరమైన పరికరాలను సమకూర్చాలన్నారు. ప్రతి విభాగంలోనూ ప్రాధాన్యతా క్రమంలో పోస్టుల భర్తీపై చర్చించాలన్నారు. కాగా, మూడు వారాల్లో ప్రాధాన్యతా పోస్టులను నిర్ధారిస్తామని అధికారులు సీఎంకు తెలిపారు. అధికారులందరూ ఫిబ్రవరి 21న సీఎంతో మరోసారి భేటీ అయి.. కార్యాచరణ తెలియజేయాలని నిర్ణయించారు.

### వయోపరిమితి సడలింపు..

ఉద్యోగార్థుల గరిష్ఠ వయోపరిమితి సడలించే విషయం కూడా ఈ సమీక్షలో ఏపీపీఎస్సీ ప్రస్తావించింది. అయితే 46 సంవత్సరాలకు సడలించాలన్న అభిప్రాయం వ్యక్తమైనా.. ఏయే పోస్టులకు సడలించాలనే విషయంపై నిర్ణయం తీసుకోలేదు. 21న జరిగే సమావేశంలో దీనిపై నిర్ణయంతీసుకోనున్నారు. కాగా, ప్రభుత్వ విభాగాల్లో ఖాళీ పోస్టులు 63 వేలకుపైనే ఉండొచ్చని సీఎం జగన్‌కు అధికారులు నివేదించారు. టీచర్ పోస్టు లు 21 వేలు, ఏపీపీఎస్సీ భర్తీ చేసే పోస్టులు 19 వేలు, పోలీసు విభాగంలో పోస్టులు 13 వేలు ఉన్నాయి. అయితే, వాటి సంఖ్య మరింత పెరగొచ్చని సమాచారం. ఆర్థికశాఖ ప్రతి డిపార్ట్‌మెంట్‌తో మాట్లాడి ఖాళీలను నిర్ధారించి, వాటిని ఏవిధంగా భర్తీ చేయాలన్న విషయంపై నియామక సంస్థ(ఏజన్సీ)లతో చర్చించనుంది. అనంతరం ఉత్తర్వులు జారీ చేయనుంది.

# నాణ్యమైన బియ్యం మరింత ఆలస్యం

- ఏప్రిల్ నుంచి దశల వారీగా పంపిణీ
- ఆగస్టు నాటికి రాష్ట్రమంతటా అమలు
- పౌరసరఫరాల శాఖతో సీఎం సమీక్ష

అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన బియ్యం పంపిణీ మరింత ఆలస్యం కానుంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2019 సెప్టెంబరు నుంచి రాష్ట్రమంతా నాణ్యమైన బియ్యం పంపిణీ చేస్తామని ఘనంగా ప్రకటించింది. కానీ అమలులోకి వచ్చేసరికి దాన్ని కేవలం శ్రీకాకుళం జిల్లాకు మాత్రమే పరిమితం చేసి మిగిలిన జిల్లాల్లో వాయిదా వేసింది. ఏప్రిల్ నాటికి నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉంటాయని, అందరికీ పంపిణీ చేస్తామని మరోమారు ప్రకటించింది. తీరా ఇప్పుడు అదీ పూర్తిస్థాయిలో కాదని స్పష్టంచేసింది. ఏప్రిల్‌లో జిల్లాకు ఒక నియోజకవర్గంలో మాత్రమే ఈ విధానం అమలుచేయనున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏప్రిల్ నుంచి నాణ్యమైన బియ్యం పంపిణీని ప్రారంభించాలని శుక్రవారం నిర్వహించిన సమీక్షలో అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. మేలో 46, జూన్‌లో 70, జూలైలో 106 చొప్పున నియోజకవర్గాలు పెంచుకుంటూ వస్తారు. ఆగస్టు నాటికి మాత్రమే పూర్తిస్థాయిలో 175 నియోజకవర్గాల్లో అందరికీ నాణ్యమైన బియ్యం ప్యాకెట్లలో పంపిణీ చేయడం సాధ్యమవుతుందని నిర్ణయానికొచ్చారు. అందుబాటులో ఉన్న బియ్యంపై సీఎం ఆరా తీశారు. నాణ్యమైన బియ్యం సరఫరాకు 26.63లక్షల టన్నులు అవసరం కాగా, ఖరీఫ్, రబీ రెండు సీజన్లు కలిపి 28.74లక్షల టన్నులు అందుబాటులో ఉంటాయని అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. శ్రీకాకుళం, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, కడప జిల్లాల్లో సేకరించిన నాణ్యమైన బియ్యం నమూనాలను జగన్ పరిశీలించారు. వీటి పంపిణీకోసం 30చోట్ల 99ప్యాకింగ్ యూనిట్లు ఏర్పాటుచేస్తున్నట్లు అధికారులు వివరించారు. 41 పౌరసరఫరాల శాఖకు చెందినవని, 58 పీపీపీ విధానంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నెలకు 2వేల టన్నుల బియ్యాన్ని ప్యాకింగ్ చేసే సామర్థ్యం ఉంటుందని, అందుకు అవసరమైన సిబ్బం ది ఉన్నారన్నారు. పర్యావరణానికి ఇబ్బంది లేకుండా బియ్యాన్ని పంపిణీ చేస్తున్న సంచులు తిరిగి సేకరించాలని సీఎం సూచించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని, కమిషనర్ కోన శశిధర్ పాల్గొన్నారు.

### పరిటాలను చంపడానికి..

# బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు

- సప్లై చేసింది జగనే!
- ఆయన తరఫున వేరే వ్యక్తి జైల్లో!!
- తండ్రి వల్లే సీబీఐ నుంచి బయటపడ్డాడు
- వివేకా హత్యపై సీబీఐ దర్యాప్తు జరిపించరేం?
- మాజీ ఎంపీ హర్షకుమార్ ధ్వజం



రాజమహేంద్రవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్ వైఖరంతా పగ, ప్రతీకారమే. పరిటాల రవి హత్య కేసులో ఆయనే నిందితులకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు సప్లై చేశారు. ఇవాళ జగన్ తరఫున కొండారెడ్డి అనే వ్యక్తి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు' అని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ వెల్లడించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మొన్న జనవరి 26న ఖైదీలను విడుదల చేస్తూ జీవో ఇస్తాడని కొండారెడ్డి కూడా ఎదురు చూశాడని చెప్పారు. జీవో రాకపోవడంతో.. 'ఇదేంటన్నా జగన్ కోసం నేను జైలుకు వస్తే నన్ను విడుదల చేయడానికి జీవో ఇవ్వలేదేమిటన్నా' అని బాధపడ్డాడని చెప్పారు. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉండడం వల్లే సీబీఐ నుంచి జగన్ బయటపడ్డాడని ఆరోపించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయనకు ప్రమేయం లేకపోతే.. సీఎం అయి ఇన్ని నెలలైనా ఎందుకు నిందితులను అరెస్టు చేయలేదని నిలదీశారు. 'ప్రజా వేదికను ఏకంగా ధ్వంసం చేసేశాడు. ఫ్యాక్షనిస్టులకు, శాడిస్టులకు ధ్వంసమే సంతృప్తి. అప్పట్లో హైదరాబాద్‌లో 10 ఏళ్లు ఉండకుండా చంద్రబాబు కూడా తప్పు చేశారు. కానీ తర్వాత అమరావతిని అభివృద్ధి దిశగా నడిపారు. ఇవాళ జగన్ రాజధానిని వైజాగ్‌కు తరలించే ప్రయత్నం చేస్తున్నాడు. వైజాగ్ అద్భుత నగరం. రాజధానిని అక్కడకు తరలించి ఆ నగరం ఔన్నత్యాన్ని దెబ్బకొట్టొద్దు' అని హితవుపలికారు.

### నాపై కక్షగట్టి జైల్లో పెట్టారు..

'నాపై కక్షగట్టి నన్ను మానసికంగా వేధించేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఏ తప్పూ చేయకుండా 48 రోజులు జైలులో పెట్టింది. అనేక ఏళ్ల నుంచి రాజమహేంద్రవరం కోర్టు ఆవరణలో హోటల్ నడుపుకుంటూ బతుకుతున్న ఓ పేదవాడి కొట్టును ధ్వంసం చేస్తుంటే అండగా నిలిచాను. నాపై కేసులు బనాయించారు. కచ్చులూరు బోటు ప్రమాదంలో బాధితుల తరఫున పోరాడాను. ఒక బాధితురాలు మంత్రి అవంతి శ్రీనివాస్‌కు కూడా బోటు ఉందని తనకు ఆయనే చెప్పారని చెప్పడంతో సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం వేశాను. ఇక్కడ పోర్టు అధికారి కలెక్టర్‌కు స్నేహితుడు. ప్రస్తుత కలెక్టర్.. జగన్ అక్రమాస్తుల కేసుల నిందితుల్లో ఒకరు. ఈ నేపథ్యంలో పోర్టు అధికారిని కాపాడడానికి చేసే ప్రయత్నాలను అడ్డుకున్నాను. అవంతి శ్రీనివాస్ విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామికి సన్నిహితుడు. స్వరూపానంద ఒత్తిడి వల్ల సీఎం ఎవరిమీదా చర్యలు తీసుకోలేదు. టీడీపీ ఎంపీగా ఉన్న అవంతిని కేవలం స్వరూపానంద సలహా మేరకే వైసీపీలో చేర్చుకుని ఎమ్మెల్యే సీటు ఇవ్వడం పాటు మంత్రి పదవీ ఇచ్చారు. అదే సమయంలో అమలాపురం ఎంపీగా ఉన్న పండుల రవీంద్ర జగన్‌కు మద్దతుగా రాజీనామా చేస్తే సీటు ఇవ్వలేదు. వీటిని ప్రశ్నించాను. ఇవన్నీ మనసులో పెట్టుకుని జగన్ నన్ను మానసికంగా హింసించాడు' అని విమర్శించారు.

# కృష్ణకిశోర్‌కు జీతమివ్వరా?

- ఇలాగైతే సీఎస్‌నే పిలిపిస్తాం.. జగన్ సర్కారుపై 'క్యాట్' ఫైర్

హైదరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇన్‌కంట్యాక్స్ కమిషనర్, ఏపీ ఆర్థిక మండలి(ఈడీబీ) సీఈవో జాస్తి కృష్ణకిశోర్‌కు పెండింగ్ వేతనాలను రెండు వారాల్లో ఇవ్వాలంటూ తామిచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని జగన్ ప్రభుత్వాన్ని కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) నిలదీసింది. గతనెల 24న తానిచ్చిన ఆదేశాల అమలులో ఎందుకు జాప్యం జరిగిందని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తూ, క్యాట్ చైర్మన్ జస్టిస్ లింగాల నరసింహారెడ్డి, సభ్యులు బీవీ సుధాకర్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. తనను సస్పెండ్ చేయడంతోపాటు ఏసీబీ/సీఐడీ దర్యాప్తునకు ఆదేశిస్తూ జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కృష్ణకిశోర్ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం మరోసారి విచారించింది. కోర్టు ప్రారంభ సమయంలో ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కృష్ణకిశోర్ తరఫు న్యాయవాది నీరజ్ మల్హోత్రా కోరారు. 2వారాల్లో పెండింగ్ వేతనాలు ఇవ్వాలని గత రూలింగ్ సందర్భంగా ఆదేశించినా...ఇప్పటికీ అమలు చేయలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ధర్మాసనం....వేతనాలు ఇవ్వకపోతే సీఎస్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిస్తామని స్పష్టం చేసింది. విచారణను అదేరోజు మధ్యాహ్నానికి వాయిదా వేసింది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా... పెండింగ్ వేతనాలను చెల్లించామని ప్రకాశ్‌రెడ్డి ధర్మాసనానికి నివేదించారు. "ఆరు వారాలుగా మా ఆదేశాలను అమలు చేయలేదు. ఇందుకు బాధ్యతవహిస్తూ సీఎస్ వ్యక్తిగత హాజరునకు ఆదేశిస్తామని హెచ్చరించగానే ప్రభుత్వం రెండు గంటల్లో వేతనాలను చెల్లించడం సాధ్యమైంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### ఎందుకు రిలీవ్ చేయరు? సర్కారును ప్రశ్నించిన ధర్మాసనం

కృష్ణకిశోర్ డిప్యుటేషన్‌ను రద్దుచేసి మాతృసంస్థ ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు తిరిగి వెళ్లేందుకు (రీప్యాట్రియేషన్) అనుమతి ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది నీరజ్ మల్హోత్రా కోరారు. ఇప్పటికే ఆయనకు ప్రిన్సిపల్ కమిషనర్(ఇన్‌కంట్యాక్స్)గా పదోన్నతి వచ్చిందని, ఆయన బ్యాచ్‌కుచెందిన అధికారులంతా విధుల్లో చేరిపోయారని వివరించారు. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు ఏపీ ప్రభుత్వం గురువారం తనను నియమించుకుందని, ఈ కేసుకు సంబంధించిన వివరాలను పరిశీలించేందుకు కొంత గడువు కావాలని, తదుపరి విచారణను వారం రోజులపాటు వాయిదా వేయాలని ఈ సమయంలో దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి కోరారు. ఇందుకు నీరజ్ మల్హోత్రా అభ్యంతరపెట్టారు. "ఐదు వారాల క్రితం ధర్మాసనం ఆదేశాలు ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించినా కేసు విచారణకు వచ్చే ఒకరోజుముందు సీనియర్ న్యాయవాదిని ఏపీ ప్రభుత్వం నియమించింది. దీన్నిబట్టి చేస్తే.. ఇదంతా కేసు విచారణను జాప్యం చేయడానికేననేది తేలిపోతోంది" అని విమర్శించారు. డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారి మాతృసంస్థకు తిరిగి పంపించాలని కోరినా ఇక్కడే ఉండాలంటూ...ఎటువంటి పని లేకుండా ఖాళీగా కూర్చోబెట్టడం సరికాదని ఈ సమయంలో ధర్మాసనం వ్యాఖ్యానించింది. పదోన్నతి వచ్చిన తర్వాత వెంటనే ఆ పోస్టులో చేరాలని, లేకపోతే సీనియారిటీ కోల్పోయే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో కృష్ణకిశోర్‌ను తిరిగి పంపడానికి అభ్యంతరం ఏంటని ప్రకాశ్‌రెడ్డిని ప్రశ్నించింది. ఈ కేసుకు సంబంధించి తన దగ్గర వివరాలేమీ లేదని, పిటిషనర్‌పై ఏం ఆరోపణలు ఉన్నాయో కూడా తనకు తెలియదని, ఒక వారం గడువునిస్తే పూర్తి వివరాలతో వాదనలు వినిపిస్తానని ప్రకాశ్‌రెడ్డి నివేదించారు. ఈ మేరకు స్పందించిన ధర్మాసనం....పదోన్నతి వచ్చినా వెంటనే విధుల్లో చేరకపోతే సీనియారిటీ కోల్పోతారని, ప్రతి రోజూ కీలకమేనని పేర్కొంది. తదుపరి విచారణను ఈనెల 7కు వాయిదా వేసింది. ఇదిలాఉండగా కృష్ణకిశోర్‌పై ఏసీబీ/సీఐడీ దర్యాప్తును నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు ధర్మాసనం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## వాల్తేరు క్లబ్‌ను యథాతథంగా ఉంచాలి: గంటా



విశాఖపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వాల్తేరు క్లబ్‌ను ఖాళీ చేయించి, ఆ భూములను తీసుకుంటున్నారన్న ప్రచారంపై మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు స్పందించారు. "వాల్తేరు క్లబ్ విషయంలో ప్రభుత్వం సానుకూల ఆలోచనాదృక్పథం అవలంబిస్తే మంచిది. వైజాగ్ ప్రాచీన నామం అయిన వాల్తేరు పేరుతో 1883లో ప్రారంభం అయినప్పటి నుంచీ ఈ క్లబ్ వైజాగ్ ప్రజల జీవన విధానంలో మమేకమైంది. వైజాగ్ బ్రాండ్‌లో భాగమైంది. ఈ సున్నితత్వాన్ని, ప్రజల భావోద్వేగాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం దీనిని యథాతథంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటే... వైజాగ్‌లో మంచి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది" అని గంటా ట్వీట్ చేశారు.

## జగన్, జాస్తి కలయికపై ఎన్నో అనుమానాలు

▸▸ ఈ కలయిక సమాజానికి ఇచ్చే సందేశమేంటి?: వర్ల



మంగళగిరి, జనవరి 31: పదకొండు సీబీఐ కేసులు, మరో అయిదు ఈడీ కేసుల్లో ప్రధాన నిందితుడిగా వుండి... నేడో రేపో కీలక విచారణను ఎదుర్కొంటున్న రాష్ట్ర సీఎం జగన్మోహన్‌రెడ్డిని విశ్రాంత సుప్రీంకోర్టు జడ్జి జాస్తి చలమేశ్వర్ కలవడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా విశ్రాంత జడ్జీలు ఎవరినైనా కలవొచ్చు, తప్పులేదు. సీఎంలను సైతం కలవొచ్చు. కానీ, ఏపీ ముఖ్యమంత్రి విషయంలో మాత్రం అది సరికాదు" అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అభ్యంతరాలను వ్యక్తం చేశారు. జగన్‌ను కలవాల్సిన అవసరం జస్టిస్ చలమేశ్వర్‌కు ఉండబోదని, అయితే ఆయన గత అనుభవం, గత హోదాలు జగన్‌కు ఎంతోకొంత లాభించే అవకాశాలు ఉన్నాయని రామయ్య తన అనుమానాలను వెలిబుచ్చారు. వారి కలయిక సమాజానికి ఇచ్చే సందేశం ఏమిటని ప్రశ్నించారు.

## 8 నెలల్లో గడ్డి పీకారా!

▸▸ భోగాపురంపై విచారణకు సిద్ధం.. విజయసాయికి బుద్దా సవాల్



అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎయిర్‌పోర్టు పరిధిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందంటూ వైసీపీ చేస్తున్న విమర్శలపై టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న శుక్రవారం ట్విటర్‌లో స్పందించారు. "భోగాపురం ఎయిర్ పోర్టు పరిధిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని చేతగాని దద్దమ్మ మాటలు ఎందుకు? ఎంపీ విజయ సాయి రెడ్డిగారూ. జగన్ అధికారంలో ఉన్నారు అని మీరే నమ్మలేకపోతున్నట్టు కనిపిస్తుంది. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగినప్పుడు 8 నెలల్లో గడ్డి పీకారా? అయినా ఫర్వాలేదు. భోగాపురంలో ట్రేడింగ్‌పై మేము విచారణకు సిద్ధం. ఈ 8 నెలల కాలంలో జగన్, మీరూ.. విశాఖ నుంచి భోగాపురం వరకూ చేసిన ల్యాండ్ మాఫియాపై విచారణకి సిద్ధమా?" అని విజయసాయిరెడ్డికి, బుద్దా సవాల్ విసిరారు.

## చైర్మన్ ఆదేశాలు పాటించకుంటే సభా ధిక్కరణే

▸▸ మండలినీ భ్రష్టుపట్టిస్తారా?: యనమల



అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): "శాసనమండలి చైర్మన్ ఆదేశాలను అధికారులు పాటించకపోతే సభా ధిక్కరణ కిందకు వస్తుంది. అలాంటిది చైర్మన్ ఆదేశాలు పాటిస్తే సెక్రటరీకి శిక్ష పడుతుందని రాష్ట్ర మంత్రి పేర్కొనడం ఒక రకంగా కార్యదర్శిని బెదిరించడమే" అని మండలిలో విపక్ష నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. అధికారుల విధి నిర్వహణను ప్రభావితం చేసేలా మంత్రులు వ్యాఖ్యానించడాన్ని గర్హిస్తున్నామన్నారు. "కౌన్సిల్ రద్దు నిర్ణయం సీఎం జగన్ మరో సెల్ఫ్‌గోల్. క్రికెట్ ఆడడం చేతగాక స్టంపుల కేసి కొట్టుకున్నట్లే... పరిపాలన చేతగాకే సీఎం జగన్ మండలిని రద్దు చేశారు. హిట్ అవుట్ అయ్యారు" అని వ్యాఖ్యానించారు.

## నాడు ప్రగల్భాలు.. నేడు ధరల భారాలు: అనిత



అమరావతి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): "ఒక వైపు సంక్షేమ పథకాల అమలులో కోత విధిస్తున్నారు. మరో వైపు నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ పోతున్నారు. వైసీపీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరుస్తోంది" అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత విమర్శించారు. శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. తాను అధికారంలోకి వస్తే పించన్ రూ.3 వేలు చేస్తానని ప్రగల్భాలు పలికిన జగన్ ఇప్పుడు రకరకాల నిబంధనలతో ఇప్పటికి 7 లక్షల అర్హుల పించన్లు తొలగించిందని ఆరోపించారు. ప్రజలపై ధరల భారం మోపే విధానాలకు జగన్ ప్రభుత్వం స్వస్తి చెప్పకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు.

## వికేంద్రీకరణ అభివృద్ధిలో... రాజధానుల్లో కాదు

▸▸ మీడియా గొంతునొక్కడాన్ని ఖండిస్తున్నా: బాలకృష్ణ



హిందూపురం, జనవరి 31: "ఒక రాష్ట్రం ఒకే రాజధానితోనే అభివృద్ధి సాధ్యం. మూడు రాజధానుల పేరుతో వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు పాలన సాగిస్తోంది. ప్రజలు తిరగబడే రోజొస్తుంది. వికేంద్రీకరణ అభివృద్ధిలో జరగాలని రాజధానులతో కాదు" అని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. దేశంలో ఆర్థిక రాజధాని ముంబాయి లాగే ఏపీలో ఆర్థిక రాజధాని విశాఖ అని అన్నారు. దేశానికి ఢిల్లీ రాజధానిగా ఉన్నట్లే అమరావతి ఏపీకి రాజధానిగా ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. తండ్రి వైఎస్ఆర్ ఆశయాలను నెరవేరుస్తానని అధికారంలోకి వచ్చిన తనయుడు జగన్.. శాసన మండలిని రద్దు చేసి తండ్రి ఆశయాలను నీరుగార్చారన్నారు. మండలి చైర్మన్ షరీఫ్‌పై మంత్రులు ఉపయోగించిన భాష, తీరు బాధాకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు వినిపించేది మీడియా అని అలాంటి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్ గొంతు నొక్కడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

## మూడుకు కాంగ్రెస్ వ్యతిరేకం: శైలజానాథ్



విజయవాడ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మూడు రాజధానులకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకమని ఏపీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ స్పష్టం చేశారు. అమరావతినే రాజధానిగా కొనసాగాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు నిధులిచ్చి అభివృద్ధి చేయాలని కోరారు. రాజధాని కోసం అమరావతి పరిరక్షణ సమితి చేపట్టిన ఉద్యమంలో పాల్గొని పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. శైలజానాథ్, ఆ పార్టీ నాయకుడు తులసిరెడ్డిలను జేఏసీ సభ్యులు ఎ.శివారెడ్డి, గద్దె తిరుపతిరావు, ఆర్.వి.స్వామి తదితరులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఫిబ్రవరి 1న రాజధాని రైతులతో కలిసి ఢిల్లీ వెళ్లి ప్రధాని, రాష్ట్రపతిని కలిసి అమరావతిని పరిరక్షించాలని కోరతామని జేఏసీ నేతలు తెలిపారు.

## కృత్రిమ ఉద్యమాల గురించి మాట్లాడను:స్పీకర్



ఎన్ఏడీ జంక్షన్ (విశాఖపట్నం), జనవరి 31: శాసన మండలి రద్దు తీర్మానాన్ని కేంద్రానికి పంపించాం. ప్రొసీజర్ ప్రకారమే అన్నీ జరుగుతాయి" అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారామ్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, అన్నీ చట్టం ప్రకారమే జరుగుతాయన్నారు. గతంలో ఎన్టీఆర్ సీఎంగా వున్న సమయంలో కూడా మండలి రద్దు జరిగిందన్నారు. శాసన మండలికి సంబంధించి ఇతర రాష్ట్రాల తీర్మానాలు పెండింగ్‌లో వున్నా అన్నీ ముందుకు వెళతాయని అన్నారు. రాజధాని రైతులకు ఇతర రాష్ట్రాల రైతులు మద్దతు ప్రకటించడం గురించి ప్రస్తావించగా ఆర్టిఫీషియల్ ఉద్యమాల గురించి తాను మాట్లాడబోనని సమాధానమిచ్చారు. నిజంగా ప్రజా ఉద్యమం జరిగితే అందరం మద్దతు ఇద్దామని అన్నారు.

## అమరావతిలో భూసేకరణ పేరుతో దందా

▸▸ విశాఖకు తుఫానులొస్తే.. అమరావతికి వరదలు: మంత్రి ధర్మాన

శ్రీకాకుళం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): "అమరావతిలో చంద్రబాబు భూసేకరణ పేరుతో భూ దందాకు పాల్పడ్డారు. తన వాళ్లను చుట్టూ చేర్చుకొని అక్రమాలకు పాల్పడ్డారు" అని మంత్రి ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. అమరావతి చుట్టుపక్కల గ్రామాల్లో చంద్రబాబు తన సన్నిహితులందరితో భూములు కొనిపించారని విమర్శించారు. అమరావతిలో మేము భూములు కొనకూడదా? అని ప్రశ్నిస్తున్న టీడీపీ నాయకులు.. అమరావతి చుట్టుపక్కల గ్రామాల్లోనే ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన టీడీపీ నేతల మాటల్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. విశాఖలో తుఫాన్‌లు వస్తాయని అంటున్న టీడీపీ నాయకులు అమరావతికి వరదలు వస్తే మునిగిపోతుందని గుర్తించాలని ధర్మాన అన్నారు.

# 'రాయ'బార రహస్యం?

## రైతులతో సయోధ్యకా... అయోమయం సృష్టించేందుకా?

▸▸ జస్టిస్ జాస్తితో కలిసి జగన్‌తో భేటీ

▸▸ మరుసటి రోజే రాజధానికి ఎంపీ శ్రీకృష్ణ

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎడారి, శ్మశానం, మునిగిపోయే ప్రాంతం, పెయిడ్ ఆర్టిస్టులు... అమరావతి గురించి, అమరావతి రైతుల గురించి ఇప్పటిదాకా వైసీపీ నేతలు, పలువురు మంత్రులు చేసిన వ్యాఖ్యలివి! ఇప్పుడు అనూహ్యంగా అధికార పార్టీకి చెందిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నేరుగా రైతుల దీక్షా శిబిరానికే రావడం, వారిపై సానుభూతి ప్రదర్శించడం, పట్టువిడుపులు ప్రదర్శించి ప్రభుత్వం 'ఏర్పాటు చేసే' కమిటీతో చర్చకు రావాలని సూచించడం చర్చనీయాంశంగా మారింది. దీనికి వెనుక మతలబు ఏమిటి? రాజధాని రైతులను చల్లబరిచి, ప్రభుత్వ వ్యతిరేకతను తగ్గించుకునేందుకే ఈ కృష్ణదేవ'రాయ'బారమా? లేక... పట్టువదలకుండా పోరాడుతున్న రైతుల్లో గందరగోళం సృష్టించి, చీలిక తెచ్చే ప్రయత్నాలేవైనా జరుగుతున్నాయా? అదీ కాకపోతే... పార్లమెంటులో ఈ అంశం చర్చకు వచ్చినప్పుడు, 'మేం రైతుల ఆందోళనల గురించి తెలుసుకున్నాం. మా ఎంపీ స్వయంగా అక్కడికి వెళ్లి మాట్లాడారు' అని చెప్పేందుకే ఇలా వచ్చారా? ఇలా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటిదాకా వైసీపీ నేతలు రాజధాని ప్రాంత రైతులపై కనీస సానుభూతి కూడా ప్రదర్శించలేదు. పైగా... పుండు మీద కారం చల్లినట్లు రకరకాల వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ఇక... ఆందోళనలపై పోలీసుల ఉక్కుపాదం సరేసరి! అయినప్పటికీ... రాజధాని రైతులు అంగుళం కూడా వెనక్కి తగ్గకుండా ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను ప్రభుత్వం తరఫున సయోధ్య కోసం పంపించినట్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం జగన్‌తో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ భేటీ అయ్యారు. ఆయనతోపాటు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కూడా జగన్‌ను కలిశారు. ఆ మరుసటి రోజే ఆయన రాజధాని ప్రాంతానికి రావడం విశేషం. మరోవైపు... ఇతర వైసీపీ నేతల వైఖరి ఎలా ఉన్నప్పటికీ శ్రీకృష్ణ దేవరాయలు తొలి నుంచి కూడా రైతుల పక్షానే మాట్లాడుతున్నారు. అందువల్లే ఆయన నేరుగా శిబిరానికి వచ్చినా రైతులు వ్యతిరేకత ప్రదర్శించలేదు. ఆయన చెప్పిన మాటలన్నీ విన్నారు. ఈ 'రాయ'బారం వెనుక రహస్యం ఏమిటోకానీ... తాను మాత్రం వ్యక్తిగతంగానే రైతులకు సంఘీభావం తెలుపుతున్నట్లు ఎంపీ చెప్పారు. తమ కళాశాలల్లో చదువుతున్న ఎందరో పిల్లల తల్లిదండ్రులు ఉద్యమంలో పాల్గొంటూ ఆరోగ్యం పాడు చేసుకుంటున్న విషయం తెలిసి వారిని ఓదార్చేందుకు వచ్చినట్లు తెలిపారు. అయితే, వ్యక్తిగత హోదాలో వచ్చినప్పుడు... ప్రభుత్వం తరఫున అంత స్పష్టమైన హామీలు ఎలా ఇచ్చారనే ప్రశ్న తలెత్తుతోంది.




వెలగపూడి రైతుల దీక్షా శిబిరంలో కూర్చున్న వైసీపీ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

## చర్చలకు ప్రభుత్వం సిద్ధం

### సీఎం జగన్ రైతు పక్షపాతి

▸▸ మీకు న్యాయం చేశాకే ముందుకు.. రాజధాని రైతులతో వైసీపీ ఎంపీ లావు

▸▸ మందడం, వెలగపూడి శిబిరాల సందర్శన

▸▸ అమరావతికి అనుకూలమో కాదో చెప్పండి.. ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్

గుంటూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంత రైతులతో చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని... చర్చలకు పిలిచినప్పుడు వారు వచ్చి అభిప్రాయాలు చెప్పాలని వైసీపీ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని 44 రోజులుగా ఆందోళన చేస్తున్న రైతులకు శుక్రవారం ఆయన సంఘీభావం తెలిపారు. మందడం, వెలగపూడి దీక్షా శిబిరాలను సందర్శించారు. భూములిచ్చిన రైతులకు న్యాయం జరగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. సమస్యను సానుకూలంగా పరిష్కరించుకుందామని తెలిపారు. 'మీరు వ్యాపారాలు చేస్తే వచ్చిన ఆస్తులు కావు. తరతరాలుగా వంశపారంపార్యంగా వచ్చిన భూములవి. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో భావోద్వేగం ఉంటుంది. సీఎం జగన్ రైతుల పక్షపాతి. మీకు న్యాయం చేసిన తర్వాతే ముందుకు వెళ్తారు. అందరూ సహకరించినందువల్లే వైసీపీకి 151 సీట్లు వచ్చాయి. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తారు. రైతులకు న్యాయం జరిగే ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కావాలి. మీరు ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి' అని రైతులకు సూచించారు. అమరావతని కొనసాగిస్తూ తమతో చర్చలకు రావాలని వైసీపీ ఎంపీకి మందడం రైతులు తేల్చిచెప్పారు. అలాగే మీరు రాజధానికి అనుకూలమో కాదో ముందు చెప్పాలని నినాదాలు చేశారు. రైతు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని జేఏసీ నేతలు ఆయన్ను కోరారు. మందడం, వెలగపూడిలో ఎంపీ ప్రసంగాన్ని తుళ్లూరు దీక్షా శిబిరంలో స్ర్కీన్ మీద వేసి చూపించారు. అనంతరం ఆయన తుళ్లూరు వస్తారని తెలిసి మహిళలు, రైతులు ఆయన జై అమరావతి అంటేనే మాట్లాడిద్దాం.. లేకుంటే లేదని తీర్మానించుకున్నారు. సమయం సాయంత్రం ఐదు గంటలు దాటినా ఆయన రాకపోవడంతో.. ఎవరి కోసమూ ఎదురు చూడాల్సిన పనిలేదని మహిళలు శిబిరం ఖాళీ చేసి వెళ్లి పోయారు. ఎంపీ కూడా వెలగపూడి నుంచి వెనుదిరిగారు.

## రైతుల పక్షపాతి.. పోలీసులతో కొట్టిస్తారా?

▸▸ అమరావతి జేఏసీ నేత ప్రశ్న

విజయవాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మందడం, వెలగపూడి వెళ్లి రైతులకు సంఘీభావం తెలపడంపై అమరావతి పరిరక్షణ సమితి (జేఏసీ) కో-కన్వీనర్ గద్దె తిరుపతిరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతుల వద్దకు వ్యక్తిగతంగా వచ్చారా.. ప్రభుత్వ దూతగా వచ్చారా అని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఎంపీకి పలు ప్రశ్నలు సంధించారు. 'ముఖ్యమంత్రి జగన్ రైతుల పక్షపాతి అని చెబుతున్నారు. అదే నిజమైతే పోలీసులతో ఆడవారిని, రాజధాని కోసం భూములిచ్చిన రైతుల్ని కొట్టిస్తారా? అర్ధరాత్రి ఇళ్లలోకి వెళ్లి రైతులను దొంగల్లా అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లలో పెడతారా? ఒక మంత్రి రాజధాని ప్రాంతాన్ని శ్మశానమన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ ఎడారితో పోల్చారు. మంత్రి పెద్దిరెడ్డి 3 కాదు.. 30 రాజధానులు పెడతామన్నారు. ఇలాంటి మాటలతో రైతులను మనోవేదనకు గురిచేశారు. వైసీపీ గుంటూరు పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్తగానే రాజధాని రైతుల వద్దకు వచ్చానని ఎంపీ చెప్పారు. అంతేతప్ప మూడు రాజధానులకు వ్యతిరేకమని గానీ, అమరావతిలోనే రాజధాని ఉండాలని గానీ ఆయన కోరుకోవడం లేదు. వైసీపీ ప్రతినిధిగా వచ్చి మొసలి కన్నీరు కారుస్తూ రైతుల్లో విభేదాలు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారా? ప్రభుత్వం చర్చలకు పిలిస్తే తప్పనిసరిగా వెళ్లండని ఎంపీ రైతులకు సూచించారు. రాజధాని సమస్య కేవలం 29 గ్రామాల రైతులదేనా? రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజలకు సంబంధించినది కాదా? వారితో పాలకులు మాట్లాడరా? గతంలో జగన్ ప్రతిపక్ష నేతగా.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా.. ఇద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయాన్ని ఐదు కోట్ల మందీ అంగీకరించారా.. లేదా? పైగా రైతుల్ని ఎమోషనల్ కావద్దని ఎంపీ సూచించారు. రైతుల్ని ఘోరంగా మోసం చేసి.. అవమానించి.. శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టి.. ఆడవారు, పిల్లలని కూడా చూడకుండా.. కనీసం దేవాలయాలకు కూడా వెళ్లనివ్వని పరిస్థితులు కల్పించి.. ఈరోజు వచ్చి ఇలా మాట్లాడడం ధర్మమా? రాజధాని ప్రాంతంలో 30 మంది రైతులు చనిపోతే.. వైసీపీ తరఫున ఇంతవరకు ఒక్క నాయకుడు కూడా వెళ్లి పరామర్శించలేదు. గతంలో ఒక బస్సు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు చనిపోతే.. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ ఉదయం 6 గంటలకే వెళ్లి కలెక్టరు, అధికారులతో గొడవ పెట్టుకున్నారు. ఇప్పుడు రాజధాని ఉద్యమంలో పాల్గొంటున్న 30 మంది రైతులు తన ఇంటికి కూతవేటు దూరంలోనే చనిపోతే కనికరం కూడా లేదా? జగన్ అసెంబ్లీలో మూడు రాజధానుల గురించే చెప్పారు తప్ప ఇక్కడి ప్రజలకు ఏమీ చెప్పలేదు. ఇప్పుడు విశాఖ కాదు.. విజయనగరానికి రాజధానిని తరలిస్తారంటున్నారు. శ్రీకాకుళంలో స్పీకర్‌కు ఆస్తులున్నాయంటే రేపు రాజధానిని అక్కడకు మార్చేస్తారా' అని తిరుపతిరావు మండిపడ్డారు.



అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విజయవాడ కృష్ణలంకలో ప్రదర్శన

# తాడో పేడో తేల్చుకుంటాం

▸▸ రాజధానిపై ప్రకటన చేసేవరకు విశ్రమించం

▸▸ తేల్చిచెప్పిన అమరావతి రైతులు, మహిళలు

▸▸ పక్కరాష్ట్రం రైతులపై అక్రమ కేసులా: దేవినేని

▸▸ ఢిల్లీలో పోరుకు సిద్ధం కావాలి: సీపీఐ నేతలు

గుంటూరు, తుళ్లూరు, మంగళగిరి, తాడికొండ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రాజధాని వ్యవహారంలో తాడో పేడో తేలేవరకు ఉద్యమం ఆపేది లేదని అమరావతి ప్రాంత రైతులు, మహిళలు తేల్చిచెప్పారు. రాజధానిగా అమరావతిని కొనసాగించాలనే డిమాండ్‌తో చేపట్టిన ఆందోళనలు శుక్రవారం 45వ రోజుకు చేరుకున్నాయి. తుళ్లూరు, మందడం, వెలగపూడి, తాడికొండ అడ్డరోడ్డు, పెదపరిమి, కృష్ణాయపాలెం, గుంటూరు కలెక్టరేట్ ఎదురుగా నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. మందడం, వెలగపూడిలో రైతులు, రైతుకూలీలు, మహిళలు శుక్రవారం వరసగా రెండో రోజు గాంధేయ మార్గంలో సత్యాగ్రహ దీక్షలు కొనసాగించారు. 24గంటల నిరాహార దీక్షను మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజదానిని అమరావతిలోనే కొనసాగించేందుకు ఢిల్లీ స్థాయిలో ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మందడం, వెలగపూడి దీక్షా శిబిరాలను మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సందర్శించారు. రైతుల ఆందోళనలకు మద్దతు తెలిపేందుకు వచ్చిన పక్కరాష్ట్రం రైతులపై అక్రమ కేసులు పెట్టడమేంటని నిలదీశారు. ఇది 29 గ్రామాల సమస్య కాదని, ఉద్యమానికి ఐదుకోట్ల ఆంధ్రులు అండగా ఉన్నారని తెలిపారు. ఆయనతోపాటు టీడీపీ నేతలు ఎం.ధారునాయక్, గోనుగుంట్ల కోటేశ్వరరావు రైతులకు సంఘీభావం ప్రకటించారు. ఇక ఢిల్లీలో పోరుకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మందడం దీక్షా శిబిరంలో వారు ప్రసంగిస్తూ, అమరావతిపై బీజేపీ స్పష్టమైన వైఖరి వెల్లడించడం లేదన్నారు. సీఎం జగన్‌కు ప్రధాని మోదీ ఒక్క ఫోన్ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని, కానీ ఆ విధంగా చర్యలు లేవన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద విద్యార్థి జేఏసీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఏపీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, ఏఎన్‌యూ కన్వీనర్ ఆశీర్వాదం, నాగిరెడ్డి, నవీన్, నాని, నాగేశ్వరరావు, గణేశ్ తదితరులు పాల్గొన్నారు. రాజధాని అమరావతి నుంచే పారిపాలన జరగాలని కోరుతూ రాయపూడి మస్తాన్‌బాబా దర్గాలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. కాలేషాబాబాకు మహిళలు పొంగళ్లు సమర్పించారు. పెనుమాకలోని అక్బర్ మసీదులో ముస్లింలు ప్రత్యేకంగా దువా చేశారు.



తుళ్లూరు దీక్షా శిబిరంలో రైతుల నిరసన

## జగన్ నిర్ణయాలతో రాష్ట్రం వెనక్కు

▸▸ అఖిలపక్ష నేతల ధ్వజం



మందడంలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

జగన్ తీసుకున్న నిర్ణయాలతో అభివృద్ధిలో రాష్ట్రం రెండు దశాబ్దాలు వెనక్కు పోయిందని అఖిలపక్ష నేతలు ధ్వజమెత్తారు. రాజధాని తరలింపునకు నిరసనగా అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పొలిటికల్ జేఏసీ నాయకులు గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలేదీక్షలు 33వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను ప్రారంభించిన మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ జగన్‌ను తుగ్లక్‌గా అభివర్ణిస్తూ జాతీయ మీడియా కథనాలు రాయడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు సిగ్గుతో తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ వైజాగ్ టీడీపీ కార్యాలయంపై దాడులు, ఎమ్మెల్యే బాలకృష్ణను అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో సరైన విధానాలు కావన్నారు. సొంత సోదరికే నమ్మకం కలిగించలేని నాయకుడు ప్రజలకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వైసీసీ రంగుల పిచ్చికి రాష్ట్రం రూ.2,600కోట్లు నష్టపోయిందన్నారు. కాగా, అమరావతి నుంచి రాజధాని తరలిపోతుందనే బాధతో గుండెపోటుకు గురై గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దొండపాడు గ్రామానికి చెందిన రైతు నెలకుదిటి శ్రీనివాసరావును టీడీపీ నాయకులు నక్కా ఆనంద్‌బాబు, జీవీ అంజనేయులు, మన్నవ సుబ్బారావు, కసుకుర్తి హనుమంతరావు పరామర్శించారు. రైతుల వ్యథలు సీఎం జగన్‌కు పట్టకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు భూములు ఇచ్చినవారికి ఇలాంటి పరిస్థితి రావడం బాధాకరమన్నారు.

## ప్రశాంత విశాఖలో అశాంతా?

### క్లబ్బుల భూములకు ఎసరు.. ఖాళీ జాగాల కబ్జా

▸▸ ముడుపులివ్వని పరిశ్రమల తరిమివేత

▸▸ టీడీపీ ఆఫీసును ముట్టడిస్తారా?

▸▸ తుగ్లక్ అని అంటుంటే ఉక్రోషం!

▸▸ అందుకే ఈ దాడులు, దౌర్జన్యాలు

▸▸ 7 లక్షల పెన్షన్లు హాంఫట్: చంద్రబాబు



అమరావతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): 'విశాఖపట్నం ప్రశాంతతకు మారుపేరు. అక్కడ రౌడీలు కాగడాలు పట్టుకుని తిరగడమా? సభ్యత్వం ఇవ్వని క్లబ్బుల భూములకే ఎసరు పెట్టడం.. ముడుపులు-వాటాలు ఇవ్వని పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేయడం, ఖాళీగా ఉన్న భూములన్నీ కబ్జా చేయడం.. ఇదేనా మీరు ఉత్తరాంధ్రకు చేస్తున్న మేలు' అని సీఎం జగన్‌పై టీడీపీ అధినేత చంద్రబాబు విరుచుకుపడ్డారు. అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ పనిచేస్తే.. ఇప్పుడు వైసీపీ అధికార వికేంద్రీకరణ పేరిట ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతోందని శుక్రవారం ట్విటర్‌లో విమర్శించారు. జగన్‌ను అందరూ తుగ్లక్ అంటుంటే ఆ ఉక్రోషం పట్టలేకే దాడులు, దౌర్జన్యాలు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. 'హిందూపురంలో తెలుగుదేశం ఎమ్మెల్యే బాలకృష్ణ కాన్వాయ్‌పై దాడి, విశాఖ తెలుగుదేశం కార్యాలయాన్ని కాగడాలతో చుట్టుముట్టడం.. ఏమిటివన్నీ..? దేశంలోనే అతిపెద్ద విదేశీ పెట్టుబడితో వచ్చిన కియా కార్ల పరిశ్రమను, సౌర, పవన విద్యుత్ కంపెనీలను, గార్మెంట్ ఇండస్ట్రీస్‌ను ప్రోత్సహించిన మేం ద్రోహులమా..? కియా కార్ల అనుబంధ యూనిట్లను పుణేకు తరిమేసి వేలాది ఉద్యోగాలు పోగొట్టిన మీరు ద్రోహులా' అని నిలదీశారు. ఇంకా....

### .. మోసాలు మానలేదు!

'కేంద్రం ఇచ్చిన రూ.6వేలకు అదనంగా రూ.12,500లు ఇస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మోసం చేశారు. నిరుద్యోగ భృతిని రద్దుచేసి యువతను మోసం చేశారు. ఇన్ని మోసాలు చేయబట్టే ఇప్పటికే 12 చార్జిషీట్లలో 420 కేసును ఎదుర్కొంటున్నారు. అయినా ఇప్పటికీ మోసాలు చేయడం మానలేదు. పింఛన్ల అర్హత వయసు ఐదేళ్లు తగ్గిస్తే.. వాటి సంఖ్య పెరగాల్సింది పోయి తగ్గడం ఏంటి? ఏమిటీ జగన్మాయ? 7 లక్షల పింఛన్లు తీసేసి పండుటాకుల్ని మోసం చేస్తారా? 45 ఏళ్లకే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి ఏమార్చడం మోసం కాదా?'

### కంపెనీలు పరార్..

'ఇప్పటికే రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన పలు కంపెనీలు వెనక్కు వెళ్లిపోతున్నాయి. కొత్త పెట్టుబడులు ఆగిపోయి, ఉపాధికి గండికొట్టినట్లయింది. తెలుగుదేశం చేసిన అభివృద్ధినంతా రివర్స్ చేశారు. ఈ నేపథ్యంలో అమరావతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. లండన్, అమెరికా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాల్లో కూడా ప్రవాస తెలుగువారు అమరావతికి మద్దతుగా ర్యాలీలు జరపడం అభినందనీయం. ఎందుకంటే ఇది ఏ కొందరిదో, ఏ ఒక్క ప్రాంత సమస్యో కాదు. వైసీపీ ఆడుతున్న ఈ మూడుముక్కలాట మొత్తం రాష్ట్రాన్నే అతలాకుతలం చేస్తోంది.'

## జగన్ ఉత్తరాంధ్ర ద్రోహి: లోకేశ్

విశాఖను, ఉత్తరాంధ్రను దెబ్బతీసింది ముఖ్యమంత్రి జగనేనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ విమర్శించారు. ఆయన ఉత్తరాంధ్ర ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారని తెలిపారు. 'తల్లిని ఓడించారనే ద్వేషంతో ఉత్తరాంధ్ర నడ్డి విరిచేలా జీఎన్‌రావు కమిటీతో విశాఖపై విషం కక్కారు. తుఫాన్లు వస్తాయని, ఉప్పునీరు చొచ్చుకొస్తుందని, రక్షణ ఉండదని.. కుట్రపూరితంగా రిపోర్టు రాయించారు. ఆ చెత్త రిపోర్టు వల్ల ఎవరూ ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టడానికి ముందుకు రాకుండా చేశారు. ఉత్తరాంధ్రకు కంపెనీలు రాకుండా, పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు రాకుండా చేసి జీఎన్‌రావు కమిటీ రిపోర్ట్‌తో జగన్ దారుణంగా దెబ్బతీశారు' అని ట్విటర్‌లో ధ్వజమెత్తారు.

## సెమీస్‌లో భారత్ x పాక్

**అండర్-19 ప్రపంచకప్**

**బెనోని:** అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్స్‌లో భారత్ ప్రత్యర్థి ఎవరో తేలింది. శుక్రవారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో గెలిచిన పాక్ జట్టు భారత్‌తో పోరుకు సై అంటోంది. మంగళవారం జరిగే ఈ ఆసక్తికర మ్యాచ్ అభిమానులను ఆకట్టుకోనుంది. అంతకుముందు అఫ్ఘాన్ 49.1 ఓవర్లలో 189 పరుగులు చేయగా పాక్ 41.1 ఓవర్లలో 190/4 స్కోరుతో నెగ్గింది. అరంగేట్ర బ్యాట్స్‌మన్ మహ్మద్ హురైరా అర్ధసెంచరీ సాధించాడు.



# హర్మన్ గెలిపించెన్

**ముక్కోణపు టీ20 టోర్నీలో భారత్ బోణీ**

**కాన్‌బెర్రా:** ముక్కోణపు టీ20 టోర్నీలో భారత మహిళలు అద్భుత బోణీ కొట్టారు. ఇంగ్లండ్‌తో శుక్రవారం ఉత్కంఠభరితంగా జరిగిన మొదటి మ్యాచ్‌లో ఐదు వికెట్ల విజయం అందుకున్నారు. 148 పరుగుల లక్ష్య ఛేదనలో ఆఖరి ఓవర్లో ఆరు పరుగులు కావాల్సిన తరుణంలో కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (34 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 42నాటౌట్) భారీ సిక్సర్ కొట్టి జట్టును గెలిపించింది. అంతకుముందు ఇంగ్లండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 147 పరుగులు చేసింది. కెప్టెన్ హీథర్ నైట్ (44 బంతుల్లో 67) హాఫ్ సెంచరీ చేసింది. టామీ బ్యూమాంట్ (27 బంతుల్లో 37), స్కివెర్ (18 బంతుల్లో 20) పర్వాలేదనిపించారు. స్పిన్నర్లు రాజేశ్వరీ గైక్వాడ్ (2/19), దీప్తిశర్మ (2/30), మీడియం పేసర్ శిఖా పాండే (2/33) రెండేసి వికెట్లతో ప్రత్యర్థిని కట్టడి చేశారు. 59 పరుగులకే 4వికెట్లు కోల్పోయిన దశలో హీథర్‌నైట్, కీపర్ బ్యూమాంట్ ఆరో వికెట్‌కు 69 రన్స్‌తో పరిస్థితి చక్కదిద్దారు.

**హర్మన్ మెరుపులు:** భారత్ టాపార్డర్‌లో షఫాలీ వర్మ (30), స్మృతి మంధాన (15), జెమీమా రోడ్రిగ్స్ (26) చక్కగా ఆడినా.. ఆ ఇన్నింగ్‌ను ముందుకు తీసుకెళ్లలేకపోయారు. వేదా కృష్ణమూర్తి (7), తానియా భాటియా(11) ఎక్కువసేపు క్రీజులో నిలువలేదు. 18 బంతుల్లో 26 రన్స్ కావాల్సిన దశలో మ్యాచ్ ఇంగ్లండ్‌వైపు మొగ్గుచూపింది. కానీ దీప్తిశర్మ, కౌర్ ఒత్తిడి లేకుండా ఆడి జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడనుంది.

**సంక్షిప్తస్కోరు:** **ఇంగ్లండ్:** 20 ఓవర్లలో 147/7 (హీథర్ నైట్ 67, బ్యూమాంట్ 37, రాజేశ్వరీ గైక్వాడ్ 2/19, డీబీ శర్మ 2/30, శిఖా పాండే 2/33). **భారత్:** 19.3 ఓవర్లలో 150/5 (హర్మన్ ప్రీత్ నాటౌట్ 42, షఫాలీ వర్మ 30, జెమీమా రోడ్రిగ్స్ 26, బ్రంట్ 2/33).



# సింధుపై తైజు విజయం

**పీబీఎల్‌లో హైదరాబాద్‌కు బెంగుళూరు షాక్**

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ప్రపంచ రెండో ర్యాంకర్ తైజు యింగ్ (చైనీస్ తైపీ) చేతిలో భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు మరోసారి పరాభవం తప్పలేదు. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో భాగంగా గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం హైదరాబాద్ హంటర్స్-బెంగుళూరు రాప్టర్స్ మధ్య జరిగిన పోరులో బెంగుళూరు 3-0తో విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన సింధు-తైజు మ్యాచ్‌లో సింధు 15-11తో తొలి సెట్‌ను కైవసం చేసుకుంది. ఆ తర్వాత రెండు సెట్లను 13-15, 9-15తో కోల్పోయి ఓడింది. డబుల్స్‌లో పీఎస్ చాన్-సపుత్ర 2-1తో హైదరాబాద్ జోడీ లేన్-ఇవనోవ్‌పై నెగ్గింది. హైదరాబాద్ ట్రంప్ మ్యాచ్‌లో సౌరభ్ వర్మ 1-2తో లెవర్‌డెజ్ చేతిలో ఓడాడు. మిక్స్‌డ్‌లో ఇవనోవ్-సిక్కి జోడీ 2-0తో చాన్-వాన్ ద్వయంపై నెగ్గినా ఫలితం లేకపోయింది.

## రాణీ రాంపాల్‌కు పదోన్నతి

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ గేమ్స్ అథ్లెట్ ఆఫ్ ది ఇయర్' పురస్కారానికి ఎంపికైన భారత మహిళల హాకీ కెప్టెన్ రాణీ రాంపాల్‌కు కేంద్ర క్రీడాప్రాధికార సంస్థ (సాయ్) పదన్నోతి కల్పించింది. 2015లో సాయ్‌లో అసిస్టెంట్ కోచ్‌గా చేరిన రాణీకి ఇక కోచ్ (లెవెల్-10)గా ప్రమోషన్ ఇస్తున్నట్టు క్రీడల మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం ప్రకటించారు.

## జింబాబ్వే-శ్రీలంక రెండో టెస్ట్ డ్రా

**హరారే:** జింబాబ్వే-శ్రీలంక మధ్య రెండో టెస్ట్ డ్రాగా ముగిసింది. 361 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన లంక చివరిరోజు ఆట ఆఖరికి 204/3 స్కోరు చేసింది. కుశాల్ మెండిస్ (116 నాటౌట్) సెంచరీతో ఆదుకున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 241/7తో శుక్రవారం రెండోఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే మరో 6 పరుగులు జోడించి డిక్లేర్ చేసింది. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 406, లంక 293 రన్స్ చేశాయి. రెండు టెస్టుల సిరీస్‌ను లంక 1-0తో కైవసం చేసుకుంది.



'నెవర్ బిఫోర్.. ఎవర్ ఆఫ్టర్' అంటే ఇదేనేమో! అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక్కమ్యాచ్ టై కావడమే అరుదుగా చూస్తుంటాం.. అలాంటిది ఒకే సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్‌లూ సూపర్ ఓవర్‌కు దారితీస్తే..!! వావ్.. ఇది కదా అసలైన మజా అనిపించక మానదు. ఆ అద్భుతమే జరిగింది. ఎలాంటి సవాల్‌కైనా తాము సిద్ధమే అంటూ చేయాల్సిన 14 పరుగులను రాహుల్ తొలి రెండు బంతుల్లోనే 6,4గా బాది సునాయాసం చేసిన వేళ.. విజయం మళ్లీ భారత్‌నే వరించింది. పాపం.. న్యూజిలాండ్‌కు సూపర్ ఓవర్ మరోసారి వెక్కిరించింది.

**వరుసగా రెండో మ్యాచ్ టై**

వాస్తవానికి కివీస్ బౌలర్ల దూకుడుకు ఓ దశలో భారత్ స్కోరు 88/6. ఇలాంటి స్థితిలో మనీశ్ పాండే వీరోచిత ఆట పుణ్యమా అని భారత్ చివరకు 165 పరుగులు చేసింది. ఇక మన్రో, సీఫెర్ట్ అర్ధసెంచరీలతో ఈ స్కోరును కివీస్ ఛేదించడం ఖాయంగానే కనిపించింది. చివరి రెండు ఓవర్లలో 11 పరుగుల లక్ష్యం కాస్తా 6 బంతుల్లో 7 పరుగులకు చేరింది. చేతిలో ఏడు వికెట్లున్నాయి. క్రీజులో స్టీఫెన్‌తో పాటు టేలర్ ఉండడంతో భారత్ కూడా ఆశలు వదులుకుంది. కానీ ఇక్కడ శార్దూల్ ఠాకూర్ మ్యాజిక్ బంతులకు కివీస్ కకావికలమైంది. తీవ్ర ఒత్తిడిలోకి పడిపోతూ ఆరు బంతుల్లో ఐదు పరుగులే చేసి ఏకంగా నాలుగు వికెట్లు కోల్పోవడంతో ఇరు జట్ల స్కోర్లు సమమయ్యాయి.

# సూపర్ 2.0

**సూపర్ ఓవర్‌లో కోహ్లీసేన విజయం**

**నాలుగో టీ20లోనూ న్యూజిలాండ్‌కు పరాభవం**

విరాట్ విజయానందం



మనీశ్ పాండే (50 నాటౌట్)

**హామిల్టన్:** న్యూజిలాండ్‌ను మరోసారి అదృష్టం వెక్కిరించింది. సొంతగడ్డపై ఆడుతున్నా గెలవాల్సిన మ్యాచ్‌ల్లోనూ తత్తరపాటుకు లోనవుతూ మూల్యం చెల్లించుకుంటోంది. దీంతో వరుసగా రెండోసారి జరిగిన సూపర్ ఓవర్‌లోనూ భారత్ విజయం సాధించి ఆధిక్యాన్ని 4-0కు పెంచుకుంది. అంతకుముందు టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో దాదాపు అంతా విఫలమైనా మనీశ్ పాండే (36 బంతుల్లో 3 ఫోర్లతో 50 నాటౌట్) ఒక్కడు ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. దీంతో 20 ఓవర్లలో 8 వికెట్లకు 165 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (39) ఫర్వాలేదనిపించాడు. సోధీకి 3, బెన్నెట్‌కు 2 వికెట్లు దక్కాయి. ఆతర్వాత కివీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 165 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయింది. మన్రో (47 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 64), సీఫెర్ట్ (39 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 57) అర్ధసెంచరీలతో రాణించారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ శార్దూల్ ఠాకూర్‌కు రెండు వికెట్లు దక్కాయి. సిరీస్‌లో ఆఖరిదైన ఐదో టీ20 ఆదివారం జరుగుతుంది.

**సూపర్ ఓవర్‌లో సునాయాసంగా:** సూపర్ ఓవర్‌లో కివీస్ 13 పరుగులు చేసింది. సీఫెర్ట్ తొలి మూడు బంతుల్లో 8 రన్స్ చేసినా రెండుసార్లు క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్నాడు. అయితే నాలుగో బంతికి డీప్ పాయింట్‌లో సుందర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత మన్రో 2 బంతుల్లో 6 రన్స్ చేశాడు. ఇక భారత్ నుంచి కోహ్లీతో బరిలోకి దిగిన రాహుల్ తొలిబంతినే లెగ్‌సైడ్‌లో సిక్సర్ బాదగా రెండో బంతిని షార్ట్ ఫైన్‌లెగ్‌లో ఫోర్‌గా మలిచి 10 రన్స్ రాబట్టాడు. మూడో బంతికి అతడు వెనుదిరిగినా కోహ్లీ నాలుగో బంతికి 2 రన్స్, ఐదో బంతికి ఫోర్ బాది జట్టును గెలిపించాడు.

**మన్రో, సీఫెర్ట్ పోరాడినా..:** బ్యాటింగ్ ట్రాక్‌పై 165 పరుగుల ఛేదన కష్టతరం కాకపోయినా కివీస్.. ఓపెనర్ మార్టిన్ గప్టిల్ (4) వికెట్‌ను ఆరంభంలోనే కోల్పోయింది. ఈదశలో మన్రో, సీఫెర్ట్ ధాటిగా ఆడి రెండో వికెట్‌కు 74 రన్స్ జోడించారు. 38 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన మన్రోను కోహ్లీ అద్భుత త్రోతో రనౌట్ చేశాడు. ఆ వెంటనే టామ్ బ్రూస్ డకౌటయ్యాడు. కానీ టేలర్ (24)తో కలిసిన సీఫెర్ట్ జట్టు స్కోరును 18వ ఓవర్‌లో 150కి చేర్చాడు. 32 బంతుల్లోనే అతడు హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మూడు ఓవర్లలో 18 రన్స్ అవసరమైన స్థితిలో భారత బౌలర్ల కట్టడికి కివీస్ తడబాటు ఆరంభమైంది.

**ఈసారి ఠాకూర్ మ్యాజిక్:** ఆఖరి ఓవర్‌లో 7 రన్స్ అవసరమవడంతో విజయం కివీస్‌దే అనుకున్నారంతా. కానీ ఈసారి షమి లేకపోవడంతో బంతి తీసుకున్న శార్దూల్ ఠాకూర్ మాయ చేశాడు. తొలిబంతికే రాస్ టేలర్‌ను పడగొట్టాడు. బాగా ఎత్తులో వచ్చిన బంతిని అయ్యర్ అద్భుతంగా పట్టేశాడు. రెండోబంతిని మిచెల్, మిడాఫ్‌లో ఫోర్ బాదగా, మూడో బంతికి లేని పరుగు కోసం యత్నించి సీఫెర్ట్ రనౌట్‌గా వెనుదిరగడంతో భారత్ గెలుపుపై ఆశలు రేగాయి. ఆతర్వాత శాంట్నర్ సింగిల్ తీయగా, నకుల్ బంతికి మిచెల్ (4) వెనుదిరిగాడు. చివరి బంతికి 2 రన్స్ అవసరమైన దశలో సింగిల్ వచ్చినా మరో రన్ కోసం పరిగెత్తి శాంట్నర్ రనౌటవడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది.

**పాండే నిలబెట్టాడు:** అంతకుముందు రోహిత్ విశ్రాంతి కారణంగా రాహుల్‌తో కలిసి సంజూ శాంసన్ (8) ఇన్నింగ్స్ ఆరంభించాడు. అయితే ఈసారీ అవకాశాన్ని అతడు సొమ్ము చేసుకోలేకపోయాడు. సంజూతో పాటు కోహ్లీ (11), అయ్యర్ (1), దూబే (12) వెంటవెంటనే అవుటవడంతో భారత్ 150 స్కోరైనా చేస్తుందా అనే సందేహం కలిగింది. అయితే తొమ్మిదో ఓవర్‌లోనే క్రీజులోకి వచ్చిన ఆరో నెంబర్ బ్యాట్స్‌మన్ మనీశ్ పాండే అవకాశాన్ని అద్భుతంగా వినియోగించుకుంటూ తుదికంటా నిలిచాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా తానెంత విలువైన ఆటగాడో నిరూపిస్తూ లోయర్ ఆర్డర్‌తో కలిసి పోరాడే స్కోరును అందించాడు. అతడికి ఠాకూర్ (20) సహకారం అందించగా ఏడో వికెట్‌కు 43 పరుగులు వచ్చాయి. ఆఖర్లో సైనీ (11 నాటౌట్) రెండు ఫోర్లతో ఆకట్టుకున్నాడు. చివరి ఓవర్‌లో పాండే 36 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు.

**సూపర్ ఓవర్లలో కివీస్ తీరిది**

| ఫార్మాట్ | ప్రత్యర్థి | ఫలితం |
|---|---|---|
| టీ20 | వెస్టిండీస్ (2008) | ఓటమి |
| టీ20 | ఆస్ట్రేలియా (2010) | గెలుపు |
| టీ20 | శ్రీలంక (2012) | ఓటమి |
| టీ20 | వెస్టిండీస్ (2012) | ఓటమి |
| వన్డే | ఇంగ్లండ్ (2019) | ఓటమి |
| టీ20 | ఇంగ్లండ్ (2019) | ఓటమి |
| టీ20 | భారత్ (2020) | ఓటమి |
| టీ20 | భారత్ (2020) | ఓటమి |



## పాపం.. కివీస్!

**సూ**పర్ ఓవర్... ఈ మాట వింటేనే కివీస్ వెన్నులో వణుకు పుడుతోందిప్పుడు. ఒకటా, రెండా మరి.. ఏకంగా ఎనిమిదిసార్లు ఈ నరాలు తెగే ఉత్కంఠను వారు అనుభవించారు. అప్పుడెప్పుడో 2010లో మాత్రమే ఆసీస్‌తో జరిగిన టీ20లో గెలవగలిగారు. ఇక ఏడుసార్లు ఈ 'ఓవర్' వారికి గుండెకోతనే మిగిల్చింది. ఇందులో గతేడాది వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్ కూడా ఉండడం వారి బాధను తారస్థాయికి తీసుకెళ్లింది. అయితే ఈ చివరి రెండు మ్యాచ్‌ల్లో సూపర్ ఓవర్లకు దారి తీసిన పరిస్థితి మాత్రం కివీస్ స్వయంకృపారాధమే. సులువుగా నెగ్గాల్సి ఉన్నా ఒత్తిడిలో పడిపోయి బ్యాట్లు ఎత్తేశారు. ఎందుకంటే బుధవారం జరిగిన మూడో టీ20లో వారి విజయానికి నాలుగు బంతుల్లో రెండు పరుగులే కావాల్సి ఉండగా చేతిలో ఆరు వికెట్లున్నాయి. ఇక తాజా మ్యాచ్‌లో 12 బంతుల్లో 11 పరుగులు, ఏడు వికెట్లున్నా కూడా జరిగిందేమిటో అందరికీ తెలిసిందే.. ఇక వారు నిర్ణీత ఓవర్లలోనే తాడో పేడో తేల్చుకోవడం మంచిదేమో!

**సూపర్ ఓవర్ సాగిందిలా..**

| న్యూజిలాండ్ | భారత్ |
|---|---|
| బౌలర్: బుమ్రా | బౌలర్: సౌతీ |
| సీఫెర్ట్ (2) | రాహుల్ (6) |
| సీఫెర్ట్ (4) | రాహుల్ (4) |
| సీఫెర్ట్ (2) | రాహుల్ (అవుట్) |
| సీఫెర్ట్ (అవుట్) | కోహ్లీ (2) |
| మన్రో (4) | కోహ్లీ (4) |
| మన్రో (1) | -- |
| 13 పరుగులు | 16 |

**స్కోరుబోర్డు**

**భారత్:** రాహుల్ (సి) శాంట్నర్ (బి) సోధీ 39; శాంసన్ (సి) శాంట్నర్ (బి) కుగ్లెయిన్ 8; కోహ్లీ (సి) శాంట్నర్ (బి) బెన్నెట్ 11; శ్రేయాస్ (సి) సీఫెర్ట్ (బి) సోధీ 1; దూబే (సి) బ్రూస్ (బి) సోధీ 12; మనీశ్ పాండే (నాటౌట్) 50; వాషింగ్టన్ సుందర్ (బి) శాంట్నర్ 0; ఠాకూర్ (సి) సౌతీ (బి) బెన్నెట్ 20; చాహల్ (సి) సీఫెర్ట్ (బి) సౌతీ 1; సైనీ (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 165/8. వికెట్ల పతనం:** 1-14, 2-48, 3-52, 4-75, 5-84, 6-88, 7-131, 8-143. **బౌలింగ్:** సౌతీ 4-0-28-1; కుగ్లెయిన్ 4-0-39-1; శాంట్నర్ 4-0-26-1; బెన్నెట్ 4-0-41-2; సోధీ 4-0-26-3.

**న్యూజిలాండ్:** గప్టిల్ (సి) రాహుల్ (బి) బుమ్రా 4; మన్రో (రనౌట్) 64; సీఫెర్ట్ (రనౌట్) 57; బ్రూస్ (బి) చాహల్ 0; టేలర్ (సి) శ్రేయాస్ (బి) ఠాకూర్ 24; మిచెల్ (సి) దూబే (బి) ఠాకూర్ 4; శాంట్నర్ (రనౌట్) 2; కుగ్లెయిన్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 165/7. వికెట్ల పతనం:** 1-22, 2-96, 3-97, 4-159, 5-163, 6-164, 7-165. **బౌలింగ్:** శార్దూల్ ఠాకూర్ 4-0-33-2; నవ్‌దీప్ సైనీ 4-0-29-0; బుమ్రా 4-0-20-1; చాహల్ 4-0-38-1; సుందర్ 2-0-24-0; దూబే 2-0-14-0.

**మహిళల ఫైనల్ నేడు**

**ముగురుజా x సోఫియా**



ము. 2 గం. నుంచి సోనీ సిక్స్‌లో



# జొకో..కాచుకో!



- ఫైనల్లో డొమినిక్ థీమ్
- సెమీస్‌లో జ్వెరేవ్‌పై గెలుపు
- ఆస్ట్రేలియన్ ఓపెన్

**మెల్‌బోర్న్:** ఐదోసీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ప్రవేశించాడు. శుక్రవారం హోరాహోరీగా జరిగిన పురుషుల రెండో సెమీస్‌లో థీమ్ 3-6, 6-4, 7-6 (7/3), 7-6 (7/4)తో ఏడోసీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ (జర్మనీ)ని చిత్తుచేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్‌తో థీమ్ తలపడతాడు. 26 ఏళ్ల థీమ్‌కిది తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్. అలాగే మెల్‌బోర్న్ పార్క్‌లో అంతిమ సమరానికి చేరిన మొదటి ఆస్ట్రియా దేశ ఆటగాడిగా అతడు రికార్డు సృష్టించాడు. జొకోతో మ్యాచ్‌ను తాను తప్పక గెలుస్తానన్న విశ్వాసాన్ని డొమినిక్ వ్యక్తంజేశాడు. గత రెండు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్స్‌లో థీమ్‌కు పరాజయమే ఎదురైంది. కానీ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ ఫైట్ ఆ రెండింటికి భిన్నంగా ఉంటుందని అతడు అభిప్రాయపడ్డాడు. రాడ్ లేవర్ ఎరీనాలో దాదాపు మూడున్నర గంటలు ఉక్కపోత, వర్షం మధ్య థీమ్, జ్వెరేవ్ సెమీస్ కొనసాగింది. తొలి సెట్‌ను 22 ఏళ్ల జ్వెరేవ్ తేలిగ్గా గెలుచుకోగా.. నువ్వానేనా అనేలా సాగిన మిగిలిన మూడు సెట్లలో అద్భుతంగా ఆడిన థీమ్ మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. 10 ఏస్‌లు సంధించిన డొమినిక్..43 విన్నర్లు కొట్టాడు. మరోవైపు 16 ఏస్‌లు వేసిన జ్వెరేవ్ 46 విన్నర్లు సంధించాడు.

**బబోస్ జోడీకి డబుల్స్ టైటిల్:** మహిళల డబుల్స్ టైటిల్‌ను తిమియా బబోస్ (హంగేరి), క్రిస్టినీ మ్లడెనోవిక్ (ఫ్రాన్స్) జోడీ గెలుచుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో బబూస్ ద్వయం 6-2, 6-1తో వింబుల్డన్ చాంపియన్, టాప్‌సీడ్ సీ సు వెల్ (తైవాన్)-బార్బరా స్ట్రికోవా (హంగేరి) జంటను కంగుతినిపించింది. బబూస్-క్రిస్టినీ ఈ ట్రోఫీ అందుకోవడం ఇదో రెండోసారి కావడం విశేషం. 2018లోనూ ఈ జోడీ విజేతగా నిలిచింది.

## న్యూజిలాండ్ 'ఎ' 385/5

**క్రైస్ట్‌చర్చ్:** డేన్ క్లీవర్ (111 నాటౌట్), మార్క్ చాప్‌మన్ (85 నాటౌట్) సత్తా చాటడంతో ఇండియా 'ఎ'తో అనధికార టెస్ట్‌లో న్యూజిలాండ్ 'ఎ' భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 105/2తో శుక్రవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ 'ఎ' ఆట ఆఖరికి ఐదు వికెట్లకు 385 పరుగులు చేసింది. భారత బౌలర్లలో సందీప్ వారియర్ రెండు వికెట్లు, సిరాజ్, ఇషాన్ పోరెల్, షాబాజ్ నదీమ్ ఒక్కో వికెట్ సాధించారు. భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 216 పరుగులు చేసింది.

## వాలీబాల్ విజేతలు యూపీ, బెంగాల్

**రాజంపేట (ఆంధ్రజ్యోతి):** కడప జిల్లా రాజంపేటలో ఐదురోజుల క్రితం మొదలైన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. బాలికల విభాగం ఫైనల్లో కేరళపై పశ్చిమ బెంగాల్, బాలుర టైటిల్‌పోరులో తమిళనాడుపై ఉత్తరప్రదేశ్ విజయం సాధించి చాంపియన్లుగా నిలిచాయి. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి ట్రోఫీలు అందజేశారు.



## క్రికెట్ సలహా కమిటీలో మదన్‌లాల్, ఆర్పీసింగ్, సులక్షణ

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ పేసర్లు రుద్రప్రతాప్ సింగ్ (ఆర్పీ సింగ్), మదన్‌లాల్, మహిళా మాజీ వికెట్ కీపర్ సులక్షణా నాయక్‌లకు క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ)లో చోటు దక్కింది. ఈ ముగ్గురితో కలిపి సీఏసీ త్రిసభ్య కమిటీని బీసీసీఐ శుక్రవారం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఏడాదిపాటు ఉంటుందని బీసీసీఐ కార్యదర్శి జే షా తెలిపారు. ఈ నూతన కమిటీ త్వరలోనే ఎమ్మెస్కే ప్రసాద్, గగన్ ఖోడా స్థానంలో కొత్త సెలెక్టర్లను ఎంపిక చేయనుంది. సీఏసీలో అతి పిన్న వయసు సభ్యుడైన 34 ఏళ్ల ఆర్పీ సింగ్.. 14 టెస్టులు, 58 వన్డేలు, 10 టీ20లు ఆడాడు. 1983 వరల్డ్‌కప్ విజేత జట్టులో సభ్యుడైన 68 ఏళ్ల మదన్‌లాల్ 39 టెస్టులు, 67 వన్డేల్లో ప్రాతినిథ్యం వహించాడు. 41 ఏళ్ల సులక్షణ రెండు టెస్టులు, 46 వన్డేలు, 31 టీ20ల్లో పాల్గొన్నది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.

epaper.andhrajyothy.com